

ఆంధ్ర సచిత్ర వార పత్రిక
కొత్త సీరియల్
జీవితం మైనస్ సెంటిమెంట్
యర్రంశెట్టి శాయి
15-6-84
180 పైసలు


ప్రేమ్ సబ్బుతో స్నానం
రోజంతా ఉల్లాసం
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చి సహజ
సౌందర్యమును పెంపొందించు సబ్బు ప్రేమ్.
దీని స్వచ్ఛమైన నురగ, పరిమళము
మీ మనసును పులకింపజేయును.
Prem
REFRESHING SOAP
PREM
గులాబి మరియు ఆకుపచ్చ
రంగులలో లభించును
Prem
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
Imageads M-1783



ముఖచిత్రం

మా అభిమాన ఆంధ్రసచిత్రవారపత్రిక మా అభిమాన నటి అంబిక ముఖచిత్రంతో దేదీప్యమానంగా వెలిగి మమ్మల ఆనంద పరవశుల్ని చేసింది.

వై. చంద్రశేఖరన్, చిత్తూరు.

* * *

మా అభిమాన నటి 'సుహాసిని' ముఖచిత్రం ముద్దొచ్చేలా చిత్రించిన 'కాజాన్'గార్కి మా హృదయపూర్వక కుసుమాంజలి.

ద్విభాష్యం కామేష్, ఇతరులు, మొగల్తూరు.

* * *

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 11-5-84వ తేదిన మీరు ప్రచురించిన అట్టమీద అందాల ఊర్వశి మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది.

డి. పద్మ, యం. లక్ష్మి, భీమవరం.

గుండె గొంతుకలోన

''అరుణోదయపు అందాల ముఖారవిందము
పూర్ణచంద్రునిబోలు నైనాల చందము''
—మాడజాడ ముద్దుగొల్పు—

నటి అరుణ ముద్దుమోముతో వెలువడిన 27-4-84 తేదీ వారపత్రిక మమ్మెంతో ఆకర్షించినది.

''గుండె గొంతుక లోన''— గణనీయమైన గుణముగల వ్యక్తులు ఎట్టివారైననూ ఏనాటికైననూ గుర్తింపబడ గలరని నిర్వచించిన— పంతుల జోగారావు గార్కి జోహార్లు....

నల్లా అభిమన్యుడు,
నైవేలి.

ఆశా కిరణం

''ఆశా కిరణం'' కథ మొదట్లోనే ''జనతా ఎక్స్‌ప్రెస్‌లో... ఓ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో...'' అంటూ రాశారు వారణాసి ప్రసాదరావుగారు.

జయదుబాషీగారు వారానికొక ఆణిముత్యం లాంటి ఆర్టికల్ రాస్తున్నారు.

హరిశ్రీ రామచంద్ర శర్మ,
కొత్తఢిల్లీ.

కథలు

18-5-84 గల వారపత్రికలో ప్రచురించిన ''హరిశ్చంద్రుడు'' చాలా నిజాయితిగాను, యథార్థానికి బహు దగ్గరగానూ వుంది. నిజానికి హరిశ్చంద్రుడు విధి నిర్వహణలో యేలాటి బాధను అనుభవించాడో, మంత్రిగారు వేంచేయు సమయాన అతనెందుకని నిద్రలో వున్నాడో, గౌరవనీయులయిన మంత్రివర్యులు తమ వాహనాన్ని ఆపి ఆరాతీసి, ఆతని నిద్రకు బాధ్యులెవరో తెలుసుకొని ఆ వ్యక్తిని సస్పెన్షన్ చేసి హరిశ్చంద్రునికి – ఆ మరునాటి టపాలో ప్రమోషన్ ఆర్డర్సును పంపించి వున్నట్లయితే, హరిశ్చంద్రుని కథకు జీవం వచ్చి వుండేది.

షేక్. మస్తాను—గాలిబీబి, ముమ్మలనేని
వారిపాలెం, రేపల్లె.

* * *

ఈ వారం 18.5.84 అందాల అంబిక ముఖచిత్రం చాలా ఆకర్షణీయంగా వుంది. ముఖ్యంగా నందంరామారావుగారి 'హరిశ్చంద్రుడు' కథ నేటి సమాజానికి కనువిప్పు కలిగించేలా వున్నది.

ఎల్. పి. చంద్ర, ధర్మవరం.

* * *

ఎయం అయోధ్యారెడ్డిగారి ''పొగమేడలు'' [4-5-84] పత్రికకే హైలైట్. తండ్రి తాగుబోతు అవటం వల్ల రాములు లాంటి ఎందరు తెలివైన విద్యార్థులు అధఃపాతాళానికి తొక్కేయ్యబడుతున్నారో రచయిత చాలా చక్కని శైలిలో పాఠకులకు వివరించారు.

సి. హెచ్. శేఖరుబాబు, ఉండి.

ఈ వారం [18-5-84] ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రచురించిన ''ఓ పెళ్ళి కథ''. చాలా బాగున్నది. కథలోని సన్నివేశాలు కళ్ళకు కట్టినట్లున్నవి. ముఖ్యంగా పెండ్లి చేయబోవు ఆడపిల్లలు గల తల్లిదండ్రులు, పెండ్లి కావలసిన కన్యలు అనేక వివరాలు అందుండి తెలిసికొనుటకు త్రోవ జూపుచున్నది. రచయిత్రిగార్కి మా కృతజ్ఞతలు.

పి. వి. నరసింహమ్, తిరుపతి.

* * *

కన్నేపల్లి గోపాలకృష్ణగారు రచించిన ''అతని పేరు మనిషి'' కథ చాలా బాగుంది.

నందిగం సిరిబాబు, నందిగామ.

సీరియల్స్

''ఈ రాగాని కదే తాళం'' సీరియల్ చాలా బాగుంది. ''గోరంత దీపం'' సీరియల్ కూడా చాల బాగుంది. చక్కిలం విజయలక్ష్మి గార్కి, వింధ్య వాసిని గార్కి నా అభినందలు.

యస్. కాలేషా అక్ ఫీహా, కువైట్.

* * *

సుహాసిని ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వార పత్రిక చక్కగా ఉన్నది. శ్రీ ముదిగొండ శివప్రసాద్ గారి ''స్వప్న భంగం'' సీరియల్ చాల బాగున్నది.

రావికంటి శివమూర్తి, కరినగరం.

* * *

4-5-84 వ తేదితో వెలువడిన మా అభిమాన పత్రిక ముఖచిత్రం నటి ''సుహాసిని'' అత్యంత ఆకర్షణీయంగా, ముగ్ధమనోహరంగా ఎంతో ఆహ్లాదాన్ని కలిగించింది. కొత్తసీరియల్స్ రెండింటిలోను ''ఉదయసంధ్య'' ఆకట్టుకుంది. ''ఈ రాగాని కదే తాళం'' మంచి ఉత్సుకతతో కొనసాగుతూ పత్రిక కోసం ఎదురుచూసేలా చేస్తోంది. రచయిత్రి విజయలక్ష్మి గారికి ధన్యవాదాలు.

యన్. మాధవరావు, మిత్రబృందం,
విలసగ్రామము.

* * *

గోరంత దీపం చాలా హాయిగా ముగిసింది. వింధ్య వాసిని గారికి మా అభినందలు.

మూర్తి ప్రేమ్‌కుమార్, భిలాయి.


* * *

డాక్టర్ కె. వి. కృష్ణకుమారిగారు రచించిన ''కర్మయోగి'' సీరియల్, చాలా బాగుంది. పి. రాజేశ్వర్‌రాజు, వేములవాడ.

న్యూఢిల్లీ లేఖ

11-5-1984 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమయిన డా॥ జయదుబాషి గారి వ్యాసము చాలా బాగుగా యున్నది. దుబాషి గారికి మా కృతజ్ఞతలు.

బ్రుంగి శ్రీనివాసులు, కలువకుర్తి. ★



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 15–6–'84

శ్రీ రక్తాక్షినామ సం. జ్యేష్ఠ బ. విదియ

సంపుటము 76 : సంచిక 40

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 1-80

ఆరు మాసాల చందా రు. 46-80

పోస్టులో ఏడాదిచందా రు. 101-40

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం, విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి "శ్రీలక్ష్మి"

(ఫొటో : జి. కె. కన్నన్)

పంజాబ్ హత్యలకి కారణం రిజర్వ్ పోలీసులా?!

ప్రస్తుతం జనతా పార్టీలో చోటు చేసుకున్న ప్రముఖ సోషలిస్టులు శ్రీ ఎన్. జి. గోరే, శ్రీ యస్. ఎం. జోషీ గత నెలలో అమృత్‌సర్ వెళ్ళారు. అక్కడ వాళ్ళు సాక్షాత్తూ ప్రధాన మంత్రి కుమారుడి చేత గొప్ప మత నాయకుడిగా అభివర్ణించబడిన, బంగారుగుడిలో తలదాచుకొన్న ఆయన వల్ల అపహాస్యం పాలైనారు. విచారించాల్సిన విషయం ఏమిటంటే శ్రీ గోరే, శ్రీ జోషీలు భింద్రన్‌వాలె చెప్పిందే విన్నారు. తలలు పండిన ఈ రాజకీయ వేత్తల వాస్తవ విషయ పరిజ్ఞానానికి భింద్రన్‌వాలె నవ్వుకుంటూ ఉంటాడు.

పూనే నించి వెళ్ళిన ఈ ఇద్దరు నాయకులకీ, బంగారు గుడి జనరల్‌కీ మధ్య జరిగిన సంభాషణని బొంబాయి వార్తాపత్రిక ఒకటి పూర్తిగా ప్రచురించింది. పవిత్రమైన ఆ నగరంలోనూ, పంజాబ్‌లో ఇతరచోట్లా జరుగుతున్న హత్యలు, మారణ హోమాల విషయం వదిలేస్తే వారిద్దరికీ, భింద్రన్ వాలెకీ మధ్య జరిగిన సంభాషణ ఉల్లాసకరంగానే ఉందనవచ్చు. ఆ ఇద్దరు సోషలిస్టు నాయకులూ అమృతసర్‌లో చర్చలు జరుపుతున్న ఆ రోజే అరడజను కన్నా ఎక్కువ మంది దాడికి గురై హతమార్చబడ్డారు. దీనికి కారణం వాళ్ళు హిందువులు కావటమే. అంతకు ముందు రోజు కూడా అలాగే జరిగింది. అయినా శ్రీ గోరే, శ్రీ జోషీలు ఆ విషయాన్ని గురించి భింద్రన్‌వాలెని అడగలేదు. సోషలిస్టులు మతపరంగా ఆలోచించరు. అయితే ముస్లింలపై అలాంటిది జరిగితే మాత్రం ఊరుకోరు. ఆ ఇంటర్‌వ్యూని దాదాపు పూర్తిగా ఇక్కడ ఇస్తున్నాను :

గోరే : మీరు సంత్‌గా, జెర్నెయిల్ సింగ్‌గా ఎలా అయినారు ?

భింద్రన్ : గోరేజీ! నా పేరు గురించి మీకెందుకీ చింత. మనం రాజకీయాలు ముచ్చటించుకుందాం. ఇందిరాగాంధి గురించి ఏదైనా చెప్పండి.

గోరే : నేను తిరిగి వెళ్ళిన తర్వాత సాధనలో ఏదో ఒకటి రాయాలి. మీ పేరు సరిగ్గా తెలుసుకుంటేమంచిది. దానిమీద ఓ రెండు పేరాలు రాయగలుగుతాను.

జోషి : స్వతంత్రమైన, సర్వసత్తాక ప్రతిపత్తిగల ఖలిస్తాన్ కావాలని మీరు అడుగుతున్నారా ?

భింద్రన్ : ఖలిస్తాన్ గురించి ఎవరడుగుతున్నారు ? మేము మూర్ఖులమా ? భారత దేశంలోనే ఉండాలని మేము నిశ్చయించుకున్నాము. దయచేసి మీరు ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం చదవండి.

గోరే : చూడండి యస్.ఎం.గారూ ! నేను మీకేం చెప్పాను ? ఈయన భారతదేశానికి పూర్తిగా విధేయుడు, మీరు అనవసరంగా ఆయనని వేర్పాటు వాదిగా చిత్రిస్తున్నారు. ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానంలో ఖలిస్తాన్ ప్రసక్తే లేదు.

భింద్రన్ : సత్‌శ్రీ అకాల్ ! మీ స్వామికూడా ఇలాగే మాట్లాడ్తారు.

యస్. ఎం. : మా స్వామేమిటి ? మేము స్వాములకి వ్యతిరేకం. స్వాములు మాకెవరూ లేరు.

భింద్రన్ : సుబ్రమణ్యంస్వామి. హత్యలకి కేంద్ర రిజర్వ్ పోలీసులదే బాధ్యత అని స్వామి అన్నారు. గురునానక్ పుట్టిన ఈ పవిత్ర భూమిలో ఇలా హత్యలు జరగటం నాకు చాలా బాధగా ఉన్నది.

గోరే : యస్. ఎం ! ఈ హార్వర్డు డాక్టర్ (స్వామి) జనసంఘీ కాజాలడని నేనెప్పుడూ అనుకుంటూనే ఉన్నాను. ఆయన నిశ్చయంగా మనవాడే.

యస్. ఎం : సంత్ జీ ! మీరిక్కడ ఆయుధాలని సేకరిస్తున్నారని విన్నాము. కానీ నా కేమీ అలాంటివి కనిపించడం లేదు. వాటిని మీరు ఇక్కడ ఉన్న నేలమాళిగల వంటి దానిలో ఎక్కడైనా దాచి ఉంచారని నేను అనుకోడం లేదు.

భింద్రన్ : జోషీజీ ! ఏమిటి మీరంటున్నది ? ఇది పవిత్ర దేవాలయం. ఇక్కడ ఆయుధాలేమీ లేవు, నేలమాళిగలు ఉన్నాయి. కానీ వాటిలో ధాన్యం మాత్రమే ఉంది. మా దగ్గర ఉన్నది కృపాణం మాత్రమే. అది భగవంతుని ఆయుధం.

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

గోరే : ఓహో ! కృపాణమా ! అవును నిజమే. ప్రతి వ్యక్తీ తనతోపాటు ఏదో ఒక మత చిహ్నాన్ని కలిగి ఉండాలి.

భింద్రన్ : గోరేజీ! మీకు కృతజ్ఞతలు. గురూకీ ఫతేహ్ !

యస్. ఎం. : ఇక్కడ ఎవరికీ గెరిల్లా విద్యలు నేర్పుతున్నట్లు మాకు కనిపించలేదు.

భింద్రన్ : తోబా ! తోబా ! హరి మందిర్‌లో గెరిల్లా విద్యలా ? ఇక్కడ గ్రంథ్‌సాబ్, భజనలు మొదలైనవి ఉన్నాయి. మేము అహింసని ఆరాధించేవాళ్ళం.

గోరే : అరె ! దేవాలయం వెలుపల జనం ఎంత దుష్ప్రచారం చేస్తున్నారు. సంత్‌జీ! అసలు మీ ఉద్దేశాలు ఏమిటి ?

భింద్రన్ : ఇది మంచి ప్రశ్న. భారతదేశంలో శివాజీ, గురుగోవింద్‌ల కాలంలో ఉన్నటువంటి ఐక్యతకి ఇప్పుడు ప్రమాదం ఏర్పడింది. మేము దేశంలో ఐక్యతకోసం పోరాడుతున్నాము. అందుకు మాకు శాంతి కావాలి. హత్యలు, తుపాకులు నా దృష్టిలో శాపాల వంటివి.

యస్ ఎం. : మీ ఆలోచనలు ఎంత గొప్పవి సంత్‌జీ ! అసలు నిజాలని మేము ఇక్కడ తెలుసుకున్నాము. మీరు పూర్తిగా అమాయకులు. పంజాబ్ పరిస్థితి పూర్తిగా క్షీణించి పోవడానికి రిజర్వ్‌పోలీసులే కారణం. ఈ విషయాన్ని మేము ప్రపంచానికి తెలియచేస్తాము. సంత్‌జీ ! రాజకీయ నాయకులు మీకు అన్యాయం చేస్తున్నందుకు మాకు చాలా విచారంగా ఉంది. సంత్ భింద్రన్ వాలె కీ ఫతేహ్ !

అది అక్కడితో ముగిసింది. ఆ తర్వాత భింద్రన్‌వాలె వాళ్ళని భోజనం చెయ్యమని కోర్తారు. ఇలాంటి గొప్ప వ్యక్తిని కలుసుకోడం భోజనం కన్నా ఎంతో ఎక్కువ అంటారు గోరే.


యస్.ఎం., గోరేలు అక్కడి నుంచి ఢిల్లీ వచ్చి పత్రికల వారిని కలవకుండా ముందుగా శ్రీమతి గాంధీని కలుసుకున్నారు. ఢిల్లీలో ఉంటే శ్రీ గోరే మొట్టమొదట కలుసుకునేది శ్రీమతి గాంధీనే. ఇది నాకు అంతుపట్టని విషయాలలో ఒకటి. బహుశః తన పార్టీ వాడైన సుబ్రమణ్యంస్వామికన్నా నెహ్రూగారి కుమార్తే మరింత సన్నిహితమైన వ్యక్తిగా ఆయన భావిస్తారేమో. భింద్రన్‌వాలె నుంచి మంచి ప్రశంసలు అందుకున్నా కూడా ఆయన అభిప్రాయం మారలేదు!

ఇలాంటి ఇంటర్‌వ్యూని ఏ ఉపసంపాదకుడైనా తన బల్లమీదకి వచ్చీ రాగానే అడ్డంగా

కొట్టేసి దాని ఉనికే లేకుండా చేసి ఉండేవాడు. ప్రొఫెషన్‌లో ఉన్న పత్రికా రచయిత ఎవరైనా ఈ ఇద్దరు ప్రముఖులకన్నా బాగాచేసి ఉండేవాడు. వారిలో ఒకరు 50 సంవత్సరాలపైగా రాజకీయ అనుభవం ఉన్న రచయిత, పత్రికా రచయిత కూడా. యస్. ఎం. జోషి పక్కనే ఉండి ఆయన్ని ఉత్సాహపరుస్తూ భింద్రన్‌వాలెని సంతోష పెట్టడానికి తోడ్పడ్డారు. వీళ్ల తీరు ఆ వ్యక్తికి సంబంధించిన మంచినే తీసుకోవాలనే ఉద్దేశంతోనే వెళ్లినట్లు ఉన్నది. అది పోలీసుల పనే అయిఉంటే మరి ఇంతమంది ఎందుకు చంపబడుతున్నారని వాళ్లు భింద్రన్‌వాలెని ఎందుకు అడగలేదు ? చండీఘర్‌లో తివారీని, ఢిల్లీలో మాన్ చందాని పోలీసులు చంపారా ? ఒక డెప్యూటీ పోలీసు సూపరింటెండెంట్‌ని, అతని కుటుంబాన్ని – భార్య, కుమారుడు, కుమార్తె – పోలీసులు తుదముట్టించారా? లాలాజగత్ నారాయణ్, అతని కుమారుడు రమేష్ చందర్ – ఇద్దరూ గోరేకన్నా పేరెన్నికగన్న పత్రికా రచయితలు – పోలీసులచే హత్య చెయ్యబడ్డారా ?

ఈ ఇంటర్‌వ్యూలో నాకు నచ్చనిది అది ఒక పరిహాస ధోరణిలో సాగటం. హాస్యాస్పదంగా, నవ్వులాటగా, గోరే, జోషీలు సదాశివ పీఠంలో కూర్చుని తీరిగ్గా చతురోక్తులాడుకున్నట్లుందది. వాళ్లూ, వాళ్ల పార్టీవారూ పంజాబ్ సమస్యని ఇంత తేలికగా తీసుకుంటున్నారా ? ఇది నేను వాళ్లను అడగాలనుకుంటున్న ప్రశ్న. వాళ్లు ఢిల్లీలో పత్రికలవాళ్లని కలిసినప్పుడు పత్రికా రచయితలు వాళ్లిద్దర్నీ తినేసినంతపని చేశారు. సాధారణంగా ఏ పత్రికా రచయిత అయినా అలాగేచేస్తాడు. అమృతసర్‌లో వాళ్ల వ్యవహారం ఎంత హాస్యాస్పదంగా ఉందో పత్రికా సమావేశంలో కూడా అలాగే ఉంది.

చివరిసారిగా గోరేని నేనొక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. ఢిల్లీలో ఆయన శ్రీమతి గాంధీని కలుసుకున్నప్పుడు హత్యలకి కారణం రిజర్వ్ పోలీసులేనని భింద్రన్ నింద మోపాడన్న విషయం ఆమెకి చెప్పి, అది నిజమో కాదో తెలుసుకున్నారా ? అది నిజం కాకపోతే ఆ విషయాన్ని ఆయన తిరిగి భింద్రన్‌కి తెలియ చేశారా ? లేక పిల్లవాడు గుప్పెళ్లతో పంచదార బొక్కి అదే ఘనకార్యమని భావించినట్లుగానే వీళ్లు కూడా భింద్రన్‌వాలే పద్ధతే బాగుందనుకుంటున్నారా ? దీనికి గోరే, జోషీలు, కనీసం గోరే అయినా తాను ఈసారి మరో ప్రముఖ వ్యక్తిని ఇంటర్‌వ్యూ చేసినప్పుడు సమాధానం చెప్తారని అనుకుంటాను. అప్పుడు నేనే కాదు, ఎవరైనా అది పడిన వార్తా పత్రికని విసిరి పారేస్తారు, ఎందులోనో మీకూ తెలుసు. ★



ధ్వని - ప్రతిధ్వని

కాయితి అప్పారావు

అదే పనిగా ఆలోచిస్తున్న అనసూయను దూరం నుంచే జాలిగా చూస్తూ అనుపమ నెమ్మదిగా వెళ్ళి తాకింది. వెనుతిరిగిన అనసూయ 'వాళ్ళ త్రోవలో వుంటారు పిన్నీ! వచ్చిన వాళ్ళకు నేను నచ్చకపోను...అయినా వాళ్ళకోరే కోర్కెలు ... నాన్న తట్టుకోగలరంటావా.'' గోముగా అనుపమ చేతిని నిమిరింది.

''నీ అందచందాలు చూసేక సూర్యం దాసోహమనక మానడు. అందమైన భార్య సమకూడగానే తలితండ్రులు తృణప్రాయంగా కనిపిస్తారు. వాళ్ళ చెప్పే ఏ హితోక్తులైనా అంతగా పట్టించుకోడు అనసూ! గురజాడవారి విజయనగర వాసులు. ఉద్యోగరీత్యా విశాఖలో కాపరం. ఆయన కన్యాశుల్కం చదివినవారు కట్నాల జోలికి పోరనుకుంటాను.''

''నీ నోటి ఆశీర్వచన ఫలం—గుండెల మీది కుంపటిలా కలకాలం కన్నవారింట పడుండేకన్న ఏ ఒకరినో భర్తగా పొందటం మంచిది పిన్నీ! ఏదీ... ఆ చేతిలోని దువ్వెన ఇలాతే! తల దువ్వుతా'' అంటూ అనుపమ కురులను దువ్వింది.

''అక్కడక్కడ తెల్ల వెంట్రుకలున్నాయి. అవి ఊడిపోకుండ మాత్రం చూడు అనసూయా! కట్న పిశాచానికి బలైపోయిన మీ పిన్ని ఏ ఒక్కరికీ అర్ధాంగి కాలేక పోయిందన్న తీపి గుర్తుల్లా తెల్ల వెంట్రుకలు ... అందుకనే అవంటే నాకు అభిమానం''

అనసూయ దిగులుగా వింటూనే మిగిలిన కురులు సవరించింది.

''నా తరువాతది నా చెల్లెలు తెగించి ఉద్యోగంలో చేరి—యీ జమ్‌షెడ్‌పూర్‌లో పెళ్ళి చేసుకుని నన్నిక్కడే పెట్టుకుని ఆదరించబట్టి గాని లేకపోతే తలితండ్రులు లేని నాగతేమై వుంటుంది అనసూయా! నన్ను చూడటానికొచ్చిన వాళ్ళందరి మాటలూ ఒకే మూసలో పోసినట్టుండేవి. నాకైతే పెళ్ళికూతురు నచ్చింది. మా అమ్మా నాన్నలు కట్న కానుకలంటున్నారు. వాళ్ళమాటకాదని చేసుకుంటే అనుపమ అత్తవారింట దెప్పుడు మాటలతో ఏం సుఖపడుతుందని అనే వారే అందరూను''

''మీ బంధువులేగా సూర్యం! మంచివారేనా పిన్నీ?''

''ఎప్పుడో చిన్నప్పుడు చూసాను. ఇక్కడ నువ్వున్నావని మీ నాన్నగారు రాయమంటే రాశాను. ఇంతదూరం వస్తున్నారంటే నీ అందచందాలు వున్నదున్నట్టు రాశాను అనసూ'' అంటుండగా విశ్వనాథం పువ్వుల పొట్లం తీసుకువచ్చి ''మామయ్య నిన్ను తయారై వుండమన్నారు'' అంటూ అనసూయ వైపు అమాయకంగా చూస్తున్నాడు.

''చూశావా పిన్నీ! మామయ్య స్కూల్ ఫైనల్ తప్పడంచేత కంపెనీ డ్రైవరుగా చేరవలసివచ్చింది. నే ఇంటర్ ఫైపు పాసయాను. అయినా నాన్న నే ఉద్యోగం చేయటానికంగీరించటంలేదు. తెలుగువారికి తెలుగు సంస్కృతికి దగ్గరసా చేరుస్తానంటూ మామయ్యను కాదంటున్నారు. తల్లిలేని పిల్లను. ఆయన మనసు నొప్పించటం నాకేమాత్రమిష్టంలేదు పిన్నీ ... మరో తొమ్మిది మాసాల్లో రిటైరై పోతున్నారు'' అంటుండగా విశ్వనాథం అనసూయ వైపు జాలిగా చూస్తూ కంపెనీవైపు నడచిపోయాడు.

సాయంత్రం నాలుగు గంటల సమయం. పెళ్ళి చూపులవారు అనుపమ ఇంట్లో అడుగుపెట్టారు. విశ్వనాథం బావకన్న ఎంతో అందంగా వున్న సూర్యాన్ని కిటికీలోంచి చూసిన అనసూయ ఆనందానికంతులేదు.

''అందం — ఆదర్శం... ఒకదానితో నొకటి సఖ్యతగా వుండవు అనసూ!'' అని ఎవరో ఘోషిస్తున్నట్టనిపించింది.

''ఆయనే సూర్యం అనసూ! ఆయన మీ కాబోయే మామగారు. మీ విజయనగరాన్ని గురజాడ సంస్కృతిని, మనతెలుగుదేశాన్ని మరచిపోలేదు మామగారూ అన్నట్టుగా గురజాడ కన్యాశుల్కాన్ని చేతిలో పట్టుకుని మరీ పైకి పెళ్ళివాళ్ళిద్దరకూ నమస్కరించు. యీ మహా కావ్యాన్ని చూసినవారు కట్నాల విషయం అంతగా పట్టించుకోరు'' అని అనుపమ అనసూయను పైకి పంపింది. వాళ్ళిద్దరకూ వినయపూర్వకంగా నమస్కరించింది. రెప్పార్పకుండా సూర్యం అనసూయ అందచందాల్ని చూస్తున్నాడు.

''అమ్మాయి విషయం అనుపమ రాసింది. అందుకే ఇంతదూరం శ్రమనుకోకుండా వచ్చాం. కథలు కావ్యాలు కాలక్షేపానికేనమ్మా! వాటిని చదివి మారిపోతే ప్రతీ సంసారీ సన్యాసుల్లో కలిసిపోవలసిందేనమ్మా! ఆ నాటకాలు ప్రచారం చేసే రమణమూర్తి వాళ్ళను అడిగి చూడండి కట్నం లేకుండ చేసుకున్నావా బాబూ అని ... సూటిగా సమాధానముండదు. చిరునవ్వుతో తప్పించుకుంటారు. కన్యాశుల్కం చేతబట్టి నమస్కరించినంత మాత్రాన కట్న కానుకలు తగ్గవమ్మా! అందరిలో తిరిగే నాకూ అబ్బాయికీ అవమానం ... అనుపమతో అన్నీ చెప్తాంగా! నిశ్చితార్థం పుచ్చుకోకుండ కాఫీ ఫలహారాలు తప్ప మీ ఇంట్లో భోజనం చెయ్యకూడదు. అవన్నీ అనుపమ ఇంట్లో కానిస్తాం.''

''మరో తొమ్మిది నెలల్లో రిటైరై పోతున్నాను. దగ్గరసా ముప్పైవేలరూపాయలు రావచ్చును. మీ కోర్కెలు తీర్చాలన్నా పెళ్ళి కావాలన్నా అంతవరకూ ఆగాలి బావగారూ!'' అన్నాడు అనసూయ తండ్రి.

''అనసూయ మాకు నచ్చింది. యీ సంబంధాన్ని ఎలాగూ విడిచేదిలేదు. ఈ సంబంధం తప్పటమంటే అది మా లోటుపాట్లవల్లేగాని మీ తప్పుగా మాత్రం భావించకండి'' అంటూ లేచి అనుపమ ఇంటికి వెళ్లారు.

''ఏరా సూర్యం! సిగ్గుపడకుండ చెప్పు ... అనసూయ ... నచ్చిందికదూ!''

''చాలందంగా వుందండత్తమ్మా! మా నాన్న... చౌకబారు పెళ్ళి కాకుండ కట్నకానుకలుండాలంటున్నారు. దాంతోనే చెల్లాయిల పెళ్ళి కావాలంటున్నారు.''

''సాహసించి ఎదురించి ముందడుగు వెయ్యలేవా సూర్యం?''

''నాలాంటి యువకులందరకూ పిరికితనం, బానిస తత్వం నరనరాల్లో జీర్ణించుకుపోయింది అత్తమ్మా!''

''ఉన్నదున్నట్టు చెప్పావు సూర్యం! నా తలలో యీ తెల్లవెంట్రుకలు మీ యువకుల భావాలకు తీపి గుర్తులుగా మిగిలిపోయి జీవితాంతం కన్య జీవితం గడపవలసి వచ్చింది. అయినా ఎదుటివారి బాధలు నీకెందుకులే! చిన్నత్తమ్మ వంట చేసింది. భోజనంచేసి టౌనంతా చూసిరండి. మా మరదిని తోడుగా పంపిస్తాను.''

''అనసూ! మంచి సంబంధమే... కాని మోయలేని కట్నకానుకలు. ఆ ఇంట పెళ్ళి కావలసిన ఐదుగురాడ పిల్లలున్నారు. వాళ్ళ రేపుదయమే తిరుగు ప్రయాణం. నీకు వాళ్ళిచ్చిన జాబితా చూపిస్తాను. దాని దగ్గర గురజాడ ఓడిపోక తప్పదు... చదవమంటావా అనసూ?''

''చల్లకు వచ్చి ముంత దాయడమెందుకు పిన్నీ? చదివి వినిపించు. వాటి ఖరీదుతో సూర్యం గారి సంస్కారాన్ని కొలతవేసి చూసుకుంటాను.''

అనుపమ కాగితాన్ని మెల్లగా విప్పింది. అనసూయ ఊహాలోకంలో విహరిస్తూ మౌనంగా వింటోంది.

''ముప్పైవేల కట్నం. బాల తొడుగు — ఆడపడుచుల కట్నం—పందిరి మంచం— సన్‌మేక్

డైనింగు టేబిల్ కుర్చీలతో సహా. ఫ్రిజ్ – మోటర్ సైకిల్ – వాచి–బట్టలు... భయపడకు అనసూ."

"భయమెందుకు పిన్నీ! ఎక్కడో ఒకచోట అనుకోని సంఘటనైతే వింతగా వినవచ్చు. దేశంలో ప్రతి మారుమూల జరిగే సాధారణ సంఘటనలు."

"రేపు వాళ్ళు బయలుదేరేముందు నాన్న గారిని కలుసుకుంటారు.. సూర్యాన్ని మరోమారు చూడాలనుంది కదూ?"

"ఎందుకుండదు పిన్నీ! పెళ్ళికాని కన్యల మనసెప్పుడూ ఉవ్విళ్ళూరుతుంటుంది. జీవితంలో ఇవే నా మొదటి పెళ్ళిచూపులు – చూసినవారు కాదన్నారో నా మనసు బాధకు గురవుతుంది పిన్నీ!"

"మరి యీ ధరల పట్టీ?"

"అది నాన్న చూసుకుంటారు ..."

మర్నాడు ఉదయం తిరుగు ప్రయాణమై సూర్యం తండ్రితోను అనుపమతోను అనసూయ ఇంటికి వెళ్ళాడు.

"అలాగే బాబూ! అప్పుడప్పుడు జాబులు రాస్తుండండి, రోజులెలా వున్నాయో తెలుసా? సంబంధం కుదరగానే సరికాదు. మా కట్నం కన్న ఎక్కువిచ్చి పెళ్ళికొడుకుల్ని కొంటున్న రోజులు... సంబంధం స్థిరపడి పోయిందికదా అని మేం ఎదురు చూస్తుంటాము. తీరా జరిగేది మరో అమ్మాయితో వివాహం."

"అలాగే బావగారూ! అనుపమతో అన్ని విషయాలు చెప్పాను. ఏవైనా విషయాలుంటే అనుపమతో చెప్పి రాయించండి... అమ్మా! అనసూయా! వెళ్ళొస్తాం. నీ రెండు చేతుల మధ్య తలక్రిందులుగా వ్రేలాడుతున్న కన్యాశుల్కం పుస్తకం. దానర్థం నన్ను గ్రహించమని చెప్పే సన్నివేశం – ఇలాంటివే పాతరోజుల్లో శాంతారావ్ లాంటివాళ్ళు తమ చిత్రాల్లో చూపించి శభాషని పించుకునేవారు. అవి కదిలే చిత్రాలు... ఇవి నిజజీవితాలమ్మా! వెళ్ళొస్తాం బావగారూ! అనుపమ అన్నీ వివరిస్తుంది మీకు. అన్నీ సమకూర్చుకుని సిద్ధంగా వున్నట్టు జాబురాస్తే, నా భార్యనుకూడ తాంబూళాలు మార్చుకోవడానికి తీసుకువస్తాను."

తనవైపు గంపెడాశతో చూస్తున్న అనసూయ చూపులతో చూపులు కలిపి వియోగ బాధతో తండ్రి వెనుక నడిచి వెళ్ళాడు సూర్యం.

* * *

"అనుపమ అత్తమ్మా! అనసూయ అందాన్ని వీలు చిక్కినప్పుడల్లా మనసులో ఆరాధించుకుంటున్నాను. నా స్నేహితులకామె అందచందాన్ని వర్ణించి చెపుతున్నాను. ఎన్నేళ్లయినా ఆగి ఆమెనే చేసుకుంటానని శపథం చేస్తున్నాను. నీవు మరోలా భావించకు. ఇందులో జతపరచిన జాబుని అనసూయ కందచేయాలి.



సరదాగా రాసిన జాబు. యువక హృదయం చేసే చిలిపి అల్లరి... సూర్యం.''

అనుపమ అనసూయను కలుసుకుని ''నా చేతిలో ఏముందో చెప్పుకో చూద్దాం అనసూ'' అనడిగింది.

''అంత జ్ఞానశక్తి నాకెక్కడిది పిన్నీ? ఏదో జాబులావుంది. ఆఁ... పెళ్లివారు క్షేమంగా చేరినట్టు రాసివుంటారు. వాళ్లు మరచిపోయిన జాబితాలో ఇంటాడవారు కోరిన కోర్కెల్నికూడ జతపరచి వుండవచ్చును'' అంది జాలిగా చూస్తూ.

''నాకు రాసిన జాబుతోపాటే నీకో జాబు కూడ ఇందులో పెట్టి పంపించాడు సూర్యం... బహుశా ప్రేమలేఖనుకుంటాను.'' అనసూయ అమాయకంగా చూస్తూ ''అలా రాయటం భావ్యమంటావా పిన్నీ?'' అంది.

''మా రోజుల్లో అది దోషం — యీ రోజుల్లో అది ఫేషన్... తప్పులేదులే! సరదాగా రాసివుంటాడు. చదివి చింపేయ్! వీలైతే నీవు కూడ ఓ ప్రేమలేఖ రాసిచూడు. అలా ఐతే హృదయాలు పెనవేసుకుంటాయి. లేదా నిర్లక్ష్యంగా వున్నావని అబ్బాయి మనసు మరో దారికి మరలగలదు.''

''అవును పిన్నీ! నాన్న తెలుగుదేశంలో స్థిరపడాలనుకుంటున్నారు. ఆయన ఆశ నిరాశ చెయ్యకూడదు.''

అనుపమ తిరిగి వెళ్లగానే అనసూయ సూర్యం తన పేర రాసిన జాబు విప్పింది.

''ప్రియమైన అనసూ! అందంతోపాటు వినయ విధేయతలు నీలో చూడగలిగాను. సంస్కారానికి ప్రతిరూపంలా నా కండ్లముందు కన్యాశుల్కం పుస్తకంతో కనుపిస్తున్నావు. చిలిపి కోర్కెలు కోరకుండ నన్నాదుకుని ఆదరించి మా నాన్నకు మహదానందం కలుగచేయమని కోరిన నీ కండ్లలోని జాలి ప్రార్ధనను స్మరణకుతెచ్చుకుంటున్నాను అనసూ! నాగరికత పెరిగినా మూర్ఖత్వానికీ అజ్ఞానానికీ అది బందీ ఐపోవలసి వచ్చింది... పెళ్లనగానే కొందరు మానసికానందంతో లావై పోతుంటారు. మరికొందరు కన్నవారిల్లు శాశ్వతంగా విడిచిపోవాలి కదా అన్న బెంగతో భోజనం మాని చిక్కిపోతుంటారు. నీ విషయంలో అలా కాకుండ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పెళ్లినాటికి కూడ ఇలానే ఇంత నాజూకుగా వుంటానిని కోరుకుంటున్నాను. అప్పుడప్పుడు అనుపమ అత్తమ్మ నా విషయం ప్రస్తావించినప్పుడు సిగ్గు దొంతరలలో తేలిపోతుంటావు కదూ! మరోలా భావించకుండ నాకు జవాబు రాయాలి. ఎన్నాళ్లైనా వేచివుంటాను. నా తపస్సు ఫలించే రోజుకోసం ఎదురు చూస్తున్న నీ సూర్యం.''

కిటికీలోంచి వాహనాలనూ,జనాన్నిచూస్తూ పిండి పిసికి డ్యూటీ నుంచి తిరిగివచ్చే తండ్రికి రొట్టెలు తయారుచేసింది. ఫేన్‌గాలికి రెపరెప

ధ్వని-ప్రతిధ్వని

లాడే ముంగురులను, పమిటను సవరించుకుంటూ సూర్యానికి తిరుగుజాబు రాయనా మాననా అని సతమత మౌతున్న సమయంలో విశ్వనాథం వచ్చి ''అనసూ! రాత్రంతా నాన్న వర్క్‌షాపులో పని చేయాలి. రొట్టెలు పాలు అన్నం నన్నక్కడికి తీసుకురమ్మన్నారు. నా నంతు కూడ అందులోనే పెట్టాలి. నేకూడ అక్కడే భోంచేసి చిన్న గదిలో పడుకుంటాను'' అన్నాడు.

''అలాగే బావా! నీకు కూడ ఓవర్‌టైమ్ డ్యూటీయేనా?''

''లేదనసూయమ్మా! పెళ్లిచూపులకు వచ్చి వెళ్లారా! నీవు వాళ్లకు నచ్చావు కదా! నాన్నగారు లేనప్పుడు నే ఇంట్లో వుండకూడదు. అది అధర్మమని నా ఉద్దేశం.''

అనసూయ అన్నీ కట్టి మౌనంగా కేరేజీని బల్లమీద పెట్టి తీసుకోమంది.

''చూశావా నీలోమార్పు! అది సహజం అనసూ! చేతికివ్వకుండ బల్లమీద పెట్టావు. అది కావాలని చేసింది కాదు. దానంతటదే మలుపులు తిరుగుతుంది.''

తిరిగిపోతున్న విశ్వనాథంలోని సంస్కారాన్ని చూస్తూ అలానే నిల్చుంది అనసూయ. కొద్దిసేపట్లో భోజనం కానిచ్చి మంచంపై ఇటునటు దొర్లుతూ సూర్యం రాసిన జాబును మరోమారు విప్పింది. తిరుగుజాబు రాయటం వలన ఏమంత ప్రమాదం లేదనీ — అనురాగం ఆప్యాయతా పెనవేసుకుంటాయనీ ఆ బంధాన్ని ఎవరూ త్రుంచలేరనీ అనుపమ చెప్పిన మాటల్ని గుర్తు చేసుకుని మెల్లగా లేచింది. తల్లి ఫోటో వైపు చూసింది.

''జీవితములో ఎప్పుడూ తప్పు చేసినట్టు గుర్తు లేదమ్మా! నన్ను చూసి వెళ్లారు. ప్రాధేయపడుతూ సూర్యం నన్ను తిరుగుజాబు రాయమన్నారు. అందుకే రాస్తున్నానమ్మా.''

''గౌరవనీయులైన సూర్యంగారికి నమస్కారములు... ప్రియమైన అన్న మాట వాడలేదని మరోలా భావించకండి. అది ధైర్యంపై ఆధారపడి వుంటుంది. మీరు సాధారణమైన జాబు మాత్రమే రాశారు. అది ప్రేమలేఖని భ్రమపడి నేనుకూడ శృంగారంగా జాబు రాశాననుకోండి. వెంటనే శీలానికి వెలకడతారు... కన్యను. నా పరిధిలో నేనుండాలి. అమ్మా నాన్నలకు నా నమస్కారములు తెలియచేయండి. ఐదుగురాడపడుచులకు నా ఆశీర్వచనాలు — మీ మంచిని అనుపమ సవిస్తరంగా చెప్పింది. పెళ్లి ఎలాగూ జరగక మానదు. దానికి కావలసిన సామాన్లు సమకూర్చుకోవడంలో నిమఘ్నులవై వున్నాం. ఇంత తక్కువ వ్యవధిలో ఇన్ని సామాన్లు కొనడానికి డబ్బెక్కడిదని అడుగుతారేమో! విశ్వనాధం బావ తన జీతం తొమ్మిది వందల్లో నెలకు ఆరు వందలు బేంకులో జమ చేస్తున్నాడు. అదంతా నాకోసమని ఆ పిచ్చివాడికి తెలీదనుకుంటాను. మా ఇంట్లో తింటూ మాకీ విధంగా ధనసహాయం చేసి మీ కోర్కెలు తీర్చడానికి కారణభూతుడైన విశ్వనాధానికి మనిద్దరం కృతజ్ఞతలు తెలియచేసుకోవాలి... జాబులు రాయకూడదని కాదుగాని పెళ్లి కాకుండ ఇలా జాబులు రాసుకోవడం... భయంగా వుందండీ! అప్పుడప్పుడు కొంటున్న వస్తువుల జాబితా తెలియచేస్తుంటాను. మరేవైనా ఖరీదైన వస్తువులు అనుపమ కిచ్చిన జాబితాలో లేకపోతే రాయండి. నాన్నచేత కొనిపిస్తాను...

అనసూయ''

జాబును చదువుకున్న సూర్యం ఉక్కిరిబిక్కిరైపోయాడు. శృంగారం ఒలకపోయకుండ పెద్దల తరహాగా రాసిన జాబు. ''మేమనుకున్న కట్నంతోపాటు విలువైన సామాన్లు—అనసూయ నాది. ఏ విజయనగరమో అయితే ఎంత బాగుండేది! ఏదో మిషమీద వెళ్లి చూసివచ్చేవాడిని. మనసులోని తాపం తీరేది. జంషెడ్‌పూర్‌లో ఎందుకున్నావు అనసూ?'' అని గదిలో సూర్యం చిందులు త్రొక్కుతున్నాడు. అప్పుడే లోన అడుగుపెట్టిన పెద్ద చెల్లాయి ''ఏమయిందన్నయ్యా? భరతనాట్యం చేస్తున్నావు. అనసూయ వదిన గుర్తుకొచ్చిందా?'' అంటూ సూర్యం చేతిలోని జాబును చదివింది.

''అబ్బ! ప్రేమలేఖల్లో పడ్డారన్నమాట!... అన్నీ బాగున్నాయి కాని ఐదుగురాడబిడ్డలకు ఐదు విలువైన పట్టుచీరలు విషయం అడిగారు కాదేం? మీకు కావలసినవీ రావలసినవీ ఒక్కటీ విడవకుండ అడుక్కున్నారు. మా విషయం విడిచిపెట్టారు. అందుకే నేకూడ మీతో వస్తానన్నాను.''

''యీమారు జాబులో రాస్తానులేవే! వేలకువేలు ఖర్చు పెడుతున్నారు. మీ విషయంలో అన్యాయం చెయ్యరులే'' అని బుజ్జగించాడు.


* * *

''అనసూ! జాబు రాయవేమో అనుకుంటున్న సమయంలో మనసు పూరట

అధిక సంతానం

నెల తప్పిన
దుబారా ఖర్చుకి
తొమ్మిది నెలలు నిండవు
పురిటి నొప్పు లుండవు
కాని సుఖంగా కంటుంది
అప్పుల్ని తాకట్టుల్ని
ప్రాంసరీ నోట్లని తనఖాల్ని
వగైరా వగైరా స్వాహా సంతుని

—మాధవరపు కృష్ణ.



కలిగించే జాబు రాశావు. ఆడపడుచుల ఖరీదైన పట్టుచీరల ప్రస్తావన తెచ్చింది మా పెద్ద చెల్లెలు. ఇప్పటినుంచే కొని పెట్టుకుంటే పెళ్లినాటికి పాతబడిపోతాయి. అలాంటివాటిని పెళ్ళికి ముందు కొనవచ్చునుకుంటాను. అమ్మ మొన్న భోజనం చేస్తున్నప్పుడు అన్న మాటలివి. రాను పోను రైలు చార్జీలు మిమ్మల్నే భరించమంటున్నారు. ఆఫీసువాళ్ళ బంధువులు సంఖ్యలో చాలమందుంటారు. తట్టుకోవడం కష్టమేమో అని నేనన్నాను... విశ్వనాథం ఆర్జన ఆ ముసలాయన సంపాదన అనసూయ గురించికాక మరెవరి గురించిరా అని అమ్మ అంది. అదీ నిజమేనని ఆ విషయంకూడ ఇందులో రాస్తున్నాను...''

* * *

''డియర్ అనసూ! జాబుల ద్వారా తొమ్మిది మాసాల తపస్సు పూర్తయింది. మీ నాన్నగారు రిటైరై ఇంటివద్ద వున్నారని రాశావు. ఆయనకు రావలసిన డబ్బు రాగానే నాకు తెలియచేయండి. అన్నీ సమకూడగానే అందరమూ వచ్చి నిశ్చితార్థం పుచ్చుకుంటాం''....

''సూర్యంగారికి అనసూయ సమస్కారములు. తానొకటి తలస్తే దైవమొకటి తలచాడంటారు—ఇదే కాబోలు...నాన్నగారికి డబ్బొస్తుందని వేయికళ్లతో ఎదురు చూస్తున్నాం. ఆయన ఇన్‌చార్జిగా వున్న సెక్షన్‌లో చాల సామాన్లు కనుపించడం లేదట! వాటి విలువకట్టి అదంతా నాన్నగారి మీదే రుద్దుదామని చూస్తున్నారు. యూనియన్ నాయకులు కూడ కలిగించుకున్నారు గాని లాభంలేనట్టే వుంది. శుభమా అని కూతురు పెళ్లి చేసుకోబోతున్నవాడు ఎన్ని బాధలకు గురయాడని అందరూ చింతిస్తున్నారు. ఒక్కొక్క కార్మికుడు తనకు తోచింది నాన్నకు విరాళంగా ఇవ్వదలుదుకున్నాడు. చాల డబ్బు పోగయే అవకాశముంది. కష్టార్జితం కట్నంగా ఇవ్వకుండ అందరూ కలసిచ్చిన డబ్బు కట్నంగా ఇవ్వవలసి వస్తోందని బాధగా వుంది. ఏం చేస్తాం? నాన్నకు లేకలేక కలిగిన సంతానాన్ని. తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలిని. నలుగురిచ్చిన చందాలతో పెళ్ళి చేసుకోవలసి వస్తోందని బాధగా వుంది. యీ జాబుకు తిరుగు జాబు త్వరగా రాయరని నాకు తెలుసు—కారణం కట్నం సొమ్ములేక పోవడం...అనసూయ''

జాబందుకున్న సూర్యం ముఖాన చెక్కితే నెత్తురులేదు. అన్నీ సమకూర్చుకుంటే వెంటనే పెళ్లి కార్యక్రమాలు మొదలు పెడదామనుకుంటున్న సమయంలో అనుకోని సంఘటన జరిగిందని బాధపడుతున్నాడు...

''సూర్యంగారూ! ప్రేమపాశం వేశారు. అది శాఖోపశాఖలై విస్తరించి సంవత్సరమయింది. డబ్బు పోయిందనేసరికి వీగిపోయినట్టు నెల రోజులైనా జాబు రాశారుకాదు. నిజమైన ప్రేమకు చిహ్నమంటారా మీరు? కానేకాదు సూర్యంగారూ! అసలుసిసలైన ప్రేమంటే ఏంటనుకున్నారు? తలితండ్రుల్ని ఎదిరించే మనోనిబ్బర ముండాలంటాను. ఎన్నో ప్రేమ కథలు చదివి ఎన్నో ప్రణయ సినీమాలు చూసి బాగున్నాయని మెచ్చుకోవటంకాదు. వాటిని ఆచరణలో పెట్టగలగాలి సూర్యంగారూ! కార్మికులందరూ విరాళంగా ఇచ్చిన డబ్బు నాన్నకు రావలసిన డబ్బుకన్న హెచ్చుగానే వచ్చింది...మీరు ఎకౌంట్స్ పరీక్షకు చదువుతున్నట్టు రాశారు. క్షుణ్ణంగా చదివి పరీక్ష రాసిం తర్వాతగాని నాన్న పెళ్లి మాటలు మాట్లాడవద్దన్నారు. కారణం? పెళ్లయిందో సంసారంలోపడి పరీక్షలు వాయిదా వేయటం జీవితాంతం గుమస్తాగిరీలోనే వుండి పోతారని నాన్నభయం...మరో సంవత్సరం ఓపిక పట్టగలరేమో చూడండి సూర్యంగారూ''

''డియర్ అనసూ! డబ్బు ప్రోగయిందని తెలిసి చాల సంతోషించాను. పెళ్లి తప్పిపోతుందని భయపడుతున్న సమయంలో చల్లని శుభవార్త తెలియ చేశావు. నీకెలా కృతజ్ఞతలు తెలియచేసుకోవాలో తెలియటం లేదు ... మంచికీ చెడ్డకూ వెళ్లిరావటం కష్టం అంత దూరమెందుకురా బాబూ వాళ్లిచ్చే కట్నం కన్న మరో పదివేలెక్కువ ఇస్తామని మరొకాయన వచ్చి నాన్న చెవిలో ఒకటే రొదపెడుతున్నాడు. యీ సంబంధం నాకిష్టమయిందనీ వేరే సంబంధం సుతరామూ ఇష్టం లేదనీ నొక్కిచెప్పాను. మీ నాన్న తెలుగుదేశంలోనే స్థిర నివాసమేర్పరచుకుంటారనీ దూరతీరాలకు వెళ్లివచ్చే ప్రసక్తే లేదన్నాను. అక్కడ మీ నాన్న పేరనున్న స్థలం అమ్మి విశాఖలోనే స్థలం కొంటారని కూడ చెప్పాను. ఎక్కడ కొన్నా ఎంత ఖర్చయినా అంతా నీకే కదు అనసూ! ఇక్కడ ఊడాలో స్థలం చాల మంది కొంటున్నారు. ఇప్పుడు మీ దగ్గరున్న డబ్బు మాకు పంపితే నీపేర స్థలం కొంటాము. నాన్న స్థలమమ్మిన డబ్బు మున్ముందు ఎక్కువ ధర కూడ కిట్టవచ్చు కట్నం కింద వాడుకోవచ్చును. ఇది మా కుటుంబాని కంతటికీ కలిగిన మంచి కోర్కె— కాదన కూడదు— పెళ్లి తర్వాత కొనాలన్నా అంగుళం స్థలం విశాఖలో దొరికే అవకాశం లేదు. ఆలోచించి జాబు రాయాలి — సూర్యం ...''

''సూర్యం గారూ! మన భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని స్థలం గురించి రాసిన జాబు చేరింది. తిరుగు సమాధానం మూడు నెలలకు గాని రాయలేక పోయాను. కారణం విశ్వనాథం బావ నాన్నను ఒకే ఒక కోర్కె కోరారు. ఎలాగూ తెలుగుదేశం పోయి స్థిరపడి పోతున్నారు. అనసూయ విలువైన సామాన్లన్నీ కొన్నది నా డబ్బుతోనేగా! వాటి బదులు నాకా స్థలమైనా మిగిల్చి పొండని ప్రాధేయపడ్డాడు. నాన్నగారు కాదనలేకపోతున్నారు. కార్మికులిచ్చిన డబ్బు కట్నం కింద వాడకుండ మరోలా వాడితే కట్నానికి డబ్బుండక పెళ్లి మరీ కాలయాపనౌతుందని భయంగా వుందండీ... అనసూయ...''

రోజులు గడుస్తున్నాయి. అనసూయ సూర్యం అప్పుడప్పుడు జాబులు రాసుకుంటున్నారు.

''అనసూ! మీ దయవలన ఎకౌంట్సు పరీక్ష పాసయాను. నీకు కాబోయే భర్త సాధారణ గుమస్తా కాదు. ఎకౌంటెంటు. ఎందరో వచ్చి చేతులు కట్టుకు నిల్చుంటారు తమ తమ బిల్లుల

ధర్మపథం - బులుసు వేంకటరమణయ్య

భూషణ ధారణ



భర్తృహరి మహాకవి తన సుభాషితాలలో ''వాగ్భూషణం భూషణం'' అని, ప్రశస్తమైన వాక్కే భూషణమనీ, శరీరాన్ని అలంకరించుకునే నగలూ, మున్నగునవి తగినవి కావనీ చెప్పాడు. నగలకంటే మంచి వాక్కే ఉత్తమమైనదే! నిజమే! కాని నగలక్కూడా విలువ లేకపోలేదు. ఆర్థిక పరిస్థితులను బట్టి, దేశ కాలాలను బట్టి పూర్వకాలపు నగలు తగ్గిపోయి, వాటి స్థానంలో నకిలీ నగలు వచ్చాయి. పూర్వం స్త్రీలతో పాటు పురుషులు కూడా నగలు ధరించేవారు. చెవులకూ, దండలకూ, చేతులకూ, వేళ్ళకూ, నగలు పెట్టుకోవడం, కంఠహారాలు ధరించడం, పూవులు ముడుచుకోవడం పురుషులలో కూడా ఉండేది. దేవతా విగ్రహాలలో పురుష విగ్రహాలకు కూడా విలువైన నగలు పెట్టేవారు. అది ఇప్పటికీ కానవస్తూ ఉన్నది. పురుషులు స్త్రీల మాదిరిగా నగలు ధరించడం ఇప్పటి వారికి పరిహాసాస్పదంగా ఉంటుంది.

కాని, శరీరానికి భూషణాలు కొంత శోభను కలిగించడం వల్ల అలంకార ధారణ అవసరమైనది. ఆకార రహితుడూ, గుణాతీతుడూ అయిన భగవంతునికి స్వరూపకల్పన చేసినప్పుడు విగ్రహాలకు నగలు పెట్టడంలో వింతలేదు.

చక్కదనాన్ని పెంపొందించడం మాత్రమే ఆభరణాల ప్రయోజనం కాదు. రత్నాభరణాల వల్ల, సువర్ణాభరణాల వల్ల శరీరానికి ఆరోగ్యం కలుగుతుంది. సువర్ణ స్పర్శగల నీరు ఆరోగ్యానికి కారణమవుతుంది. ఇది శాస్త్రవేత్తల నిర్ణయం. బంగారపు గొలుసు మెడలో వేసుకొంటే కొన్ని రోగాలు ఉపశమించడం కానవస్తూనే ఉన్నది. ఈ ప్రాశస్త్యాన్ని గ్రహించే ఆధునికులు — పురుషులు కూడా అధమం బంగారపు ఉంగరాన్నయినా ధరిస్తూ ఉంటారు.

బంగారు ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ కాలంలో బంగారు నగల్లా కానవచ్చే నకిలీ నగలను పిల్లలకు—చెవులకూ వాటికీ పెట్టడం జరుగుతున్నది. వాటివల్ల చెవులకు పుండ్లు పడడం మొదలైన రోగాలు సంభవిస్తున్నాయి. ఇటువంటి వాటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండవలసి ఉన్నది.

నగల వలన శోభతోపాటు ఆరోగ్యం కలుగుతూ ఉన్నందువలననే మన పూర్వులలో పురుషులు కూడా వివిధాభరణాలు ధరించే వారని, వారిని అవహేళన చేయనక్కర్లేదనీ తెలుసుకోవాలి. ★

ధ్వని - ప్రతిధ్వని

కోసం... మీరు నిర్ణయించిన కట్నం గుమస్తాగా వున్నప్పటిదనీ ఎకౌంట్సుకి వేరే రేటనీ మా ముసలాయన గొణుక్కుంటున్నాడు. మొన్న మొన్ననే ఇలాంటి విషయంలోనే మా ఆఫీసులో ఓ పెళ్లి తప్పిపోయింది. అయినా మొదటి మాటకే కట్టుబడి వుండాలన్న దృఢ నిశ్చయానికి వచ్చాను... సూర్యం.''

''సూర్యంగారూ! మీరు రాసిన కొన్ని జాబులు మా నాన్న కంటబడ్డాయి. పాతకాలం మనిషి — కాస్తంత ముఖం చిట్లించారు. నేనిప్పుడాయన ముఖం సూటిగా చూడలేక పోతున్నాను. ఆ రోజుల్లో జాబులు ఆయనింటి దగ్గర లేనప్పుడు అనుపమ పిన్ని తెచ్చిస్తుండేది. ఇంటి దగ్గరున్నారేమో మీ జాబులందుకోడానికి చాల ఇబ్బందిగావుంది. అన్నీ సమకూర్చుకున్నాం. దగ్గర దగ్గర రెండేళ్ళు తపస్సు చేశాం—ఎలాగూ వస్తారుగా! మూఢందాటేక మంచిరోజు చూసి బయలుదేరండి — ఇదే నా ఆఖరి జాబు... అనసూయ.''

* * *

''అనుపమ పిన్నీ! వాళ్లొచ్చేస్తుంటారు... యీ జాబులన్నీ సూర్యం రాసినవి. ఇన్నాళ్లు యీ ప్రేమలేఖల్ని చదువుకుంటూ భావిజీవితాన్ని మధురాతి మధురంగా మనసులో చిత్రించుకునే వాళ్లం. యీనాటి నుంచీ జాబులు చదువుకుని ఆనందించే అవకాశం వుండనే వుండదు.''

అనసూయ చేతిని అనుపమ కొంటెగా నొక్కింది ...

సూర్యం తల్లితండ్రులతో సరాసరి అనుపమ ఇంటికి వచ్చాడు.

అనుపమ చేతిలోని బాబును సూర్యం తండ్రి ఎత్తుకున్నాడు.

''మీ చెల్లాయ్ కొడుకనుకుంటాను. నీకు మంచి కాలక్షేపం. కుటుంబ నియంత్రణ పాటించమను. నాలా అరడజను పిల్లల్ని కని తర్వాత కళ్లు విప్పేకన్న ముందుగానే మేల్కోవటం మంచిది అనుపమా'' అన్నాడు సూర్యం తండ్రి.

''మా చెల్లాయ్ కొడుకు కాదన్నయ్యా! అనసూయ కొడుకు.''

''ఛా! వేళాకోళం పోనిచ్చుకున్నావుకాదు... పెళ్లిచూపులు తప్పించాలని చూస్తున్నావు కదూ!''


''నాకేం కలిసొస్తుందన్నయ్యా! నేను యవ్వనంలో వున్నప్పుడు ఎందరో వచ్చి చూసి వెళ్లి మోయలేని కట్న కానుకలకు బలిచేసి నన్నొంటరిగానే వొదిలి నా తలలో తెల్ల వెంట్రుకలు తీపి గుర్తులుగా మిగిల్చి నా పేరు జీవితాంతం కుమారి అనుపమగానే రాసుకొమ్మని మగజాతి నన్ను శాసించింది. శపించింది. అబద్ధం చెప్పి పెళ్లి తప్పిస్తే నాకేం కలిసొస్తుందన్నయ్యా! నిజంగా అనసూయను వాళ్లబావ విశ్వనాథానికిచ్చి ఆ ముసలాయన రిటైరైన రోజునే కార్మికుల సమక్షంలో ఏ ఆర్భాటమూ లేకుండ పెళ్లి జరిపించారు. అనసూయకూడ తండ్రి వారసత్వపు ఉద్యోగం టైపిస్టుగా ఆ ఆఫీసులో చేరింది. చిన్న కుటుంబం. కావలసినంత డబ్బు.''


అందరూ నిర్జీవ ప్రతిమల్లా అనుపమ మాటల్ని వింటున్నారు.

ఇంతలో అనసూయ పాలసీసాతో అక్కడికి వచ్చి బాబుని చేతిలోనికి తీసుకుంది.

''మా బాబుని చూశారా సూర్యంగారూ! గురజాడ సంస్కృతిని జీర్ణం చేసుకున్న మా బావ గొప్పా? విజయనగరంలో పుట్టి గురజాడను ఆవగింజంతైనా అవగాహన చేసుకోలేని మీరు గొప్పా? చెప్పండి సూర్యంగారూ! నా చేదు మాత్రలు మీరు మింగలేరనుకుంటాను. దూరపు కొండలేకాదు దగ్గరి కొండలుకూడ నున్నగా వుంటాయని మా బావ నిరూపించాడు. నన్ను క్షమించాలి సూర్యంగారూ! మీరు చేసిన ధ్వనికి నా ప్రతిధ్వని... అంటే'' అంటుండగా దిగజార్చిన ముఖాలతో వెనుతిరిగారు పెళ్లివారు.

వాళ్లను కన్నీళ్లలో గేటువరకూ సాగనంపింది అనసూయ బాబును గుండెలకద్దుకుని సూర్యం సరసను నడుస్తూ. ★


బొంబే టైల్స్
స్నానపుగదిని మీ మనసుకు నచ్చేలా
అందంగా అలంకరించుకోడానికోసం
బొంబే టైల్స్
తెలుపు, వివిధ లేత రంగులు మరియు వివిధ రంగు-రేఖల కలయికలలో లభ్యం.
శుభ్రపర్చడానికి సులభం.
ఎక్కువ మెరుపు మరియు మన్నిక కోసం రెట్టింపు గ్లేజ్ చేయబడినది.
బొంబే టైల్స్
అత్యంత అందమైన స్నానపు గదులు మరియు వంటగదుల కోసం.
BOMBAY TILES
ENTIVE/BPT/200 IB/TEL



(గత సంచిక తరువాయి)

మాధవరావుగారు రామచంద్రపురం కమర్షియల్ టాక్స్ ఆఫీసులో అప్పర్ డివిజన్ క్లర్క్‌గా ఉన్నపుడు పక్కింట్లో రాజారావ్ లెక్చరర్‌గా ఉండేవాడు. ఆయనకు రాజశేఖర్ ఒక్కడే కొడుకు, నలుగురు ఆడపిల్లల మధ్య. పదేళ్ల రాజా ఎపుడూ అక్కచెల్లెళ్లతో తగువులాడుతూ వచ్చి వీళ్లింట్లోనే కూర్చునేవాడు. తన ఈడువాడయిన చంద్రకాంత్, తనకన్నా రెండేళ్లు చిన్నదయిన నందినిలతో ఆడాలంటే యిష్టం ఉండేదికాదు. చంద్రకాంత్ ఎపుడూ వయసుకి మించిన అలోచనలతో డబ్బు యిచ్చిన అహంతో ఎపుడు టిప్ టాప్‌గ ఉండేవాడు. రాజా ఎపుడైనా వెళ్లినా నిర్లక్ష్యమైన అతని చూపులు ఆమడ దూరంలో నిలబెట్టేవి. నందిని ట్రిమ్‌గా తయారయి సినిమాలో బొమ్మలా ముచ్చటగానే ఉండేది గాని—రాజా ఏం మాట్లాడినా, నీకేం తెలీదు ఫో అనేసేది. అయినా వాళ్లింట్లో అన్ని ఆకర్షణలే, వీళ్లింట్లో లేని ఎన్నో వింతయిన వస్తువులు ఉండేవి. టేపు రికార్డరు, రికార్డు ప్లేయర్, కెమెరా, రకరకాల ఫ్లాస్కులు, అన్ని...ఫారిన్‌నుండి వచ్చిన వస్తువులు...ఎన్నో...వింతగా ఆకర్షణీయంగా ఉండేవి. వాటి మధ్య చామనఛాయగా ఉన్న ఆరతి, నిర్మలమైన స్నేహ పూరితమైన కన్నుల్లోని ఆహ్వానం, రాజాని చూడగానే ఆ కళ్లల్లో వెలిగే ఆనందం ఆ అబ్బాయిని ఆ యింటి చుట్టు తిరిగేలా చేసేవి. రెండేళ్ల ఆరతికి పదేళ్ల రాజాకి స్నేహం చిత్రంగా ఉండేది భైరవికి. వచ్చేపోయే చుట్టాల మధ్య తీరిక దొరికినపుడు అలా చూస్తే రాజా చంకలో ఉన్న ఆరతిని చూసి సన్నగా నవ్వి ఏదో తెచ్చిపెట్టేది ఆడుకోమంటూ. మాధవరావుగారిల్లు ఎపుడూ చుట్టాలతో ఖాళీ ఉండేది కాదు. భైరవి ఎపుడూ వంట యింటి నంటిపెట్టుకొని ప్ర్యాన్స్‌తో పనులు చేయించుకొంటూ హడావిడిగా ఉండేది. చంద్రకాంత్, నందిని వాళ్లిష్టం వాళ్లదే. యిక ఆయన సంపాదనలో మునిగిపోయే మనిషి. ఇంత యింటిలో, తనను ఆప్యాయంగా ఎత్తుకొనే రాజా రాకకోసం ఆ చిన్ని మనసు కొండంత ఆశతో ఎదురు చూస్తుండేది. కొన్నాళ్ళలో ప్రమోషన్ మీద ఎ. సి. టి. వో.గా మాధవరావు ట్రాన్స్‌ఫర్ అయిపోయి వెళ్లిపోయారు. వాళ్ల ప్రయాణం రోజు రాజా గుండెల్లో చెప్పలేని గుబులు, 'ఇంకో ఊరు వెళ్లిపోతాం' అని తెలిసిన చిన్నారి ఆరతి కళ్లల్లో చెప్పలేని దిగులు.. యివేవి పట్టించుకోని పెద్దవాళ్ల హడావిడి మధ్య ఆ చిన్ని మనసులు మూగగా రోదిస్తు విడిపోయాయి. ఏళ్లు గడిచినా రాజా మనసులో చిన్ని ఆరతి రూపం, ఆ స్నేహం ఆప్యాయత ముద్రించుకుపోయాయి. అపుడపుడు 'ఎక్కడ ఉన్నారో ?' అనుకోవడం ... ''ఆరతి ఎంత య్యిందో?'' అనుకోవడంతో వాళ్లని మరచిపోలేదని తనను తాను అభినందించుకొనేవాడు.

ఇంటర్ అయ్యాక, బి. కామ్ ఒక సంవత్సరం అయ్యాక, విశాఖపట్నం ఇంజినీరింగ్ కాలేజీలో సీటు వస్తే జాయిన్ అయ్యాడు రాజా. అప్పటికి ఒక అక్క పెళ్లి చేసిన తండ్రి ఆర్థికంగా కొంత చితికిన మాట వాస్తవమే. అయినా రెండో అక్క చదువు, చెల్లెళ్ల చదువులు అయినా రాజా కోర్కె కాదనలేక చేర్పించారు. రూమ్ మేట్‌గా సెకండియర్ చదువుతున్న మోహన్ పరిచయమయ్యాక అసలు విషయం తెలిసింది.

''మా మామయ్యగారున్నారు ఈ ఊళ్లో వెళ్దాం వస్తావా ?''

ఓ ఆదివారం అడిగాడు మోహన్. ఏమితోచని రాజా అతని వెంట బయలుదేరాడు. సిటీబస్‌లో నుండి విశాఖపట్నం అందాలు చూస్తున్న రాజా, మోహన్ త్రోవలో ఏమి మాట్లాడుకోలేదు.

కాలింగ్‌బెల్ విని తలుపు తీసిన పన్నెండేళ్ల అమ్మాయిని చూసి ఉలిక్కిపడ్డాడు రాజా.

''ఆర్తి ! మామయ్య లేరా ?'' అంటూనే ''రాజా, ఇది మా మామయ్య చిన్న కూతురు ఆరతి. మా మామయ్య సి. టి. వో అని చెప్పానుగా.'' అంటూ పరిచయం చేసాడు. ఈలోగా ఓణీ వేసుకొన్న ఓ అందమైన పద్దెనిమిదేళ్ల అమ్మాయి ''హాయ్ బావా !'' అంటూ మీద పడినంత పని చేసింది.

''హాయ్ నందూ ! బావగాడేడీ ?'' ఆ అమ్మాయికి దూరం జరుగుతూనే ...

నందిని, ఆరతి ... రాజా జ్ఞాపకాల్లో స్థిరంగా నిలచిపోయిన ఆ పేర్లు చిరపరిచితం. ఆరతి ఎపుడో లోపలికి వెళ్లిపోయింది. రాజా మనసు ఉత్సాహంతో ఏదో కొత్త వింత కనుగొన్న ఉత్సాహం, ఆనందం. చొరవగా లోపలికి వెళ్తున్న రాజాని ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు మోహన్, నందిని.

''అత్తయ్యగారూ, నేను గుర్తు ఉన్నానా ? రామచంద్రపురంలో ఉండేవాళ్లం, రాజాని !'' అంటున్న ఆ యువకుణ్ణి ఆశ్చర్యంగా చూసింది భైరవి.

''చిన్నప్పుడు దీన్నెత్తుకు మోసేవాడివికాదూ,ఎంతవాడివయ్యావు. అంతా బాగున్నారా ? ఇక్కడికెలా వచ్చావ్ ?'' ఊపిరి సలపనన్ని ప్రశ్నల్లో నుండి కూడా రాజా కళ్లు ఆరతి కళ్లల్లోకి చూసాయి ఒక్క క్షణం తళుక్కుమన్న ఆ కళ్లల్లోని కాంతి... అతనికి ఏదో తెలియంది తెలియచెప్పినట్లయ్యింది. ఆవిడ ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిస్తూనే ఆరతిని చూస్తున్నాడు. పెద్ద జరీ బార్డరున్న మెరూన్ రెడ్ పరికిణి, అదే రంగు జాకెట్టులో ఆరతి మందార మొగ్గలా అనిపించి హృదయపు లోతుల్లో చిన్ననాటి చెలిమి నాటి నవభావన ఏదో రూపు దిద్దుకొన్న అనుభూతి. క్రొత్తగ యౌవ్వనంలో అడుగుపెట్టిన ఆ యువ హృదయంలో ఏదో అలజడి. అర్థంకాని ఊహలు చేసే అల్లరి. ఉత్తేజం, ఎన్నెన్నో భావాలు ఉక్కిరిబిక్కిరి చేసాయి. అదే స్నేహపూర్వకమైన కళ్లల్లోని ఆహ్వానం అతన్ని నిలువనీయడంలేదు. అంతా హాల్లోకివచ్చారు. విషయం విన్న మోహన్ ''యింకా, నేను క్రొత్తగా పరిచయం చెయ్యక్కరలేదన్నమాట.'' అన్నాడు నవ్వుతూ. నందిని నిర్లక్ష్యంలో మార్పు లేదనుకొన్నాడు. వారి ఐశ్వర్యం, హోదా మరింత పెరిగి ఆమెలో అహాన్ని పెంచాయేగాని తగ్గించలేదు.

జరిగిన కథ—1 : నందిని, ఆరతి, చంద్రకాంత్ భైరవి, మాధవరావు దంపతుల పిల్లలు. ఆరతి, రాజాల స్నేహం చూస్తె నందినికి అసూయ. మేనల్లుడు మోహన్‌కు స్నేహితుడు రాజాతో తమ బాధలనీ చెప్పుకొంటుంది భైరవి. రాజాకు గతం గుర్తుకు వస్తుంది.

కాస్సేపుండి వెళ్తా...అందరికి చెప్తుంటే...

తల్లిచాటు నుండి చూస్తున్న ఆరతి కళ్లల్లోని ఆహ్వానాన్ని కాదనే శక్తిలేని వాడిలా రెండు రోజులకే వచ్చాడు రాజా! ఆ యింటికి వచ్చేపోయే వాళ్ళు, ఆయన కేంపులు, ఆవిడ వంటగది, పిల్లల మనసులు...ఏమీ మారలేదని– ఆయన హోదా మరింత మందిని చేర్చిందని మాత్రం గ్రహించాడు రాజా. కాలేజీలో చదువులు వెలిగిస్తున్న చంద్రకాంత్‌లో గాని, నందినిలోగాని చదువుపట్ల ఆసక్తిలేదని, కేవలం గ్లామర్ కోసమే వెళ్తున్నారని పసిగట్టాడు. అతనికి అర్థంకాని విషయమల్లా, ఆరతి చిన్నపుడు ఎలా వంటరిగా బొమ్మలతో ఆడుకొంటూ గడిపేదో, యిపుడూ అలాగే, సింపుల్‌గా తన గదిలో పుస్తకాలు చదువుకొంటూ, లేకపోతే యింటిముందు మొక్కలు నాటుతూ, వేరుగా, ఒంటరిగా.. అనిపించింది. రాజారాక ఆ అమ్మాయి వంటరితనంలో ఓ చిన్న తోడుగ అనిపించ సాగింది. ఆ భావం స్పష్టంగా కళ్లల్లో కనబడి రాజా మనసు పరవశ మయ్యేది. ఆ యింట్లో పిల్లల విషయం పట్టించుకొనే తీరిక మాధవ రావుగార్కి లేదని, భైరవికి...'పిల్లలు పెద్దవాళ్లయిపోయారు వాళ్లకి అంతా తెలుసు' అన్న తెలివి తక్కువతనం అతని రాకపోకలకు పెద్ద అంతరాయం కలిగించలేదు. అపుడపుడూ మోహన్ వచ్చేవాడు.

''అక్కడికి రావాలంటే భయంరా బాబు! ఆ నందిని ఒకటే ప్రాణం తీస్తుందనుకో! దాన్ని నాకిస్తానంటారు. బాబోయ్ పెళ్లి మానేస్తాగాని దాన్నెవరు చేసుకొంటార్రా బాబు, అది అసలు ఆడ పిల్లేమిటి! నేను రానుగాని నువ్వెళ్లు!'' అనేవాడు.

ఓ రోజు రాజా వచ్చేవేళకి యిల్లంతా పేరంటాళ్లతో కళకళ్లాడు తోంది. విషయం అర్థం కాలేదు. అడుగుదామంటే, తనను చూడగానే ఎదురు వచ్చే ఆరతి కనబడలేదు...అంతలోనే తెలిసింది ఆ హడావిడి అంతా ఆరతిదేనని...ఆ విషయం వినగానే ఒక్కసారి సిగ్గు, యింకేదో కలిగి ఒళ్లు పులకించింది. మరెవ్వరికీ కనబడకుండా ఎర్రబడిపోయిన మొహంతో బస్‌స్టాపుకి వచ్చిపడ్డాడు. ఆ రావడం ... స్నానంనాడు భోజనాలకి చంద్రకాంత్ వచ్చి పిలుస్తే అపుడు మోహన్‌తో కలసి వెళ్లాడు. కానీ ఆ హడావిడిలో ఆరతి కనబడనే లేదు. చూడాలనే కోర్కెను బలవంతాన అదిమి...


''పోదాం రా, బోల్డుమంది ఆడవాళ్లు గొడవగా ఉంది. ఉండు మా అమ్మకి చెప్పేసి వచ్చేస్తాను!'' అంటున్న మోహన్ని తప్పని సరిగా అనుసరించాడు.

వారం రోజులు పిచ్చిగా గడిచాక, 'యింక ఉండలేనన్న' నిర్ణయానికి వచ్చాక, ''చుట్టాలువెళ్లిపోయి ఉంటారన్న''ఆశ ధైర్యాన్నివ్వగ మోహన్‌తో చెప్పకుండానే బయలుదేరి పోయాడు. గేటు తీసుకొని అడుగు పెడుతుంటే కాళ్లు చిన్నగ వణికాయి. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ వస్తుంటే మెట్లప్రక్కనే నాటిన గులాబి సగంవిచ్చిన మొగ్గ కనబడింది. అనాలోచితంగా, చిన్న కొమ్మతో ఆ మొగ్గ తుంచేశాడు. పెదవులకు తాకిస్తూ, ఆఘ్రాణిస్తూ నెమ్మదిగా వరండా దాటి తలుపు కొట్టాడు. ఆ క్షణంలో అతని మనసు పున్నమినాటి సముద్రంలా ఉంది. ఎన్నెన్నో ఊహలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

''ఎవరూ ?'' సన్నని గొంతు. ఆ వెనక తలుపు తీసిన చప్పుడు. ''రాజా నువ్వా!'' ఆ గొంతులో కోటి వీణలు ఒక్కసారే శృతి చేస్తే వచ్చే నాదం అతన్నిలోకానికి లాక్కువచ్చింది. అతను ఆశించినది ఎదురుగా ప్రత్యక్షమయ్యేసరికి మూగగా ప్రేక్షకుడిలా ఉండి పోయాడు. ఈ పదిహేను యిరవయి రోజులకే పొడుగు ఎదిగిపోయి లేత నీలిరంగు ఓణీలో మేఘమాలికలా ముందు నిలుచున్న ఆరతిని ఎంత సేపలా చూస్తుండిపోయాడో...

''లోపలికి రా!'' సిగ్గుపడుతూ అంటున్న ఆ మాటకి చేతిలోని పూవందించాడు జవాబుగా. ఆ విరిసీ విరియని మొగ్గలాగే నునుపుగా, మకరందంతో నిండిన కలశంలా ఉన్న ఆరతి కళ్లల్లోని ఆకర్షణ సిగ్గుతో ముడిపడి అపురూపమైన దృశ్యంగా అనిపిస్తుండగా...''ఏంబాబు ఎపుడు వచ్చావు?''అంటూ భైరవి వచ్చిచెరిపేసింది. ఆరతి లోపలికివెళ్లిపోయింది. ఆ రోజు తిరిగి వచ్చి ఆనందంతో, ఉక్కిరి బిక్కిరి చేస్తున్న భావాలకి రూపం యిచ్చినట్లు, తను యిన్నేళ్లుగా కోరుకొన్నది దొరికినట్లు తన వస్తువేదో తనకు దక్కినట్లు అనిపించి ఒక స్థిర నిశ్చయాని కొచ్చినట్లు డైరీలో నాలుగు వాక్యాలు వ్రాసుకొన్నాడు.

''రతీ ! నిన్ను మరల నాకు చూపించి ఆ భగవంతుడు నాదానవే అని తెలియ చెప్పాడు. చిన్ననాడు ఈ చేతులతో నిన్నెత్తుకొని ఆడించాను. యిపుడూ అట్లాగే నిన్నెత్తుకొని ఏ హిమాలయాలకో పారిపోవాలని ఉంది. రతి... నీవు నాదానవే... యిక మననెవ్వరూ వేరుచేయలేరు...! భగవంతుడింత దయామయుడయినందుకు ఎపుడూ కృతజ్ఞుడుగా



ఉంటాను.'' పదే – పదే చదువుకొని అలాగే గుండెలమీద ఉంచుకొని ప్రతిజ్ఞ తీసుకొన్నట్లు మననం చేసుకొంటూనే నిద్రపోయాడు. ఆ రాత్రి అంత మధురంగా ఏ రాత్రి తెల్లవారలేదు.

ఆదివారాలు తప్పనిసరిగా వెళ్లే అలవాటు చేసుకొన్నాడు వంటరిగానే. చిన్నప్పటి నుండి తెలిసిన ఆ అబ్బాయి రాక ఎవరికి అభ్యం తరముండేది కాదు. అసలు అభ్యంతరం ఎవరి మనసులోనూ కలగలేదు. ఆలోచించే తీరిక లేదు. రాజా వచ్చేసరికి మాధవరావుగారు ఉంటే ...

''ఏవోయ్ రా... రా... మీ నాన్నగారి దగ్గర నుండి ఉత్తరం వచ్చిందా ? ఎలా చదువుతున్నావ్ ?'' ప్రశ్నలు వేసేసి పలకరింపు అయి పోయినట్లు వెళ్లిపోయేవాడు. భైరవి ఒంటింట్లో నుండి ... ''ఏం రాజా?'' అని పలకరించేసి కాఫీ యిచ్చి బాధ్యత తీర్చుకొనేది. చంద్రకాంత్ కోసం వెతికేవాడు కంపెనీ కోసమని... ఏ ఫ్రెండ్స్‌తోనో ఎక్కడో ఉండే చంద్రకాంత్‌కి రాజా వస్తున్నాడని తెలియనే తెలియదు. యింకపోతే నందిని. ఆరతి తీసుకెళ్లి కూర్చోబెట్టి, పట్టుమని పది నిముషాలు

జీవన సరళిలో తీయని రవళి

మాట్లాడితే అందులో ఎనిమిది నిముషాలు వాదన, దెబ్బలాటతో సరిపోయి, అది భరించలేని నందిని పారిపోయేది. వాళ్ల వాదన వింటూ కూర్చున్న ఆరతి కళ్లు రాజా మాటలకు ప్రశంసగా చూసేవి. ఆ తరువాత మిగిలిన యిద్దరి మధ్య మాటలు కరువే. నోరు విప్పి ఒక్క మాట మాట్లాడకపోయినా అక్కడి నుండి కదలాలని యిద్దరికీ అనిపించకపోవడమే తొలి ప్రేమకు గుర్తేమో! అతని కళ్లు నఖశిఖ పర్యంతము తపనగా చూస్తున్నాయన్న భావన ఆమెను కళ్లెత్తనిచ్చేది కాదు. కళ్లు దించుకొన్నా అందులో మెదిలే భావాలు స్పష్టంగా అర్థం అయినట్లే ఉండేది. యవ్వనపు తొలి మెట్టుమీద ఉన్న ఆమెకు రెండు మెట్లు పైన ఉన్న అతనికీ పెద్ద తేడా లేదు. ఎందుకంటే 'అనుభూతి' క్రొత్తది, మొదటిది. ఇంటికొచ్చిన చుట్టాల్లో అపుడపుడు 'ఆరా' వచ్చినా, "తెలిసిన వాళ్లబ్బాయి, హాస్టల్లో ఉంటున్నాడు. ఏవో పిల్లలతో సరదాగా గడుపుదామని వస్తాడు." అంటున్న భైరవికి ఎదురు చెప్పి తమమీద విసుగు తెప్పించుకునేంత తెలివి తక్కువవాళ్లు కాదు చుట్టాలు. రోజులు గడిచే కొలదీ రాబోయే ఆదివారం (రాజా) కోసం ఎదురు చూడ్డంలో మిగతా ఆరు రోజులు సునాయాసంగా గడిచిపోయేవి ఆరతికి. నెమ్మదిగా అడిగిన విషయాలకు సమాధానం చెప్పడం, తెలియనిపాఠాలు అడిగి చెప్పించుకోవడం, వీటితో బాగా చనువు ఏర్పడి చిన్నప్పటి స్వాతంత్ర్యం వచ్చేసింది ఆరతిలో. అపుడే జీవన ప్రాంగణంలో అడుగు పెట్టి దిక్కు తెలియనట్లు చూస్తూ నిలుచున్న ఆరతికి రాజా మాటలు, స్నేహం ఏదో తెలియచెప్తున్నట్లే ఉండేది. విరిసీ విరియని మొగ్గలాంటి ఆరతిని చూస్తుంటే, ఆ కళ్లల్లో వెలిగే స్నేహదీపం చూస్తుంటే రెండేళ్లు ఆరతి కళ్లెదురుగా ఉన్నట్లే అనిపించేది. పూర్తిగా ప్రేమ, వ్యామోహం, ఆరాధన... వీటికి నిర్వచనం తెలియని వయసయినా, ఆ అమ్మాయి సమక్షంలో మనసు, శరీరము, క్రమశిక్షణకు లోనయినట్లు ఒకే ఒక భావం ఆక్రమించి ఉండేది. 'ఆరతి నాది' అన్నది. స్వంతంగా అపురూపంగా కొనుక్కొన్న వస్తువులా కనిపించేది. అందుకే ఆ ప్రేమకు ప్రేమించడం ఒక్కటే తెలుసు. ఆ మనసుకి ఆరాధన ఒక్కటే తెలుసు.

* * * *

ఇటీవల మదరాసులోని చెన్నపురి ఆంధ్ర మహాసభవారు నిర్వహించిన నాటిక పోటీలలో నటనాలయ (విశాఖపట్నం) వారి "జవాబులేని ప్రశ్న" నాటికకు ద్వితీయ ఉత్తమ ప్రదర్శన అవార్డుని ప్రముఖ దర్శక నిర్మాత శ్రీ యు. విశ్వేశ్వరరావు నుంచి స్వీకరిస్తున్న నటనాలయ కార్యదర్శి శ్రీ తోట తిరుపతిరావు. శ్రీమతి జి. కమలాదేవి, సాంబమూర్తిగార్లని కూడా చిత్రంలో చూడవచ్చు.



రెండేళ్లు గిర్రున తిరిగిపోయాయి. అపుడపుడు కొడుకుని చూడ్డానికి వచ్చే రాజారావ్ కూడా వీళ్ల యింటికి వస్తుండడంతో పాత స్నేహం తిరిగేసుకొన్నారు రాజా శలవులొస్తున్నాయనే సరికి బెంగ పడిపోయేవాడు. అంతగా పరిపక్వం చెందని ఆరతి మాత్రం నవ్వుతూ సాగనంపేది. "ఆరతి ఉత్తరాలు వ్రాస్తే జవాబు వ్రాస్తావుగా?" అంటే "ఓ! అక్కా, నేము కలిపి వ్రాస్తాం!" అంటుంటే ఒక్కటివేసి ఎత్తుకు పోయి నిజం చెప్పేయాలనిపించేది. అది ఆమె వయసుకి సహజం కనుక, అతని విచక్షణ అతన్ని ఆపేది. సెకండియర్ పరీక్షలు వ్రాసి యింటికి వెళ్లిపోయాడు రాజా. ఆరతి నైన్త్ పరీక్షలు వ్రాసింది. నందిని బి. ఏ ఫస్టియర్, చంద్రకాంత్ సెకండియర్ పరీక్షలు ఏదో అయ్యాయనిపించారు. చంద్రకాంత్ ఫ్రెండ్స్‌తో నార్త్ టూర్ వెళ్లాడు. నందిని హిస్టారికల్ టూర్‌కి వెళ్లింది. యింట్లో ఆరతి, తల్లి ... రు మాధవరావు కేంపుకి వెళ్లాడు. ఆ రోజే వచ్చిన, చెల్లెలు మరిది కొ..కు, ఆడపడుచుకి ఆడ పడుచు కొడుకు యింకా ఎవరో యిద్దరు వస్తే వంట ప్రయత్నంలో వుంది భైరవి. ఆరతి ఏమీ తోచక అపుడే అలవాటు చేసుకొంటున్న పుస్తక పఠనం సాగిస్తోంది. అదీ రాజా యిచ్చిన సలహాయే. శలవులకు వెళ్తూ .."ఆరతి .శలవుల్లో టైమ్ వేస్టు చేయకుండా ఏవన్నా మంచి బుక్స్ చదువు!" అన్నాడు. ఎందుకో అతనేం చెప్తే అది వేదంగా భావిస్తుందామె మనసు. అతనిచ్చిన లిస్టు ప్రకారం చదువుతోంది. ఆ రోజు 'శరత్' ది 'బడదీది' చదువుతోంది. అంతలోనే విధి ఆడబోయే చదరంగంలో పావుకాబోతుందని తెలియని ఆ పసిమనసు కథలో లీనమయ్యింది. ఆఫీసు ప్యూన్ వచ్చి చెప్పిన కబురు విని తెలివి తప్పిపోయిన తల్లిని చూసి యింట్లో పనివాళ్లు చేస్తున్న హడావిడికి యివతలకు వచ్చి అయోమయంగా నిలబడింది ఆరతి. విషయం తెలిసి దిమ్మెరబోయింది. తల్లితోపాటు హాస్పటల్‌కి పరుగెత్తింది. కాంపునుండి వస్తూ జీప్ ఏక్సిడెంట్‌కి గురి అయి తలకు తగిలిన పెద్దగాయంతో, ఒంటినిండా కట్లతో మంచంమీద ఉన్న తండ్రిని చూసి స్పృహ తప్పిపోయింది ఆరతి. ఆఫీసు క్లర్కు, ప్యూన్స్ అందరికీ టెలిగ్రామ్స్ యిచ్చారు. ఆ విషయం విన్న ఆరతికి రాజా గుర్తు వచ్చి అతని ఎడ్రస్ కూడా యిచ్చింది. టెలిగ్రామ్స్ అందుకొని వచ్చిన మేనత్త, చిన్నాన్నలు, అమృతరావు బంధువులు వీళ్లతో యిల్లు నిండిపోయింది. వచ్చిన వాళ్లకి మర్యాదలు, దిక్కుతోచనట్లు హాస్పటల్‌లో భర్త మంచాన్నంటి పెట్టుకొని కూర్చున్న తల్లి. బాధ్యతలేని అన్న, అక్క, ఎవరి సరదాలు, వాళ్లు చూసుకొనే చుట్టాలు, పైగా వాళ్లకి కావాల్సినవి అందివ్వడంతో హఠాత్తుగా అనుకోకుండా యింటి బాధ్యత మీద పడిపోయింది ఆరతికి. ఏదడిగినా "నాకేం తెలీదు" అనేసి టిప్, టాప్‌గా తయారయి హాస్పటల్‌కి వెళ్లి ఓసారి చూసి పలకరించేసి అలా, షికార్లు కొట్టివచ్చే నందినికంటే దగ్గరుండి వంటలు, భోజనాలు మర్యాదలు చూసుకొనే ఆరతిని పీక్కుతినేవారు. ఆ సమయంలో రాజా రాక ఆమెకు పెద్ద రిలీఫ్ నిచ్చింది. ఒడ్డునపడ్డ చేపలా గిలగిల్లాడుతున్న ఆరతి రాజాని చూడగానే బావురుమంది. అతనే చేతులు చాచాడో— తనే వెళ్లి అతన్ని చుట్టుకు పోయిందో కానీ, ఆప్యాయంగా వీపు నిమురుతూ ఊరడిస్తుంటే ఆ హాయిలో బెంగ, దిగులు కష్టం అన్ని త్రుటిలో మర్చిపోయినట్లు అనిపించి సేద తీరింది. వచ్చినవాళ్లు షాపింగులు, బీచ్, పోర్టు చూడ్డానికి వెళ్లడం, సినిమాలు ఆ షికార్లు చూస్తుంటే ఆరతికి అరికాలిమంట నెత్తికెక్కేది. పైగా వాళ్లకి కంపెనీ యిస్తూన్న నందినిని చూస్తే అసహ్యం వేసింది. యింతమంది ఉన్నా సమయానికి తల్లికి సహాయంగా హాస్పటల్‌కి వెళ్లడంకాని, కారియర్ తీసుకు వెళ్లడంగాని ఎటువంటి సహాయం చేయని వీళ్లకి ఎందుకు వండి పెట్టాలనిపించేది! కానీ ఏమీ అనలేని నిస్సహాయత అంతా రాజా ముందు వెళ్లగ్రక్కేది. సుడిగుండంలాంటి ఆ పరిస్థితులలో రాజా సమక్షం ఓ పెద్ద ఆధారం. బాధ్యతగ అన్ని కనుక్కుంటూ, అవసరానికి ఆదుకొంటూ, ధైర్యం చెపుతూ అంతటా తానై ఉన్న

రాజా పట్ల కృతజ్ఞతతో,మరేదో తెలియని అవ్యక్తమైన భావనతో నిద్ర పట్టని రాత్రులను అవలీలగా గడిపేస్తుంది ఆరతి.

వాళ్ల పనులు ముగించుకొని ఒక్కొక్కళ్లే వెళ్లిపోవడం మొదలు పెట్టారు. ఆఫీసు వాళ్ల రాకపోకలు తగ్గాయి, ఫ్రెండ్స్ రావడం మానేసారు. యిల్లంతా ఖాళీ అయ్యింది. ఇంట్లో అక్కడక్కడ ఉన్న డబ్బు ఖాళీ అయ్యింది. బాధ్యతగ చూడవలసిన కొడుకు అడిగేవాళ్లు లేరని యిల్లు సంగతే మరచిపోయాడు. హాస్పిటల్‌లో ప్రాణాపాయం నుండి బయటపడి మామూలుమనిషి అవడానికి తండ్రి సలుపుతున్న పోరాటం. ఆ పోరాటానికి ఆహుతి అవుతున్న సమిధలా తల్లి, తరుగుతున్న బ్యాంక్‌బాలెన్స్ యివన్నీ ఆరతిని పదేళ్లు వయసు ఒక్కసారే పైబడినట్లు చేసాయి. రోజూ క్రమ అనుకోకుండా వచ్చి యోగక్షేమాలు విచారించే రాజా వచ్చి వెళ్లే ఆ కాస్త టైము ఆరతికి మర్నాటికి కొండంత ధైర్యాన్నిచ్చేది.

''రాజా ! పరిస్థితులు చూస్తుంటే భయంగా ఉంది. నాన్నగారు మళ్లీ మామూలు మనిషవుతారన్న ఆశ కలగడం లేదు. చుట్టాలు చూసావుగా... ఉన్నన్నాళ్లు హాయిగా తిన్నారు, వెళ్లారు. ఒక్కళ్లు 'ఎలా ఉన్నామని ?' కనీసం ఉత్తరం అయినా వ్రాయలేదు. అన్నయ్య చూస్తే పరిస్థితి చూడకుండా, ఎంత డబ్బు ఉంటే అంత పట్టుకుపోతున్నాడు. నేనేం చేయను ? అమ్మ మతిలేనట్లు తయారయ్యింది. ఈ సమయంలో నీవు లేకపోతే నేనేమయిపోయేదాన్నో. మా బావ అస్సలు రావడం లేదు చూసావా ? వాళ్లకి నాన్న ఎన్ని విధాల చూసారో తెలుసా ? ఏం మనుష్యులు... తలుచుకొంటే అసహ్యం వేస్తుంది ...'' ఆవేదనగా అంటున్న ఆరతిని ఎలా ఊరడించాలో అర్థం కానట్లు కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు.

''రతీ ! పరిస్థితులు యిట్లా వస్తాయని ఎవరమూ అనుకోలేదు. నువ్వు దిగులు పడకు. ఏది ఎట్లా జరగాలో అట్లా జరుగుతుంది. నువ్వు మాత్రం చదువు అశ్రద్ధ చేయకు. యిక పైన ఈ యిల్లు నీమీదే ఆధారపడి నడుస్తుంది. రతీ... ఏది ఏమైనా, ఒక్క విషయం చెప్పు. ఇది సమయం కాదనుకో... అయినా, నీ ఆలోచనలో, నీ బాధలో, నీ ఒంటరి తనంలో, నీ బాధ్యతలో అన్నింటిలో నీతో పాలుపంచుకోవాలంటే .. మన మధ్య ఒక బంధం అన్నది ఉండాలి. మనకోసం, లోకం కోసం కూడా ! రతీ... నా మీద నీ అభిప్రాయమేమిటి ? ఎందుకో...చిన్నపుడు నిన్ను ఎత్తుకొని ఆడించినపుడే నా 'స్వతం' అనిపించేది... ఆ తరువాత విధి మనల్ని కొంతకాలం దూరం చేసినా తిరిగి మన కలయికనామోది స్తున్నట్లు కలిపింది. ఆ రోజు నిన్ను చూడగానే నా మనస్సెంత ఉప్పొంగి పోయిందో తెలుసా ? పోయిన పెన్నిధి దొరికినట్లు సంబరపడిపోయాను. నీతో చెప్పి, నీ అభిప్రాయం తెలుసుకొనే వయసు కాదు నీది. కానీ రతి.. యిపుడు... ఆ ఆలోచన నీలోపెట్టి నిన్ను బాధ పెడదామని కాదు. అసలు నా చదువు అయ్యే వరకూ నీకు చెప్పకూడదనుకొన్నాను. కానీ – కాని– పరిస్థితులిలా వచ్చి ఒక్కసారి నిన్ను ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంటే నిస్సహాయంగా నిన్ను చూస్తూ ఉండలేకపోతున్నాను. అందుకే... మనసు విప్పి చెప్పాను. రతి... నీ మనసులో నాకు స్థానం ఉందంటే చాలు ... యింకేమి అఖ్ఖరలేదు. జీవితమంతా నీ కోసం ఎదురుచూడగలను. భవిష్యత్తు కోసం కలలు కంటూ గడిపి వేయగలను. నీకు ఆలోచించు కోవాలనిపిస్తే... ఆలోచించుకొని చెప్పు... రతి ..ఒకవేళ... ఒకవేళ ... నీ కెటువంటి భావమూ నామీద లేకపోతే... చంద్రకాంత్‌లాగే నన్నూ చూస్తుంటే మాత్రం... మరెపుడూ నేను చెప్పే ఈ మాటలు గుర్తు చేసుకోకు. నిర్భయంగా చెప్పు రతీ, మన జీవితాలకు సంబంధించిన సమస్య యిది...నువ్వేం చెప్పినా.. నీకోసం ఏ సహాయమైనా చేస్తాను రతి ... అది గుర్తుంచుకో...'' పాఠం చెప్పినంత శ్రద్ధగా చెప్తున్న రాజాను చూస్తూ కూర్చుంది ఆరతి. తెలియని విషయం చెప్తున్నపుడు ఎంత శ్రద్ధగ విని అకళింపు చేసుకొంటుందో అంత శ్రద్ధగానూ వింది...



జీవన సరళిలో తీయని రవళి

''రతీ'' అన్న అతని పిలుపే క్రొత్తగ వినిపించి ఏదో తీయని స్వప్న ప్రపంచపు సౌందర్య ద్వారాలు తెరిచినట్లనిపించి తనను తానే మరచిపోయింది, కాసేపు. అతను చెప్తుండగా వింటుంటే, అతని భావం ఆమె హృదయపులోతుల్లో నిద్రాణంగా ఉన్న స్పందనను తట్టిలేపి నిలువెల్లా, అణువణువున ఆవరింపచేసింది. ఏమని చెప్తుంది? ఎలా ఆనందాన్ని వ్యక్త పరుస్తుంది ?

మౌనంగా తలవంచుకొని కూర్చొన్న ఆరతి మొహంలో నాట్యమాడుతున్న భావోద్వేగం కళ్ల చివరలనుండి కాంతిగా, పెదవుల చివరల నుండి చిరునవ్వుగా, మొనదేలిన ముక్కునుండి కెంజాయగా చెంపల్లో ప్రతి ఫలించి అపూర్వమైన సౌందర్యాన్ని సృష్టించి 'మనసు' అనే పదానికి నిర్వచనం చెప్పినట్లనిపించింది రాజాకి

''రతి... రతీ... నన్నెంత అదృష్టవంతుడిని చేసావు'' మోహావేశంతో ఒక్కుదుటున ఆమె తలను గుండెలకు చేర్చుకొని ఆర్తిగా తల నిమురుతూ ఉద్వేగంగా అంటుంటే. ఆ క్షణం ఆరతి జీవితంలో మధుర క్షణం కాకేమౌతుంది ?

''రాజా... రాజా... నువ్విస్తున్న ఈ వరాన్ని కాదంటే నాకు జీవితమే లేదు.'' మాటలు రానట్లు తడబడిపోయింది. అతన్నుండి విడివడుతూ ధైర్యంగా కళ్లెత్తి చూసింది. ప్రేమ, అభిమానం, ఆప్యాయత, ఆరాధన మరెన్నో కలిసి అభయం యిస్తున్నట్లు ఆర్ద్రతగా చూస్తున్న ఆ చూపుల్లో చూపు కలిపింది. తనకు కావలసిందేదో దొరికి పోయినట్లు నిశ్చింతగ ఊపిరి పీల్చింది ఆరతి.

ఆ రోజు, ఆ క్షణాలు శాశ్వతం చేసుకొంటూ యిద్దరూ గుండెల్లో మమత నింపుకొన్నారు. యింక ఎవరేమన్నా భయం లేదు. ఇద్దరిమధ్య మనసులో మాట చెప్పుకోకముందు ఎటువంటి బంధం అజ్ఞాతంగా ఉండేదో... ఆ బంధమే యిపుడు యిద్దర్నీ స్వేచ్ఛగా - శాసిస్తోంది.

(ఇంకా వుంది)

చిలకలూరిపేట కళా సదస్సువారు నిర్వహించిన నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శన ''పలుకే బంగారమాయే'' (అనకాపల్లి) నాటకానికి బహుమతి నందజేస్తున్న సంస్థ అధ్యక్షుడు శ్రీ కందిమళ్ల నారాయణమూర్తి.



అనగనగనగా ఒక కథ!

ఇస్మాయిల్ ఖాన్

అప్పుడెప్పుడో ఒకనాడు అందమైన ఇల్లది!

ఈనాడు చాలా పాతది... శిథిలావస్థకి చేరుకుంది.

ఎక్కడో ఆహారాన్ని ఏరి, తీరిగ్గా తిందామనే ఉద్దేశంతో ఇళ్ళపై కప్పులమీద వాలి, కాళ్ళక్రింద పెట్టుకున్నది కాస్త పెంకుల మధ్య ఇరుక్కుంటే, దాన్ని మళ్ళీ తీసి తినాలనే ఆదుర్దాతో తమ ముక్కులతో పెంకుల్ని లాగే పక్షులవల్ల చిందరవందరైన కప్పు.

వెల్లవేసి చాన్నాళ్ళయ్యిందనటానికి నిదర్శనంగా నల్లబడి అసహ్యంగా కనపడే గోడలు.

పగటివేళ ఇంటిలోకి పూటిగా దూసుకు వచ్చే సూర్యుని కిరణాలు వెలుగునిస్తే—

రాత్రులు చంద్రుడు కొండమీదనుంచి పడే జలపాతంలా కురిపిస్తాడు వెన్నెల!

విసనకర్రల అవసరం అసలే అక్కరలేదు! ఆ ఇంటి కప్పును ఎన్నో ఏళ్ళు మోసిన గోడలు ఇక మోయలేననుకున్నాయేమో ఒక వైపు గోడ కొంచెం ప్రక్కకు ఒరిగింది. మరోవైపు గోడ సగం పడిపోయింది. కప్పు కూలకుండా ఆధారంగా గుంజలు పెట్టారు. ఇంకోవైపు గోడకూడా ఏ క్షణంలోనైనా పడిపోయేట్టుంది.

అది వారికి చావుబ్రతుకుల సమస్యగా మారింది. ఎప్పుడు కూలుతుందోననే భయం పట్టుకుంది. ఆ ఇంట్లో చదువుకుంటున్న ఇద్దరు పిల్లలకు తప్ప మిగతా వారికి బ్రతుకు మీద ఏవగింపు కలుగుతోంది. అయినా మృత్యువు నీడన కాలం వెళ్ళబుచ్చాలంటే భయమేకదా! ఇల్లు కూలి మీదపడితే చావకుండా కాలో చెయ్యో విరిగితే మరో రకం నరకం అని కావచ్చు.

మొత్తానికి ఆ ఇల్లు భారత పుత్రుడి దిగజారిన సగటు జీవితానికి ప్రత్యక్ష నిదర్శనంగా ఉంది.

అదొక వింతైన వాతావరణం!

ఇక వర్షం కురిస్తే మాత్రం ఆ ఇంట్లో చిన్న చెఱువు ఒకటి ఏర్పడుతుంది. దాంతో నిలవటానికి, కూర్చోటానికి చోటుండదు.

పక్షవాతంతో కాలూ, చెయ్యి పడిపోయిన గోపయ్య ఎప్పుడూ మంచం మీదే. వర్షం వచ్చిన రోజు అతనిమీద వర్షపు నీరు పడకుండా ఇద్దరు ముగ్గురు తలో చెంబు, తపేలా పట్టుకొని నిలబడాల్సిందే!

"వేరే ఇంటికి మారుదాం నాన్న?" అన్నాడు కొడుకు శివ ఒకనాడు తండ్రితో.



గోపయ్య అందుకు అంగీకరించలేదు. బయట కట్టే అద్దెదో దాచి కూతురు పెళ్ళి చేయాలని అతని ఆశ. కొడుకుతో అదే చెప్పాడు. అయితే అతనికి వచ్చే కొద్ది జీతం ఇంటి అవసరాలకే సరిపోతోంది. ఇల్లు మారాలనే శివ కోరిక కోరికగానే మిగిలింది. డబ్బు దాచి కూతురు పెళ్ళి చేయాలనే గోపయ్య ఆశ ఆశగానే మిగిలిపోయింది.

గోపయ్య ఇల్లూ మారనివ్వలేదు...పరిస్థితుల ప్రభావంతో శివ డబ్బూ దాచలేకపోయాడు.

ఆ రోజు ఆదివారం.

అందరికీ సెలవురోజు. మరునాడు మూలే అనుకోండి. అది వేరే విషయం! కాని, ఆ రోజు ఒక కన్నెపిల్ల వయసుక్కూడా సెలవుదినం కాబోతోందని ఎవరికి తెలుసు?

గోపయ్య స్నేహితుడు, ఆ ఇంటికి చిరపరిచితుడైన జనార్ధన్ వెంటబెట్టుకు వచ్చిన ఇద్దరు కొత్త వ్యక్తులకు తప్ప—!?

ఆ సమయంలో అందరూ ఇంట్లోనే ఉన్నారు.

క్రొత్తవారి రాకతో ఇంటి వారందరూ కంగారు పడిపోయారు. బహుశా తమని, తమ

ఇంటిని చూస్తే తాము పడే కష్టాలు, తమ దీనస్థితి, హీనస్థితి వాళ్ళకు తెలిసిపోతుందని కావచ్చు.

శివ అప్పుడే బజారుకెళ్ళటానికి తయారవుతున్నాడు. అతిథుల రాకతో ఆగిపోయాడు. అప్పుడు సాయంత్రం నాలుగైంది.

జనార్దన్ వెంట వచ్చిన వాళ్ళ వయస్సు యాభై కిలోపే ఉంటుంది. మధ్య గదిలో గోపయ్య మంచం ప్రక్కనే మూడు కుర్చీలు వేయించాడు జనార్దన్. ఇప్పుడిప్పుడే త్రుప్పు పడుతున్నాయా కుర్చీలు.

వాళ్ళను గోపయ్యకు పరిచయం చేశాడు జనార్దన్.

"వీడు నా స్నేహితుడు రాజారావు. ఈయన రాజారావుకు బాగా తెలిసిన వారు కోటిగారని. ఇద్దరూ కలిసి విజయవాడలో స్టీలుకొట్టు వ్యాపారం చేస్తున్నారు. ఇద్దరిదీ ప్రక్కనున్న చందర్లపాడు గ్రామమే."

"అలాగా."

అసలు సంగతి ప్రారంభించాడు జనార్దన్.

"ఈ కోటిగారికొక కొడుకున్నాడు. పెళ్ళి చేద్దామనుకుంటున్నారు. పేదింటి పిల్లను కోడలుగా తెచ్చుకోవాలని ఉబలాట పడుతున్నారు. అబ్బాయి సొంత ఊరిలోనే వ్యవసాయం చేస్తున్నాడు. కొంత మాగాణి భూమి ఉంది. నీకు ఇష్టమైతే ఒప్పేసుకో. నీ గురించి అన్నీ ముందే వీరికి వివరించాను. ఇక ఆలశ్యం నీదే!"

అది విన్న ఆ ఇంటి వారి హృదయాలలో పన్నీటి జల్లు కురిసింది. అసలు తాము వింటున్నది కలా? నిజమా? అనే డోలాయమాన స్థితిలో వచ్చారు. వారి హృదయాలు తియ్యగా స్పందించసాగాయి. ఆనందంతో కూడిన చిన్న వణుకు పెద్దవాళ్ళల్లో బయలుదేరింది!

బజారు వెళ్ళటానికి తయారవుతున్న శివ జనార్దన్ చెప్పినది వినగానే వెంటనే ఆగిపోయి, మూలపడిన ఫ్లాస్కు తీసి తనేకడిగి టీ కోసం హోటల్‌కి పంపించాడు తమ్ముడికిచ్చి.

శివ తల్లి అనసూయమ్మలో హడావుడి మొదలైంది. తమ స్తోమత ఏదో వాళ్ళకు తెలిసినా వరండాలో నున్న కుక్కి మంచాన్ని మరో గదిలో ఉంచింది. అందాక లేని తొందర ఎక్కడ్నుంచి వచ్చి పడిందో ఆమెలో!

అంతకు ముందే వసారాలో కూర్చుని చిన్న కొడుకు అన్నంతిని ఖాళీచేసి వదిలి వెళ్ళిన పళ్ళెం గ్లాసు గబగబా తీసేసింది అక్కడ్నుంచి!

ఓ మూల చినిగి, మాసిపోయిన బట్టలుంటే వాటిమీద బాగున్న దుప్పటి నొకదాన్ని కప్పింది.

ఆమెలో ఆదుర్దా అధికమైంది. ఇంకేం చేయాలో పాలుపోలేదు. ఒక క్షణం అక్కడే నిలబడి ఇంటిపై దృష్టి సారించింది. బూజు దులిపి చాన్నాళ్ళయిందనిపించిందామెకు.

సాలెపురుగులు దట్టంగా అల్లుకున్నాయి. "సాలె పురుగులైనా కాకపోతిమి అడవిలోనైనా చక్కటి గూళ్ళను నిర్మించుకోవచ్చు" అనే చిలిపి ఊహ కలిగింది శివకి. ఆ వూహ రాగానే నవ్వుకున్నాడు.

గోపయ్య భార్యను కేకేసి కూతుర్ని తీసుకు రమ్మన్నాడు. ఆమె ఏదో గుర్తుకొచ్చినదానివలె రోడ్డువైపు నడిచింది హడావుడిగా.

గోపయ్యకి జనార్దన్ చెప్పిన విషయాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కృతజ్ఞత ఎలా చెప్పాలో అర్థం అయి చావటంలేదు. మాటలు రావటమే కష్టమైపోయింది.

అతడి కళ్ళల్లోని కృతజ్ఞతను గమనించాడు జనార్దన్. అతని కళ్ళల్లో సన్నని నీటిపొర ఏర్పడింది. గోపయ్య నీరు నిండిన తన కంటి రెప్పల్ని ఆడిస్తుంటే అతనికి, కోటి కురుక్షేత్ర మహా సంగ్రామంలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించిన కృష్ణునివలె కనిపిస్తున్నాడు... ఎన్నో ఉన్నత భావాలు కలిగిన పొట్టిమనిషిలామా కనిపిస్తున్నాడు.

జనార్దన్ చిన్నగా నవ్వుకున్నాడు.

బట్టలుతుకుతోన్న కూతుర్ని లేపి, చేతికి సబ్బుపెట్టి ఇచ్చింది అనసూయమ్మ. అరుణకు అర్థం కావటంలేదు పరిస్థితి.

"త్వరగా ముఖం కడుక్కో. నిన్ను చూట్టానికి వచ్చారు."

అరుణ గుండెలు వేగంగా కొట్టుకోసాగినై. సబ్బుతో చేతులు, ముఖం కడుక్కొని ప్రక్కనున్న గుమ్మంలో నుంచి ఇంట్లోకెళ్ళింది. అప్పటికే తల్లి సంవత్సరం క్రితం శివ తెచ్చిన నీలం రంగు చీర, జాకెట్టు తీసి సిద్ధంగా ఉంచింది. ఉన్న రెండు చీరల్లోనూ అదే కాస్త బాగుందనిపించిందామెకు— మాసిపోయిపాతబడ్డా! నాలుగేళ్ళక్రితం కొన్న చీరకుమల్లే ఉంది!!

పౌడరు పల్చగా ముఖానికి అద్దుకోమంది తల్లి. జడ ఉదయమే వేసుకుని ఉండటంతో ఆ బాధ తప్పిందిప్పుడు.

"రా, త్వరగా ?" అంటూనే కూతుర్ని లాక్కెళ్ళినంత వేగంగా తీసుకొచ్చి చూడొచ్చిన వాళ్ళముందు నిలబెట్టింది.

ఇరవై మూడేళ్ళ వయస్సును దాచలేకపోతుంది ఆమె ముఖం. ఎర్రటి ఆమె దేహఛాయకి నీలం రంగు చీర మరింత అందాన్నిచ్చింది. నిండుగా కనబడిందామె వాళ్ళకు. తమకు నచ్చినట్లు తలాడించారు వాళ్ళు.

జనార్దన్ అరుణను లోనికి తీసుకెళ్ళమని సైగ చేశాడు. అరుణ లోనికెళ్ళిపోయింది. ఒకే ఒక నిముషం నిలబడింది అరుణ వాళ్ళముందు. ఆ నిముషం తర్వాత సుడిగుండంలో చిక్కుకున్న చేప ఒక్కసారిగా ప్రవాహంలో పడి ఊపిరి పీల్చుకున్నట్లయింది!

అనసూయమ్మలో ఎన్నోరకాల వేడుకలు, ఎన్నో ప్రార్థనలు... ఈ సంబంధమే నిర్ణయమవ్వాలని, ఈ సంబంధం తప్పిపోకూడదని.

అరుణ మనసు రెక్కలు విప్పుకుంది. ఇప్పటివరకు ఇదొక జైలు. ఆ జైల్లోంచి స్వేచ్ఛ లభించబోతోంది!

వినీలాకాశంలో ఆనందంగా ఎగురుతోంది. ఎవ్వరితో పంచుకోవాలో ఈ ఆనందాన్ని? అర్థం కాక ఉక్కిరి బిక్కిరి అవుతోంది ఆమె మనసు. ఆమెకు వెయ్యేళ్ళ అనుభూతి కలుగుతూంది.

తండ్రి బాగుండి ఉంటే ఈపాటికి నలుగురు పిల్లల తల్లి అయ్యేది తను. ఆ యోగం లేదు కనుకే ఇలా రాయిలా పడి ఉంది! తీపి కలలు కంటూ, చేదు జీవితం అనుభవిస్తుంది. తన కలల్ని ఊహల పల్లకీల్లో మోస్తూ, వేడి నిట్టూర్పులు విడుస్తూ కాలం తీర్చుకోసం వేచి చూస్తూండిపోయింది. ఎంతకీ పండని కలల్ని

న్యూఇండియా అస్యూరెన్స్ కంపెనీ డివిజనల్ మానేజరు శ్రీ వాదూరి వెంకటరామన్ దంపతులని వారి వివాహ రజతోత్సవ వేడుకల సందర్భంగా సత్కరించిన విజయవాడ బ్రాంచి మానేజరు శ్రీ జి. రామమూర్తి దంపతులని చిత్రంలో చూడవచ్చు.



చూసి ఎందుకీ బ్రతుకు ? అనిపించేది. ఎండి పోతుందేమో అనుకున్న మ్రాను మళ్ళీ చిగురు వేయసాగింది.

"అబ్బాయినికూడా తీసుకు రావలసింది?" అన్నాడు గోపయ్య.

"అక్కర్లేదు ! నా మాటే వాడి మాట. అమ్మాయి మాకు నచ్చింది. మరి...?"అంటూ ఆగాడు కోటి.

"అడగండి ?" అన్నాడు శివ — తండ్రి మంచంమ్మీద కూర్చుంటూ.

"అయిదు వేలు !" అన్నాడు కోటి.

కొద్దిసేపు మవునం రాజ్యమేలింది.

అనసూయమ్మ గుండె ఆగినంత పని అయ్యింది అంత కట్నం అడిగేటప్పటికి.

అరుణ గుండెలో రాయి పడింది. నీరుకారి పోయింది. ఆశ అడియాశ అయ్యింది.

తియ్యటి ఊహాలోకాల్లో విహరిస్తున్న స్వేచ్ఛాపక్షిని ఎవరో తమ మంత్రోచ్ఛారణతో నేలకూల్చినట్టయ్యింది.

ఒక్కసారి అరుణలో దిగులూ బయలు దేరింది. ఆ కళ్ళల్లో కాంతి పోయి కన్నీరు వుబికింది.

అయిదు వేలు కట్నం ఇవ్వలేమని ఆమెకు తెలుసు. అందుకే ఆ దిగులు... ఆ నిరాశ... ఆ కన్నీరు.

అనసూయమ్మలో శక్తి హరించుకు పోయినట్లు నిలబడ్డ చోటే కూలబడింది. కాళ్ళు, చేతులు చల్లబడ్డాయి.

అరుణ కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది.

కోటి ఉద్దేశమయితే పేదింటి పిల్లని కోడలుగా తెచ్చుకోవాలని. కాని కట్నం ఆశ మాత్రం ఆకాశం ఎత్తుండేసరికి గోపయ్యకి కోటిలోఉన్న ఉన్నత ఆదర్శం ఏమిటో అర్థం కాలేదు ! తమ స్తోమతను జనార్దన్ వాళ్ళకి వివరిస్తే వాళ్ళు అర్థం చేసుకున్నది ఇదేనా ?

శివ ఎంతన్నా వెనుకాడే స్థితిలో లేడు. ఈ సంబంధమే ఖాయం చేసుకోవాలనుకున్నాడు.

అంత కట్నం ఇవ్వటానికి గోపయ్య సిద్ధంగా లేడు.

ముందు జనార్దన్ నోరు తెరిచాడు. "మీరు వారి పరిస్థితి గ్రహించి అడగాలి."

చివరికి ఎలాగైతేనేం నాలుగు వేలకి సంబంధం కుదిరింది.

పెళ్ళికి ఉన్నది ఒక కూతురే. ఉన్న అర ఎకరం పొలం అమ్మి కూతురు పెళ్ళి చేస్తార్లే అనుకొని అడిగాడేమో కోటి ? అనుకున్నాడు జనార్దన్.

అయితే జనార్దన్, కోటి అంత కట్నం అడగడులే అనుకున్నాడు. తీరా నాలుగు వేలకు ఒప్పందం కుదిరేక అతనికి బాధగానే ఉంది. పేదింటి పిల్లను కోడలుగా తెచ్చుకోవాలనుకునే కోటి బంగారంలాంటి పిల్లని కళ్ళు మూసుకుని కోడలుగా తెచ్చుకోక ఆమెను పెంచటానికని కాబోలు అంత కట్నం అడిగేటప్పటికి, అప్పటి వరకూ కోటిమీదున్న గౌరవభావం కాస్తా నశించి పోయింది అతనిలో.

ఒక ఆడపిల్ల కాబోయే తన భర్తకికాక కాబోయే మామగారి ఆశకి లోకువ కాబోలు ఈ సమాజంలో !

తాము చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉంటేనే ఎదుటివాడు గౌరవమిచ్చేది అనే విషయం కోటికి తెలుసు !

అయినా పేదింటి పిల్లను కోడలుగా తెచ్చుకోవాలని చెప్పి అంత ఆశకు ఎగబడ్డాడు ఎందుకనంటే ?

అది అతనికే తెలుసు ! రాజారావుకే తెలుసు !! తెలియనిదల్లా ఇతరులకే ?

అంతలో టీలు వచ్చాయి. టీ త్రాగి వెళ్ళి పోయారు — ఫలాన రోజు డబ్బు తీసుకురావాలనే విషయం మాట్లాడి.

అరుణ హృదయం ఆనందంతో పొంగి పోయింది. నేల కొరిగిన పక్షికి ఎవరో దైవాంశ సంభూతుడు ప్రాణం పోసినట్టయ్యింది. ఆమె మనసు మళ్ళీ రెక్కలు విప్పింది. సంతోషంగా పగటి కలల లోకంలో విహరించసాగింది. ఆమె ముఖంమీది విచార రేఖలు మటుమాయమైనాయి.

తల్లి కళ్ళల్లో ఏదో కృతజ్ఞత! ఎవరిమీదో? బహుశా కొడుకుమీద కావచ్చు. లేదా ఐదువేల నుంచి నాలుగువేలకు తగ్గించిన కోటిమీదో లేక జనార్దన్‌మీదో కావచ్చు. అయితే —

ఇచ్చేవాడు తన వాడైనప్పుడు, అతడే విధంగా కష్టపడి సంపాదించినా పుచ్చుకునేవాడు సక్రమంగా స్వీకరించినట్లయితే ఆమె కళ్ళల్లోని కృతజ్ఞతా భావం కోటిమీదేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

కొడుకు శివ అంత కట్నానికి ఎందుకు ఒప్పేసుకున్నాడో అర్థం చేసుకోలేకపోతున్నాడు గోపయ్య.

ఆ విషయమే అడిగాడు.

"అంత డబ్బు ఎక్కడ్నించి తెస్తావురా ? వడ్డీకి తెస్తావా ?"

తండ్రి ప్రశ్నలోని వేదన గమనించాడు శివ. తల్లికూడా అదే ప్రశ్న వేయబోయింది. భర్త అడగటంతో ఆగిపోయింది.

"లేదు నాన్న. వడ్డీకి తెస్తే కట్టలేను. నేను దాచిన డబ్బు అయిదువేలవరకూ ఉన్నాయి. వాటితో అరుణ పెళ్ళి చేద్దాం !" అన్నాడు శివ.

బాంబులాంటి వార్త అది వారికి. తాము ఎప్పుడూ వినని విచిత్రంలా తోచింది.

నిజమే! శివ అంత డబ్బు దాస్తాడని ఎవ్వరూ ఊహించలేదు. అమ్మాయి పెళ్ళి ఎలా చేయాలనే దిగులుతోనే గోపయ్య, అతని భార్య గడిపారు. ఆమె కూలి చేసినా, కొడుకు కొట్లో గుమాస్తాగా చేస్తున్నా నయాపైస దాచలేక పోయారు. అసలు మిగిలేది కాదు.

నమ్మలేని నిజం వినేసరికి నమ్మలేక పోతున్నారు వారు.

తండ్రిలో ఆరాటం — అంత డబ్బు ఎలా సంపాదించాడని.

చెల్లికి అన్నమీద ప్రేమ— తనకోసం ఏ పని చేసి దాచాడోనని.

"అంత డబ్బు ఎలా సంపాదించావు ? ఎలా దాచావు ?" తేరుకుని ఆశ్చర్యపోతూ అడిగాడు గోపయ్య.


తల్లిలో, చెల్లిలో ఆశక్తి పెరిగింది.

"రోజా దినపత్రికలు వేస్తున్నా నాన్న. ఇన్నాళ్ళూ మీకీ విషయం చెప్పనేలేదు. అందుకే ఈ సైకిల్ కొన్నది కూడా !"

అసలు సంగతి నాలుగేళ్ళ తర్వాత ఇప్పుడు చెప్పాడు శివ.

"ఇన్నాళ్ళు చెప్పలేదే ?" బాధగా అన్నాడు తండ్రి.

తల్లి, చెల్లి వింత శ్రోతలయ్యేరు. వాళ్ళకు వింతగా ఉంది, విచిత్రంగా ఉంది.



శివ మాట్లాడలేదు. ఇలా దాస్తున్నానని చెప్తే లేనిపోని ఖర్చులు సృష్టింపబడతాయని అతని భయం. అందుకే ఎవరికీ చెప్పకుండా జాగ్రత్తపడ్డాడు. అలా అని తండ్రికి చెప్పలేదు. చెప్తే — "నీ డబ్బును మేం అనవసరంగా ఖర్చు పెడతామా ?" అని మరింత బాధ పడతాడని.

"రోజూ ఉదయాన్నే సైకిల్ మీద వ్యాయామం చేస్తే ఒంటికి మంచిదని నమ్మించి పేపర్లేస్తున్నావా ?"

గోపయ్య హృదయం బాధతో మెలికలు తిరిగింది.

తల్లి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

చెల్లి హృదయం — అన్న తన కోసం డబ్బు దాచిన విషయం బయటపడ్డప్పట్నుంచి మౌనంగా కన్నీరు కారుస్తూనే ఉంది.

ఆ క్షణంలో తనెప్పుడు పోయినా తన కుటుంబానికి ఏ బాధలేదు. తన తెలివితేటలతో తన సంసారాన్ని ఒక కొలిక్కి తేగలడు తన కొడుకు అని అనిపించింది గోపయ్యకు.

అయితే తల్లిలో మాత్రం తను పొలానికి వెళ్ళి కూలి చేయకపోయినా, ఇల్లు గడిచేది, ఇకముందు గడుస్తుంది అనే భావం కలగలేదు. కలగదుకూడా. "పైగా తను ఒక విధంగా, కొడుకు రెండు విధాలుగా సంపాదిస్తూ దాచాడు గనుక ఇప్పుడు అవసరాని కుపయోగపడింది."

"నేను బయటికి వెళ్తున్నా"నని చెప్పి వెళ్ళిపోయాడు శివ.

"చూశావే, వాడేంతపని చేశాడో. మాట మాత్రానికైనా చెప్పలేదు." అన్నాడు గోపయ్య భార్యతో.

చెప్పలేదనే కోపం కొడుకుమీద లేదు. అయితే ఆ సమయంలో, ఒక ప్రక్క ఆనందంలో భార్యతో ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

భార్య కొడుకును గొప్పగా ఊహించుకో సాగింది.

'కొడుకు బంగారం !' అనుకున్నది మనసులో.

నెల రోజుల క్రితం గోపయ్య పడ్డ ఆవేదనకు, ఆరాటానికి ఇప్పుడు ఊరట లభించింది.

అతడు మంచంలో పడ్డప్పట్నుంచి కళ్ళ ముందున్న అగ్ని గుండాన్ని ఎలా తప్పించుకోవాలని ఆలోచిస్తున్నాడు... బాధపడుతున్నాడు. లోలోన కుమిలి, కుమిలి ఏడ్చేవాడు. అయితే కాలం ముందుకు సాగేకొద్దీ మామూలు జీవితానికి అంకితమయ్యాడు. ఏడ్వటం మానేశాడు. ఆలోచించటంలేదు. అతనిలో ఒక రకమైన నిస్తేజత ఆవరించింది. భారం కాలానికి వదిలేశాడు. అతడు రాయి. బాధపడి మాత్రం ఏం చేయగలడు. అందుకే కలత చెందటంలేదు.

కూతురు కళ్ళముందు కదులుతూంటే అతనికి చాలా చిన్నపిల్లవలె కనిపించసాగింది !

అనగనగా ఒక కథ

అయితే మంచంలోపడ్డ ఆరేళ్ళకు, బాధ పడటం మానుకున్న మూడేళ్ళకు అతనిలో ఒక్కసారిగా కలవరం రేగింది — కూతురి పెళ్ళి గురించి. నిశ్చలంగానున్న నీటిమీద రాయి విసిరి నట్లయ్యింది.

ఓ రోజు అర్ధరాత్రి గోపయ్యకు నిద్రాభంగ మయింది. ఎవరో పాటలు పాడుతున్నారు.

ఇంత రాత్రివేళ పాటలు పాడేది ఎవరూ ? క్రైస్తవ మత ప్రచారకులా ? కాదు... వారు సినిమా పాటలు పాడరు ! మరెవరూ ? విద్యార్థులా ? కావచ్చు. కాలేజీ, డిగ్రీ మొదలైన మాటలు వినిపిస్తున్నాయి. అవతల ఇళ్ళల్లో కాలేజీ కుర్రాళ్ళు దిగారన్నమాట. అంటే పోకిరి వెధవలు ! ?

అతడు ఆడపిల్ల తండ్రి గనుక వాళ్ళు అతని దృష్టిలో అటువంటివాళ్ళే ! ఒక ఉద్దేశ మంటూ లేని ఆదర్శాలతో, అన్నీ తెలుసను కుంటూనే సంస్కారహీనంగా ప్రవర్తించే యువతరమంటే ఆడపిల్ల తండ్రుల దృష్టిలో వాళ్ళు పోకిరిగాళ్ళే ! !

అతనిలో ఏదో భయం ఆవరించింది. రాత్రంతా నిద్రపోలేదు గోపయ్య. ఒకటే ఆలోచనలు. ఎటూ తెగటంలేదు, చిక్కుపడిన దారానికిమల్లే.

తెల్లారింది. భార్య పొలాని కెళ్ళిపోయింది. పిల్లలిద్దరూ చదువుకోసాగారు. అరుణ అంట్లు తోముతోంది. శివ కొట్టుకు బయలుదేరాడు.

"ఒరేయ్. శివ ఒక మాట ?" కొడుకును పిల్చాడు గోపయ్య.

తండ్రి వైపు ఆశ్చర్యంగా చూశాడు. ఎప్పుడూ పిలవని తండ్రి ఈ రోజు ఇలా పిలవటంలో ఏదో ప్రత్యేకత కనపడింది శివకి. కుర్చీ లాక్కొని కూర్చున్నాడు.

"రాత్రంతా అసలు నిద్రే లేదురా. పక్కిళ్ళలో ఎవరో గొడవ చేస్తున్నారు. ఎవరు వాళ్ళు ?" తెలిసే అడిగాడు తెలియనట్లు.

"కాలేజీ పిల్లలు !" కొద్దిసేపు మౌనం.

"అరుణకి పెళ్ళి చేయాల్రా ?" తండ్రి కంఠంలోని ఆదుర్దా, భయాన్ని అర్థం చేసుకున్నాడు శివ.

! .... ?

నేటి లోకంలో
నిస్వార్థమైన స్నేహం
ఆశ్చర్యార్థకం !
పవిత్రమైన ప్రేమ
ప్రశ్నార్థకం...?

— కొల్లు రంగారావు

కాని, తన చెల్లెలు నిప్పు ! ఆ నిప్పు మండుతున్నంతసేపు ఎవరూ ముట్టుకోలేరు. అయితే ఎవరైనా ముట్టుకున్న మరుక్షణం నిప్పు ఆరిపోతుంది. ఎవరో ముట్టుకో అక్కరలేదు. వెలిగి వెలిగి కాసేపటికి ఎంతటి నిప్పయినా చల్లారిపోక తప్పదు. ఆ తర్వాత తమ పరువు ?

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?"

"ఏం లేదు... అలాగే చూద్దాం నాన్న."

"మరి కట్నం... సంగతి ?"

"చూస్తా లెండి." అని మరో మాటకి అవకాశం ఇవ్వకుండా, "నాకు టైం అవుతోంది" అంటూ వెళ్ళిపోయాడు శివ.

"ఏం చూస్తాడు ?" అనుకుంటూ తనలో తనే బాధపడసాగేడు.

పదింటికల్లా పిల్లలిద్దరూ బడికి వెళ్ళి పోతారు. ఇక ఆ ఇంట్లో మిగిలేది తండ్రీ, కూతుళ్ళిద్దరే. ప్రతి రోజూ ఇంతే.

కొన్ని రోజులు గడిచాయి.

గోపయ్య ప్రవర్తలో మార్పు రాసాగింది మెల్లమెల్లగా.

చీటికి మాటికి కూతురు మీద విసుక్కో సాగాడు. పక్కింటి వాళ్ళతో కూతురు చీరల విషయమై, కూరల విషయమై మాట్లాడు తూంటే, "ఎవరితో మాటలు ? ఎప్పుడూ కబుర్లేనా ?" అంటూ సాధించటం మొదలు పెట్టాడు. నవ్వినా కోప్పడతాడు.

తండ్రి ప్రవర్తన అరుణకి కోపాన్ని తెప్పించినా పల్లెత్తుమాట మాట్లాడదు. తను పక్కింటి వాళ్ళతో మాట్లాడే సమయాల్లో నవ్వినా తండ్రికి వినపడకుండా జాగ్రత్తపడటం అలవాటు చేసుకుంది! తండ్రిలో వచ్చిన మార్పుకి కారణం ఆమెకు తెలియదు.

ఆ ఇంట్లో ఏం జరుగుతుందో అవతలి వాళ్ళకు స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ఆ ఇంటి ప్రహరీ గోడ చాలా చిన్నది. మట్టిది. వర్షాలకు పడిపోయి, కరిగిపోయి, చలిలో ముడుచుకున్న ముసలిదాని వలె తయారైంది.

అక్కడ ఇంటి ముందు నిలబడితే ఎండకి కూతురి నీడ, మధ్య గదిలో మంచం మీదున్న గోపయ్యకి కనిపిస్తూనే ఉంటుంది. ఆ నీడ కనపడిందంటే చాలు ... కూతురు గడపదాటి పోయినట్లే విలపిస్తాడు... సహించడు. అతని బాధ ఎవరికీ అర్థం కానిది.

తను ఎటూ కదల లేదు. ఎంతసేపని, ఎన్ని రోజులని కూతుర్ని శాసించగలడు ? పొలం పనులకు వెళ్ళొద్దని భార్యతో చెప్తే ఇల్లు గడవటం కష్టం. మరి దీనికి తోడెవరుంటారు? పిల్లలు బడికెళ్ళిపోతారు. తమ దేనికీ పనికిరాడు. ఒక రకంగా చెప్పాలంటే తను రాయి. రాయి అయినా కొంచెం ఉపయోగపడుతుంది ! తనవల్ల ఉపయోగం లేదు సరికదా ఉన్న పొలం కాస్తా హరించుకుపోయింది. అయినా ఆరోగ్యమూ కలగ లేదు. నయమవని జబ్బని తెలిసి కూడా బంగారం

లాంటి పొలాన్ని అమ్మకుండా ఉంచలేకపోయింది— తన మాంగల్యాన్ని నిలుపుకోవటానికి అతని భార్య.

ఒక్కసారిగా తనమీద తనకే అసహ్యమేసింది. ఈ జీవితం మీద కోపం, కసి, బాధ. చద్దామన్నా చేతకాదు. తననిస్సహాయతను నిందించుకున్నాడు.

ఒక ప్రక్క కూతురుకు తోడెవరూ లేరు. మరో ప్రక్క విద్యార్థుల వెధవ్వేషాలు, చూపులు ఆడ పిల్లని రెచ్చగొట్టక ఏం చేస్తాయి ?

ఏమో ? ఏ వేళ ఎటువంటిదో ? ''తనకీ జన్మకి పెళ్ళికాదని'' తన కూతురు అను కుంటే ...?

ఆ తరువాత ఊహించుకోలేకపోయాడు.

అయితే— ''పెద్ద వయసుండి పెళ్ళికాని పిల్లలు లోకంలో ఎంతమంది లేరు? వాళ్ళందరూ గడపదాటి బయటికి పోతున్నారా [కాలు జారు తున్నారా ?] వాళ్ళలాంటిదే కదా తన కూతురూమా ?'' అనే తలంపేనాడూ గోపయ్య మనసుకు తట్టనే లేదు !

''గోడ దగ్గర నిలబడటం దేనికీ ? ఏదైనా పని ఉంటే వరండాలోనుంచి అవతలి వాళ్ళతో మాట్లాడు. అంతే !'' అని ఒక రోజు ఎమర్జెన్సీ ఆర్డర్ జారీ చేశాడు గోపయ్య.

లోకం పోకడ అతనికి తెలియంది కాదు. ఈ రోజు ''చాలా మంచి దానివి'' అన్న నోరే రేపు ఆమె ప్రవర్తనను అపార్థం చేసుకుని నింది స్తుంది. ''ఛీ!'' అంటుంది. ప్రక్కింటి వాళ్లతో నవ్వుతూ, మాట్లాడుతూ అవతలికి చూచినప్పుడు — అదే సమయంలో అవతలి ఇళ్లల్లో ఉన్న కాలేజీ కుర్రాడొకడు తనూ ఎవ్వరితోనో మాట్లాడుతూ, నవ్వుతూ ఇటు వైపు చూచినప్పుడు ...? ఏమవుతుంది ? వారిద్దరికీ సంబంధం అంటగట్ట బడుతుంది !

ఒక గంటకల్లా గుప్పున చెడ్డవాసన వ్యాపించినట్లు, ఎవరో పనిలేని పుల్లమ్మలు ఉంటారుగదా వాళ్ళు వ్యాపింప చేస్తారు పేట పేటంతటకి.

ఆ తరువాత ఆ అమ్మాయి భవిష్యత్తు—?

అంటే సమాజం ఈ విధంగా అపార్థం చేసుకుని తన కూతుర్లాంటి కూతుర్ల బ్రతుకుల్ని నవ్వులపాలు చేస్తుంది. నిండు జీవితాలతో చెలగాట మాడుతోందన్నమాట. ఎంత హీన మైన పని? ఎంతటి విచారకరమైన విషయం?

ఇతరులతో ఎక్కువగా మాటాడటాన్ని ఆక్షేపించడం పొరపాటని, ఒంటరిగా ఉంటేనే అర్థంలేని ఆలోచనలు మనసును తొలిచేస్తాయనే ఊహే అతనికి కలగలేదు. అతనికి కావలసింది తన కూతురు ఎవ్వరితోనూ మాట్లాడకూడదు. తరువాత-పరిణామాలు ఉలా ఉన్నా సరే!

తను ఈనాడు ఈ పరిస్థితుల్లో లేకుంటే? తనకున్న నాలుగెకరాల మాగాణీ నేలలో బంగారం పండించి ఈ పాటికి పెద్ద కూతురితోపాటు చిన్న కూతుర్ని కూడా అత్తారింటికి పంపేవాడు. కాని, విధి వక్రించింది. తను మంచంలో పడ్డాడు. ఎకరం పొలం అమ్మి పెద్ద కూతురి పెళ్ళి చేశాడు. ఉన్న కొద్ది పొలంలో దాదాపుగా తన జబ్బు నయం కావటానికి అమ్మ వలసి వచ్చింది. మిగిలిన అరెకరం కౌలుకిచ్చేడు. పెళ్ళి అయిన కాడ్నుంచి తను భార్యను పొలానికి పంపటం మానిపించాడు. తరువాత తను పడి పోవటంతో మళ్ళీ కొడవలి చేత పట్టవలసి వచ్చింది. ఇంతటి గతి ఎందుకు పట్టిందంటే— తను మంచంలో పడటంవల్ల. తన రెండో కొడుకు ఇంకా చదువుకోక పోవటానిక్కారణం తను. పెద్దకొడుకు ఇంట్లోంచి పారిపోవటానిక్కారణం తను—సిగరెట్లు త్రాగే చెడు అలవాటు అలవర్చు కున్నాడనే కోపంతో మందలించి, దండిస్తే రోషంకొద్దీ ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. లేకపోతే చిన్న కొడుకు పడుతున్న బాధ వాడే పడేవాడు. ఈ పాటికి ఏదో ఉద్యోగం చేస్తూ తమను పోషిస్తూండేవాడు ! మిగిలిన మగపిల్లలు, వయసులో ఉన్న కూతురూ చాలీచాలని బట్టల్లో ఉంటానిక్కారణం తను.

వీటన్నిటిక్కారణం ఆర్థిక సమస్యలూను. ఆ సమస్యలు ఏర్పడ్డానిక్కారణం తనే! ఎంత ఆలోచించినా చివరికి తన కుటుంబ పరిస్థితిని దిగజారటానికి తను, ఆర్థిక సమస్యలే కారణాలుగా కనిపిస్తున్నాయి.

మరి ఇన్ని సమస్యలవల్లే కూతురు మీద అన్నన్ని ఆంక్షలు!?

అయితే తన మూడో కూతురు ఉమ చావటానిక్కారణం ఎవరూ ? ఆ దేవుడు ! బహుశా తన ఆరోగ్యం ఈ స్థితికి చేరు కుంటుందనే కాబోలు నాలుగో ఏటనే అర్థంకాని జబ్బుతో తనలో ఐక్యం చేసుకున్నాడు-దయా మయుడు !


కూతురిమీద విధించిన ఆంక్షల్లో విచిత్ర మైనది — సినిమాలు చాలా తక్కువగా చూడ నివ్వటం ! అదీ ముందుగా గోపయ్య ఎవ్వరితో నైనా కథ తెలుసుకొని, అది మంచి సినిమా అయినా వయసును రెచ్చగొట్టే సీన్లుంటే కూడా పోనివ్వడు. అప్పుడప్పుడు గోపయ్య వద్దన్నా అతనికి తెలియకుండా శివ దగ్గర డబ్బులడిగి వెళుతుంది. నవల్లు కూడా చదవనివ్వడు. అయితే పత్రికలుగాని, నవల్లుగాని తేడు శివ. బాల సాహిత్యపు పుస్తకాలు మాత్రం ప్రతినెలా రెండు తెస్తాడు శివ. ఆ సలహా ఇచ్చింది గోపయ్య !!

తను బాగుండి ఉంటే ఇల్లు ఈ స్థితిలో ఉండేదికాదు. ఈ స్థితిలో ఉండకుండా ఉండి ఉన్నట్లయితే కారుతున్న ఇంటిమీద తాటాకులు కప్పటానికి చిన్నకొడుకు ఎక్కి, దిగేటప్పుడు క్రిందపడి చేయి విరగ్గొట్టుకునేవాడుకాదు.

పెళ్ళి కుదరక ముందు కూతురిమీద తన ఆంక్షలు ఒక ఎత్తు. ఇప్పుడు గోపయ్య నిఘా మరింత పెరిగింది. ఈ సమయంలోనే జాగ్రత్తగా ఉండాలి. యుద్ధ పరిస్థితులే ఏర్పడకూడదు. ఏర్పడ్డాక అజాగ్రత్తగా ఉంటే పరిణామాలు తీవ్రస్థాయిలో ఉంటాయి. ఆ ఉద్దేశంతోనే కూతుర్ని మరింత జాగ్రత్తతో గమనించసాగేడు గోపయ్య.

ముందు డబ్బిచ్చి ముహూర్తం నిశ్చయించు కుందామనుకున్న కోటి ఒప్పందాన్ని ఉల్లంఘించ లేక డబ్బు తీసుకుని బయలుదేరారు శివ, జనార్ధన్ మంచిరోజు చూసుకొని.

అయితే డబ్బిచ్చేముందు అబ్బాయి అంద మయినవాడా ? అవిటివాడా ? పెళ్ళిచూపులకు అబ్బాయిని ఎందుకు తేలేదు ? అనే ఆలోచనే రాలేదు ఎవరికీ ? అలా అనుకోకపోవటమనేది— అబ్బాయి మంచివాడు కాకపోతే జనార్థన్ ఎందుకు తెస్తాడు ఈ సంబంధం అనే ఉద్దేశం కావచ్చు.



అనగనగా ఒక కథ

బస్టాండు దిగుతుంటే సెంటర్‌లోనే కలిశారు కోటీ, రాజారావులు

''మీ దగ్గరకే వస్తున్నాం'' అని విషయం వివరించాడు జనార్ధన్. దగ్గర్లో ఉన్న హోటల్లోకి దారితీశాడు రాజారావు. ముగ్గురూ అనుసరించారు. ఓ ప్రక్కకు వెళ్ళి కూర్చున్నారు.

ఓ వ్యక్తి వచ్చి ప్రక్కనే మరో కుర్చీలో కూర్చున్నాడు వాళ్ళనే జాగ్రత్తగా గమనిస్తూ;

''ఫర్వాలేదు ఇచ్చేయిరా డబ్బు ?'' అన్నాడు రాజారావు.

''ఇక్కడే ? ఇంటికెళ్ళి. '' అన్నాడు జనార్ధన్.

''ఫర్వాలేదులే. నేనున్నానుగా. కోటికి భార్యలేదు. పోయి చాలా కాలమైంది. ఇంటి దగ్గర ఉండేది అతని చిన్న కూతురే,''

''ఊళ్ళోనీ నలుగురి ఎదుట ఇవ్వాలని గదా?'' నసిగాడు జనార్ధన్. రాజారావు నవ్వాడు. ఏం చేయాలన్నట్టు శివ వైపు చూశాడు జనార్ధన్.

ఇదేం సాంప్రదాయం అనుకోలేదు శివ. ఇప్పుడు ఇవ్వకపోతే వ్యవహారం బెడిసికొడుతుందేమో అనే భయంకొద్దీ ''ఎక్కడైతేనే ఇచ్చేయండి'' అన్నాడు.

బేరర్ వచ్చాడు. కాస్సేపాగి రమ్మని పంపించేరు. అతడు పక్కనే ఉన్న వ్యక్తి దగ్గర కెళ్ళాడు. ఆ వ్యక్తి సర్వర్ చేత కాఫీ తెప్పించుకున్నాడు.

జనార్ధన్ డబ్బు లెక్క బెట్టాడు. వాలుగు వేలు రాజారావు చేతుల్లో ఉంచాడు. రాజారావు కోటి చేతుల్లో పెట్టాడు.

''ముహూర్తం ఎప్పుడు పెట్టుకుందాం ?'' అడిగాడు జనార్ధన్.

''ఎల్లుండి రండి'' అన్నాడు కోటి, డబ్బు జాగ్రత్తగా కర్చీఫ్‌లో చుట్టుకుని జేబులో పెట్టుకుంటూ.

కాఫీలు తెప్పించుకుని, తాగి లేచారు. కౌంటర్‌లో బిల్లు, అయిదు రూపాయల నోటు ఇచ్చాడు. చిల్లర ఇంకా తీసుకోలేదు. అంతలో ముగ్గురు పోలీసులు వాళ్ళ కెదురుగా వచ్చారు. అప్పుడే వ్యాన్ కూడా వచ్చి ఆగింది. అందులోంచి మరో నలుగురు పోలీసులు దిగారు !

కోటీ వాళ్ళను చూసి గుస్సు తేలేశాడు రాజారావు గుండె జారిపోయింది ముచ్చెమటలు పోసాయి జనార్ధన్‌కి, శివకి విషయం అర్థం కాలేదు. కోటికి, రాజారావుకి తెలుసు పోలీసులు తమను సత్కరించటానికొచ్చారని, వాళ్ళు తమ కోసం వెతుకుతున్నారనీను ! తెలియనిదల్లా జనార్ధన్‌కి, శివకి.

''ఆ డబ్బు వాళ్ళకిచ్చేయండి !''

సివిల్ డ్రస్‌లో ఉండి వాళ్ళ ప్రక్కనే కూర్చుని కాఫీ త్రాగిన స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ అన్నాడు.

''వీళ్ళు మోసగాళ్ళు ! తమకు మగబిడ్డలున్నారని అబద్ధం చెప్పి, నమ్మించి కట్నం డబ్బుల్తో పరారవుతారు. ఇలా అరవై వేలు దాచుకున్నారు. ఎనిమిది కేసులున్నాయి వీరిద్దరిమీద మీరు అదృష్టవంతులు. కాని మరో రకంగా దురదృష్టవంతులైనందుకు విచారిస్తున్నాను'' అని కొంచెం బాధపడి ''ఊఁ.. వ్యాన్ ఎక్కించండి వీళ్ళని'' అన్నాడు యస్సై.

అక్కడున్న వారందరికీ నోట మాట రాలేదు. జనార్ధన్‌కి, శివకి అది పిడుగుపాటు సంఘటన. కలా ? నిజమా ? అన్నట్టుంది వారి స్థితి.

జనార్ధన్ వెంటనే తేరుకుని తన స్నేహితుడి వైపు అసహ్యంగా చూసి, ''వ్యాపారం చేస్తున్నావని చెప్పి ఇంత నీచానికి దిగజారతావా ? నీ బుద్ధి ఇంత హీనమైనదా ? ఛీఛీ. నువ్వు నా స్నేహితుడైనందుకు సిగ్గుపడుతున్నాను.'' అని అక్కడ్నుంచి కదిలాడు. శివకూడా యాంత్రికంగా వెంట నడిచాడు. అతడ్ని ఎవరో నిలువుగా కోసి నడిపిస్తున్నట్లుంది.

అక్కడ చాలామంది గుమిగూడారు. అందరూ తిట్టసాగారు. క్యాషియర్‌కూడా తిడుతున్నాడు. ఆవేశంగానూ, కోటీకివ్వవలసిన చిల్లరని గల్లాపెట్టెలో వేసుకుంటూ సంతోషంగానూ !

పోలీసులు వెళ్ళిపోయారు. జనార్ధన్, శివ ఇంటిదారి పట్టారు.

''నన్ను మన్నించు శివ అతడలాంటివాడని తెలియదు...'' చాలా బాధగా అన్నాడు. శివకంటేకూడా ఆయనే ఎక్కువ బాధ అనుభవిస్తున్నాడు. శివకి జబ్బు చేయకనే నోరు పడిపోయినట్టుగా ఉంది. తండ్రికి ఏమని చెప్పాలో అనే తీవ్ర మానసిక క్షోభలో పడిపోయాడు. అతని మనసులో తుఫాను లేచింది. నడుస్తున్నాననే భావనే లేదు అతనిలో.

గోపయ్య ఇంట్లో ఏడుపులు, పెడబొబ్బలు వినబడుతున్నాయి. గోపయ్య మరణించాడు. కూతురు పెళ్ళవుతుందనే సంతోషంలో నిశ్చింతగా కన్నుమూశాడు.

మృత్యువు ఎవరికి ఏ సమయంలో వస్తుందో తెలియదు. గోపయ్య విషయంలో మాత్రం సరైన సమయంలోనే వచ్చింది.

శివ మనసులో తుఫాను ఆగినట్లయ్యింది. క్షణం తరువాత వేదాంతివలె నవ్వుకున్నాడు. ఇంట్లోవారు గుండెపగిలి ఏడుస్తుంటే అతనికి కన్నీరే రావటంలేదు.

అతడు డబ్బు దాచటం అనే ఉద్దేశం చెల్లి పెళ్ళి చేద్దామని. అయితే అవసరం మాత్రం తండ్రి అంత్యక్రియలకు ఏర్పడింది.

ఎంత చిత్రం — ఇన్నాళ్ళూ కష్టపడ దానికి ఫలితం ?

విధి వీధిలో నిశిధి ! ఆ నిశీధిలో వక్రబుద్ధికి బలి అయి, చిన్నబోయిన శివుని ఆకారం !! ★

విశాఖపట్నంలో శ్రీ ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో నిర్మించబడుతున్న ''ఛాలెంజ్'' చిత్రం యూనిట్‌కి విశాఖ కళాసాగర్ సన్మానం చేసిన సందర్భంగా నటి విజయశాంతికి మొమెంటో అందచేస్తున్న సెన్సార్ బోర్డు సభ్యుడు శ్రీ టి. సుబ్బరామిరెడ్డిని చిత్రంలో చూడవచ్చు.



ప్రేక్షకుల కోసం ప్రాణాలతో చెలగాట మాడిన చంగ్ లింగ్ సూ

అద్భుత వ్యక్తులు

బి. వి. పట్టాభిరామ్
మెజీషియన్—హిప్నాటిస్ట్

ఇంద్రజాల రంగంలో ఎంతోమంది మెజీషియన్లు అద్భుతమైన ప్రదర్శనలుచేసి కీర్తి ప్రతిష్టల నార్జించటం మనం గమనిస్తున్నాము. ఇంద్రజాలికులు కేవలం స్టేజి మీదనే తమ మేజిక్ ప్రదర్శిస్తూ ప్రజలకు వినోదం కలిగిస్తారు. నిజ జీవితంలో మేజిక్ ప్రసక్తి రాదు. కానీ ఆమెరికాకు చెందిన విలియమ్ రాబిన్ సన్ అనే మెజీషియన్ నిజ జీవితంలోకూడా మేజిక్‌చేసి ప్రపంచ ప్రజలందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచివేసాడు. ఆయన చేసిన మేజిక్కేమిటంటే, నాలుగు పేర్లు పెట్టుకుని, ఆ పేర్లకుతగ్గ వేషభాషలతో ప్రవర్తించి ప్రదర్శనలు చేసి ప్రేక్షకులు, నలుగురు మెజీషియన్లు చాలా బాగా ప్రదర్శించారని మెచ్చుకునేలాగ చేసుకునేవాడు. ఆయన చనిపోయేవరకు ఆ నలుగురు మెజీషియన్లూ ఒకరేనని చాలామందికి తెలియదు.

విలియమ్ రాబిన్ సన్‌గా మేజిక్ జీవితం ప్రారంభించి, అహ్మద్ బిన్ ఆలీగా, అబ్దుల్ ఖాన్‌గా, చైనీస్ మెజీషియన్ చంగ్‌లింగ్‌సూగా చక్కని ఇంద్రజాల ప్రదర్శనలిచ్చి, ప్రేక్షకులకు ఎంతో వినోదం కలిగించాడు. రాబిన్ సన్‌గా ప్రదర్శన చేసినపుడు ఒక ఇంగ్లీషు వ్యక్తిగానూ, అహ్మద్ బిన్ ఆలీగా, అబ్దుల్ ఖాన్‌గా చేసినపుడు ఒక ముస్లిమ్ మెజీషియనుగానూ, చంగ్‌లింగ్‌సూగా ప్రదర్శన జేసినపుడు అచ్చం ఒక చైనా మెజీషియనుగా ప్రదర్శనలు చేసి, ప్రేక్షకులకు ఏకోశానా అనుమానం కలుగకుండా చేసేవాడు. వేషంలోకానీ, భాషలోకానీ, అలవాట్లలోకానీ ఎటువంటి తేడా కనిపించకుండా, ఖచ్చితంగా ఆ జాతి మనిషిలాగే ప్రవర్తిస్తూ ప్రదర్శనలుచేసి, నలుగురూ వేరు వేరు మెజీషియన్లు అని అనుకునేలాగ చేసిన మహా మెజీషియన్ విలియమ్ రాబిన్‌సన్. ముఖ్యంగా చంగ్ లింగ్‌సూగా చేసిన ప్రదర్శనలో, చైనీయులకు సంబధించిన అతి పురాతనమైన మేజిక్‌లు సేకరించి చేసిన అద్భుతమైన అంశాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవటం వలన చివరకు ఆ పేరునే స్వంతపేరుగా మార్చుకుని, చంగ్ లింగ్ సూ గానే స్థిరపడిపోయాడు.

చంగ్ లింగ్ సూ ప్రదర్శనలో అత్యంత ఆశ్చర్యకరమైన, ఒళ్ళు గగుర్పొడిచే అంశాలు ఎన్నో ఉండేవి. ఒక స్త్రీని కుర్చీలో కూర్చుండబెట్టి ఆమెపై ఒక పెద్ద బట్టను కప్పి "చింగ్ మంగ్, చంగ్ చింగ్" అని బట్టను తీయగానే ఆమె అక్కడ ఉండేదికాదు. ప్రేక్షకుల మధ్యలో కూర్చుని ఉండేది. అలాగే ఒక స్త్రీని బల్లపై పడుకోబెట్టి కొన్ని మేజిక్ మాటలు చెప్పగానే ఆమె అలా గాలిలోకి తేలి ఆడిటోరియంలో తిరిగి వచ్చేది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హ్యారీకెల్లర్ అనే మహేంద్రజాలికుడు చంగ్ లింగ్ సూ ప్రదర్శన చూసి, తన ట్రూపులో చేరమని కోరాడు. సూ వెంటనే ఒప్పుకుని కెల్లర్‌తో బాటు ఎన్నో దేశాలు తిరిగి కొత్త కొత్త మేజిక్కులు ఎన్నో నేర్చుకుని తనకు తానే సాటి అనిపించుకునేంత ప్రతిభావంతుడయ్యాడు.



అందమైన అమ్మాయిలు అసిస్టెంట్లుగా, భారీ సెట్టింగులూ, చక్కని సంగీతం, వీటన్నిటినీ మించి కళ్ళు జిగేల్‌మనే కాస్ట్యూమ్స్‌తో చింగ్ లింగ్ సూ ప్రదర్శన ఇస్తుంటే చూసేవాళ్ళకు ఆ రోజుల్లో ఒక అందమైన రంగుల స్వర్గంలో ఉన్నట్లనిపించేది. చంగ్ లింగ్ సూ చక్కని మెజీషియన్ మాత్రమేకాదు, మంచి మేకప్ ఆర్టిస్టు కూడాను. తన ముగ్గురు అసిస్టెంట్లకు తనలాగే మేకప్ చేసి, పక్కన నుంచోపెడితే వారిలో అసలు మెజీషియన్ ఎవరో కనిపెట్టలేనంత ఖచ్చితంగా మేకప్ చేసేవాడు. ఆ అసిస్టెంట్లతో ఒక ప్రత్యేక మేజిక్ చేసి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేవాడు. తాను స్టేజిమీద మాయమయ్యి, మరుక్షణం బాల్కనీమీద కనపడేవాడు. తరువాత లైటు ఆర్పి, మళ్ళీ వేయగానే ప్రేక్షకుల మధ్యలో ఉండేవాడు. తిరిగి లైటు ఆర్పి, వేయగానే ఆడిటోరియం ద్వారం దగ్గర నుంచుని నవ్వుతూ ఉండేవాడు. చివరిగా స్టేజిమీద ప్రత్యక్షమయ్యేవాడు. ఇది చూస్తున్న వాళ్ళకు ఇదంతా నిజమా? కలా అని అనిపించేది. ఈ మేజిక్ ఎలా చేసి ఉంటారో మీరీపాటికి ఊహించుకునే ఉంటారు. ప్రదర్శన అంతా అయిన తరువాత అతను ఈ మేజిక్ రహస్యాన్ని ప్రేక్షకులకు చెప్పేసి, తనలాగే మేకప్‌తో ఉన్న అసిస్టెంట్లను వారికి పరిచయం చేసేవాడు. తనకేమీ అతీతశక్తులు లేవు. తను చేస్తున్నదల్లా కేవలం ఇంద్రజాలం మాత్రమే, నేర్చుకుంటే ఎవరైనా చేయగలరని ప్రకటించేవాడు.

చింగ్‌లింగ్‌ఫూ అనే ఒక చైనా మెజీషియన్ పేరును చూసి ఆకర్షితుడై అలాంటి పేరునే పెట్టుకున్న చంగ్‌లింగ్‌సూ ప్రదర్శనలో తనకంటూ కొన్ని ప్రత్యేకమైన మేజిక్‌లు కనిపెట్టి ప్రదర్శించేవాడు. అవి ఎవరూ కాపీ కొట్టకుండా కాపీరైటు హక్కులను ఉంచుకునేవాడు. అతని ప్రదర్శనలో ప్రాణాంతకమైన ఒక మేజిక్ ఉండేది. అది అంతకు ముందు ఎవరూ చేయలేదు. అతని తరువాత ఎవరూ చేయడానికి సాహసించలేదు. సాహసించలేరు కూడాను. అది ఇలాగ ఉండేది.

చంగ్‌లింగ్‌సూ ఒక పెద్ద బంతిని పట్టుకుని స్టేజిపై ఒక పక్క నుంచునేవాడు. అతని అసిస్టెంట్లు ముగ్గురు తుపాకులుపట్టుకునీ,

ఆడ లేక మగ శిశువు జన్మించుటానికి స్త్రీ కారణం కాదు

దంపతులు తమకు జన్మించబోయే శిశువు లింగస్థితి గూర్చి ఎంతో ఆందోళన చెందుతుంటారు. అందుకు ముఖ్యకారణం, పుట్టబోయే శిశువు మగవాడై ఉండాలని అధిక శాతం దంపతులు కోరుకోవడమే! మనం కోరుకున్న శిశువు జన్మిస్తే ఇంకా ఏం కావాలి? జన్మించే శిశువు లింగస్థితి స్త్రీ, పురుష సంయోగ బీజములు కలిసి, సంయుక్త బీజం ఏర్పడినప్పుడే నిర్ణయించబడుతుంది. కొన్ని పరీక్షల ద్వారా వృద్ధి చెందే శిశువు లింగస్థితి తెలుసుకో సాధ్యమవుతుంది. అయితే ఈ సదుపాయాన్ని అందరూ సద్వినియోగ పరచడం లేదు. పుట్టబోయే శిశువు, ఆడ శిశువు అని తెలిస్తే గర్భస్రావం చేయించుకొంటున్న సంఘటనలు అనేకం.

మానవులలో లింగ నిర్ణయం గూర్చి శాస్త్రీయ జ్ఞానం తెలియక, అత్తగార్లు ఆడ బిడ్డలను కన్న కోడండ్లను ఎంతో బాధిస్తుంటారు. అత్తగార్లు, ఇతరులేమిటి కట్టుకున్న భర్త కూడా ఆమెను బాధించేవాడే! నిజానికి ఆడ బిడ్డలను కనడంలో స్త్రీల తప్పు ఏమీలేదు. పురుషుడే అందుక్కారణం! మానవులలో లింగ నిర్ణయం తెలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.



ఆడలేక మగ శిశువుగా వృద్ధి చెందడానికి కారణం సంయుక్త బీజమేర్పడినప్పుడు సంక్రమించిన లైంగిక క్రోమోసోమ్‌లు. మానవులలో 46 (ద్వయస్థితి) క్రోమోసోమ్‌లుంటాయి. వీనిలో రెండు లైంగిక క్రోమోసోమ్‌లు స్త్రీ (XX), పురుషుడు (XY). మిగతావి ఆటోసోమ్‌లు. స్త్రీ, పురుష సంయోగబీజము లేర్పడే ముందు స్త్రీ, పురుష బీజ మాతృ కణాలలో క్షయకరణ విభజన జరుగుతుంది. అనగా పిల్ల కణాలలో క్రోమోసోమ్‌ల సంఖ్య సగానికి తగ్గిపోతుంది. ఫలితంగా ఏకస్థితిలో ఉన్న సంయోగ బీజములు (23 క్రోమోసోమ్‌లు గలవి) ఏర్పడతాయి. స్త్రీలో (XX) లైంగిక క్రోమోసోమ్‌లు ఉన్నందున ఒకే విధమైన (X లైంగిక క్రోమోసోమ్‌గల) స్త్రీ సంయోగ బీజం ఏర్పడుతుంది. పురుషునిలో (XX) లైంగిక స్థితి ఉన్నందున, రెండు విధములైన (సగం 'X', సగం 'Y' లైంగిక క్రోమోసోమ్‌గల) సంయోగ బీజాలు ఏర్పడతాయి. X క్రోమోసోమ్‌గల స్త్రీ బీజం, X క్రోమోసోమ్‌గల పురుషబీజంతో కలిస్తే ఆడశిశువు, Y క్రోమోసోమ్‌గల పురుష బీజంతో కలిస్తే మగశిశువు జన్మిస్తుంది. అనగా ఆడలేక మగశిశువు జన్మించడంలో స్త్రీ పాత్ర అసలే లేదనియు, పురుషుడే ఇందుకు కారణమని స్పష్టంగా తెలుస్తున్నది. ఈ విషయం విశేష ప్రాచుర్యం పొందవలసిన అవసరం ఉంది. శాస్త్రజ్ఞానం రాకెట్ వేగంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో కూడా లింగ నిర్ణయ విధానం తెలియక స్త్రీలను బాధపెట్టడం అమానుషం. మానవులలో లింగ నిర్ణయం తెలిపే ఒక పాఠం హైస్కూలు లేక ఇంటర్మీడియెట్ స్థాయిలో ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఈ విషయం బహుళ ప్రచారం పొందిననాడే, ప్రజలలో గాఢంగా నాటుకుపోయిన మూఢనమ్మకాలు దూరం అవుతాయి.

— పమ్మెట గోవర్ధన్



ఒక అసిస్టెంటు కత్తి పట్టుకుని మరొక పక్క నుంచునేవారు. మెజీషియన్ "రెడీ" అనగానే తుపాకులు అతనిపై గురిచేసి పేల్చటం, కత్తి అతనిపైకి విసరటం ఒకేసారి జరిగేవి. ఇది చూస్తున్న స్త్రీలు, పిల్లలు భయంతో కళ్ళు మూసుకునేవారు. మరి కొందరు స్పృహతప్పి పడిపోయేవారు. కానీ మెజీషియన్ అతిలాఘవంగా వాళ్ళు పేల్చిన తుపాకీ గుళ్ళు తనకు తగలకుండా బంతికి మాత్రమే తగిలేలా అత్యంతనైపుణ్యంతో తప్పించుకునేవాడు. అలాగే విసిరిన కత్తికూడా

అద్భుత వ్యక్తులు

బంతికీ మాత్రమే తగిలేది. ఈ మేజిక్ చెయ్యడానికి ఏ మెజీషియనూ అప్పుడూ ఇప్పుడూ కూడా సాహసించలేదు.

విధివశాత్తూ ఒకసారి చంగ్‌లింగ్‌సూ ముఖ్య సహాయకుడితో మనస్పర్థలు రావటంవలన అతను మనసులో కక్ష పెట్టుకుని ఈ అంశం చేస్తున్నప్పుడు తన తుపాకీలో చాలా శక్తిగల బులెట్‌లు నింపుకుని మెజీషియన్ "రెడీ" అనగానే కసితీరా ధన్‌ధనామని పేల్చేసాడు. మరు క్షణం చంగ్‌లింగ్‌సూ కుప్పలా కూలిపోయి మర్నాడు మరణించాడు.

ప్రాణాలకు తెగించి ఇంద్రజాలంలో అద్భుతమైన మేజిక్కులు చేసిన చంగ్‌లింగ్‌సూ మేజిక్ కళ ఉన్నంతకాలమూ, మెజీషియన్లకూ, మేజిక్ అభిమానులకు గుర్తు ఉండి తీరుతుంది.

[పై వారం :— హస్త సాముద్రిక జ్యోతిష్య సంఖ్యా శాస్త్రాల హీరో — కీరో.]

మంథా వెంకట రమణారావు సీరియల్

ఉదయసంధ్య

(గత సంచిక తరువాయి)

పొద్దున్న పదయింది. చలికాలం అవడంవల్ల ఎండలో నడవడం బాగుంది. మిరపపళ్లు ఎండపెట్టేరు పొలాలలో చాపలమీద. ధాన్యం కోతలు అయిపోయేయి. ఆభరణాలు లేని స్త్రీలా ఉంది భూమి.

ఊరిలోని సంగతులు చెపుతూ నడిచేడు వెంకటి. ఇంటికి చేరుకొనేసరికి ఒక గంట పట్టింది. దూరంనించి పెద్దతమ్ముడు సూర్యం చూసి పరుగెత్తుకొచ్చేడు సంతోషంగా కేకలు వేస్తూ. వాడి తరవాతవాడు సాంబమూర్తి. సూర్యం ఆరు చదువుతున్నాడు. సాంబ నాలుగు చదువుతున్నాడు. చెల్లెలు శారద ఎనిమిది క్రిందటేడే పూర్తిచేసింది. సూర్యం అన్న చెయ్యి పట్టుకొని ''అన్నయ్యొచ్చేడోయ్'' అంటూ కేకలు వేసుకుంటూ నడిచేడు. ఈ కేకలు విని సాంబ వచ్చేడు. ఇద్దరూ రెండు చేతులూ పట్టుకున్నారు.

ఇల్లు పెద్దదే. అయినా పాతది. ఇంటి చుట్టూ గోడ ఉంది. దానికొక ద్వార బందం ఉంది. అందులోంచి లోనికివెళ్తే కాళీజాగా. అదంతా గచ్చు చెయ్యబడి ఉంది. సంతర్పణలూ, పెళ్లిళ్లూ చెయ్యడానికి అనువుగా ఉన్నది. ధాన్యం పోసుకుందుకి ఒక కొట్టాం ఉంది. ఒక పెద్దగది వేరేగా ఉంది ఇంటితో సంబంధం లేకుండా. అక్కడే కాళిదాసు తన పుస్తకాలన్నీ ఉంచుకున్నాడు. ఎవరన్నా వస్తే అక్కడే కూర్చుంటారు.

''అమ్మా! ఎవరొచ్చేరో చూడు!'' అన్నాడు సూర్యం పెద్దగా.

ఇంట్లోంచి అందరూ పరుగెత్తుకొచ్చేరు... శారద, తల్లి కాంతమ్మ, తండ్రి కాళిదాసు... పాలేర్లు... అందరూ రామాన్ని చూసేరు ఆశ్చర్యంగా, ఆనందంగా, చంద్రమండలం వెళ్లి తిరిగివచ్చిన మనిషిని చూసినట్టు. ''హారి! వస్తున్నానని ఒక ఉత్తరంముక్క రాసి ఉంటే ఏం అంతా బస్‌స్టేండ్‌కి వచ్చి ఉందుంకదరా?'' అన్నాడు కాళిదాసు. అతని వయస్సు ముప్ఫయి ఎనిమిది. ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసయేడు. పట్నంలో ఉద్యోగం కోసం వెతకలేదు. తండ్రి బ్రతికి ఉండేవారు. ఏ కొరతా లేకపోయింది. అతను పోయేక అగ్రహారంలోని ఆస్తి వ్యవహారాలు చూస్తూ ఇక్కడే ఉండవలసివచ్చింది, అమ్మ పోయేవరకూ. అమ్మ పోయేక అన్న వెళ్లిపోయేడు. అప్పుడు పట్నం పోదామంటే వీలుపడలేదు. ఉద్యోగాన్వేషణకి వయస్సు దాటిపోయింది. ఇద్దరు పంచ, కమీజు...భుజంమ్మీద కండువా... పొడుగాటి విగ్రహం. ఆర్థికంగా చితికిపోయినా ముఖంలో కళ, నడకలోనూ మాటలోనూ ఠీవి, హుందాతనం ఉన్నాయి కాళిదాసుకి. మనిషి తెలుపు...

తల్లి కాంతమ్మ పొట్టి... కాని చాలా అందమైన మనిషి. కాళిదాసుకన్నా నాలుగేళ్లు చిన్న. కట్టూ బొట్టూ అగ్రహారీకుల పద్ధతే. నుదుట పెద్ద కుంకుమబొట్టు, ముక్కుకి బంగారు కమ్మి పొడితో, చెవులకి పెద్ద దుద్దులు, కాళ్ళకి వెండి కడియాలు — జుత్తు ముడి వేసుకుంది. రవిక వేసుకోదు ఇంట్లో ఉన్నప్పుడు. చీర అడ్డకట్టు కడుతుంది.

చెల్లెలు శారద తండ్రిలా, అన్నలా పొడుగెదిగే సూచనలు ఇస్తోంది. వ్యక్తురాలై ఏడాదయింది. ఏడాదిలోనూ బాగా పెరిగిపోయింది. పొడుగెదిగింది. ఒంటికి మంచి కళాకాంతులొచ్చేయి. తల్లి అందం ఆమె కొచ్చింది వారసత్వంగా. పరికిణీ, వోణీ వేసుకొని ఇంట్లోనే తిరుగుతుంది కాళ్లకున్న మువ్వల పట్టీలు సద్దుచేస్తూ ఉండగా. పద్ధతి ప్రకారం ఆడపిల్లకుండవలసిన ఆభరణాలన్నీ అమర్చిపెట్టేరు. ముక్కుకి నత్తుకి బదులు ఒంటిపొడి బేసరీ పెట్టుకుంది. చెవులకి జూకాలు. జడకి పెద్ద నాగరం... జడగంటలు. నడుముకి వడ్డాణం చేయించేరు కాని పెట్టుకోదు... పండగలకితప్ప.

శారదని చూసి ఆశ్చర్యపోయేడు రామం. అయిదు నెలలయింది చూసి. ఈ అయిదు నెలల లోనూ ఎంతగా మారిపోయింది. లత, సావిత్రీ, మీనాక్షీ, వీరందరికన్నా ఎంతో తెల్లగా, అందంగా కనిపిస్తోంది. రామాని కెంతో గర్వం వేసింది... చెల్లెలిని చూసేసరికి... తన చెల్లెలు ఎవరికన్నా ఎందులోనూ తీసిపోదు.

ఇంట్లో అడుగుపెట్టేసరికి స్వర్గంలోకి అడుగుపెట్టినట్టయింది. ఇక్కడెంత ఆప్యాయత, ఎంత ఆదరం, అభిమానం, ప్రేమ! తమ్ముళ్లు, చెల్లెలు ఎంత అదృష్టవంతులు. ఇక్కడికి వచ్చేక మరి పట్నం వెళ్లాలని ఉండదు. ఇక్కడ ఇంట్లో మనుష్యులే కాదు, పైవాళ్లు కూడా చూపే ఆత్మీయత తనకి పట్నంలో ఎక్కడ్నుంచొస్తుంది? అక్కడ ప్రతి ఒక్కరికీ అడ్డుగానే కనిపిస్తాడు — ఇక్కడ అందరికీ ఆప్తుడుగా కనిపిస్తాడు. కాని వెళ్లక తప్పదు. చదువు చదువక తప్పదు. అందరి ఆశలూ తనమీదే... తను బద్ధకించడానికి వీలులేదు.

''రామవేఁ!? ఏంరా బాబూ అలా చిక్కిపోయేవ్!'' అంటూ అమ్మ ఆప్యాయంగా పట్టుకుంది కొడుకు భుజాలు.

ఇంట్లోకి వెళ్లేడు. అందరూ రామం చుట్టూ మూగేరు. ఎన్నో ప్రశ్నలు వేసేరు. రామం పెట్టె తెరిచి అందులోంచి పట్నంనించి తను తెచ్చిన వస్తువులు తీసేడు. అమ్మకి ఒకచీర, నాన్నకి ఒక నేతపంచలచాపు, చెల్లెలుకి పరికిణీకి అద్దు, రిబ్బన్లు. తమ్ముళ్లిద్దరికీ షర్టుబట్ట. తండ్రి పంపిన ముప్ఫయికి తను కూడపెట్టిన డబ్బు, ఆదినారాయణ దగ్గర తీసుకున్న ఇరవై రూపాయలూ కలిపేడు. తినడానికి అంకమ్మ

జరిగిన కథ — 6 : రామం వారాలు చేసుకుంటూ చదువుకుంటుంటాడు. దుర్గమ్మ కూతురు మీనాక్షి రామాన్ని ఆదరిస్తుంది. పూర్ణమ్మ ఇంటిలోని వీధి కొట్టులో రామం నివాసం. ప్లీడరు సీతారామయ్యగారి మేనకోడలు నిర్మలకు రామం అంటే ఇష్టం. శాంతమ్మగారి నడిగి వాళ్లింట్లో గదిలో ఉండడానికి నిశ్చయించుకుంటాడు రామం. వెంకటేశ్వర్లు రాసిన ప్రేమ పద్యాలు చదివి లత రామంమీద విరుచుకుపడి అతనిని అవమానిస్తుంది. శాంతమ్మ రామంను తమ ఇంటికి వచ్చి ఉండమని చెపుతుంది. రామం మాటలను పెడచెవిన పెడతాడు వెంకటేశ్వర్లు. నిర్మలంటె విశాలకి పడదు. వరలక్ష్మి రామాన్ని రత్నాన్ని ఒక దారిలో పెట్టమని కోరుతుంది. రామం సెలక్షన్సులో మొదటివాడుగా సెలక్టయ్యాడు. వెంకటేశ్వర్లు రాసిన పద్యాలు 'భారతి'లో ప్రచురింపబడ్డాయి. రామం తండ్రి నుంచి మనియార్డరు, ఉత్తరం అందుకొంటాడు. లత మీద పద్యాలు రాసింది రామమేనని అతని చెంపలు ఛెల్లుమనిపిస్తాడు చంద్రం. రామం కళ్లు తిరిగి పడిపోతాడు. సీతారామయ్య చంద్రంచేత రామంకు క్షమాపణలు చెప్పిస్తారు. రామం పుట్టిపెరిగిన అగ్రహారం వెళుతాడు.

ఇచ్చిన పూతరేకులూ, తనుకొన్న మిఠాయి తీసుకొచ్చేడు.

"ఎందుకురా బాబూ ఇవన్నీ తెచ్చేవు ?" అన్నాడు తండ్రి, సంతోషిస్తూ.

"ఇంక స్నానంచేసి భోజనానికిలే" అంది తల్లి.

* * *

మధ్యాహ్నం తన స్నేహితుల ఇళ్లకివెళ్లేడు. తనతో ఎనిమిదో క్లాసువరకూ చదివి, చదువు మానేసి వ్యవసాయంలోపడ్డ స్నేహితులెంతమందో ఉన్నారు. వాళ్లంతా పలకరించేరు, కాని తమకీ, రామానికీ ఏదో అంతరం ఏర్పడ్డట్టే ప్రవర్తించేరు. సరదాగా తిరుగుదామంటే వాళ్లకి వాళ్ల పనులున్నాయి. పొలం పనులు. వాళ్లకి తిరిగే రోజులు అయిపోయేయి. ఇంక తనతో సమానంగా తిరగ గలవాళ్లు చదువులకి పట్నం పోయేరు. విజయనగరం, అనకాపల్లి, విశాఖ పట్నం, బొబ్బిలి, పార్వతీపురం. ఎక్కడ హైస్కూళ్లు, బంధువులూ ఉంటే అక్కడకి. పండుగకి వస్తారు. ఇంకా పండుగ పదిహేను రోజులుంది.

కొండయ్య ఇంటికి వెళ్లేడు. కొండయ్య కిపుడు ముప్ఫయి ఎకరాల భూమి ఉంది. అనకాపల్లిలో ఇల్లు ఉంది. ఇక్కడ రెండు ఇళ్లున్నాయి. కొండయ్య "ఏంరోయ్! ఎపుడు రావడం!" అని పలకరించేడు. ఆ పలకరింపులో

ఉదయ సంధ్య

ఆప్యాయత ఉంది కాని అది ఇచ్చిపుచ్చుకొనే ఆప్యాయత. ఇంట్లో తొమ్మిదేళ్ల కూతురుంది. దీనిని వీడికిస్తే ఎలాగుంటుంది? అని అప్పుడప్పుడు అనుకుంటాడు. కాని వీడు దేనిగా మారతాడో? పై చదువులు చదువుతాడా... ఇంతటితో చాలిస్తాడా? వీడికిస్తే పిల్ల ఊళ్లోనే ఉంటుంది. వాడిక్కడే ఉంటాడని నిర్ధారణ ఏమిటి? కాళిదాసు కేమీ లేదు. ఉన్నదేదో కూతురు పెళ్లికి సరిపోతుంది. పిల్లలంతా ఎవరి దారి వాళ్లు చూసుకోవాలి. ఇద్దామా ... మానామా అన్న మీమాంస మనుసులో ఉంది. పిల్లనిచ్చి పెళ్లిచేసి, వీడికి ఇంజనీరింగో, డాక్టరీవో చెప్పించొచ్చు ... కాని అంతకన్న ఆ స్థోమత ఉన్నవాడిని చూసి ఏకంగా కట్నం ఇచ్చి ముడిపెట్టేడం మంచిదేమో ... నిశ్చయించుకోపోవడంతో, ప్రేమ ఇంకా పెదవులమీదే ఉంది... గుండెలలోంచి రావడంలేదు.

కొండయ్య కొక కొడుకున్నాడు, వాడు రామం కన్నా రెండేళ్లు పెద్ద. చదువు ఎనిమిదో క్లాస్‌తో ఆపేడు. ఇప్పుడు తండ్రికి పొలం పనులలో సహాయపడతాడు. రెండోవాడు అనకాపల్లిలో పదోక్లాసు చదువుతున్నాడు. మూడోవాడు ఎనిమిదోక్లాసు...వాళ్లు అక్కడే ఉన్నారు. కొండయ్య కొక విధవ అక్కగారుంది. ఆవిడ అక్కడుండి వీళ్ల బాగోగులు చూసుకుంటుంది.

పెద్దవాడు కామయ్య ఇంట్లోనే ఉన్నాడు. మంచి శరీర దారుఢ్యం ఉన్నవాడు. మంచి మనసున్నవాడు. రూపురేఖలు బాగుంటాయి. ఒళ్లువంచి కష్టపడతాడు. పొద్దున్న ఆరుకి పొలానికి పోయి పనులు చేయిస్తాడు. పశువులని చూసుకోడం, ధాన్యాన్ని కొట్టాలకి పట్టించడం, కూలీలకి బట్వాడా చెయ్యడం...మంచి ప్రావీణ్యం సంపాదించేడు. రామం వస్తే చాలా అభిమానంగా పలకరించి మాట్లాడేడు. రామునికి తెలివితేటలలో తనకన్నా ఎక్కువ స్థానం ఇచ్చేడు. కామయ్యకి శారదని పెళ్లి చేసుకోవాలని ఉంది. ఈ సంగతి ఎన్నోసార్లు ఆ ఇంటిలో చర్చకి వచ్చింది. తల్లి బుచ్చమ్మకి శారద మీద వల్లమాలిన అభిమానం ... ఎలాగన్నా శారదని కోడలుగా చేసుకోవాలని ఉంది ... కొండయ్య ఇటూ అటూ చెప్పడంలేదు. అంతా ఒక సంగతి మీద ఆధారపడి ఉంది. కూతురుని రామానికి ఇవ్వడమా మానడమా అది మొదటి ప్రయారిటీ. అది నిశ్చయం అయితే శారదని చేసుకోవడం పడదు. కుండమార్పు అచ్చిరాదు. నిశ్చయం కాకపోతే శారదని కొడుకుకి చేసుకుందుకి కొండయ్యకి అభ్యంతరం లేదు.

కొండయ్య, బుచ్చమ్మ పలకరించి మాట్లాడేరు, పట్నంలోని సంగతులన్నీ అడిగేరు.

"సీతారామయ్య ఎలా ఉన్నాడు ?"

''బాగున్నారు...''

''బాగానే ఉంటాడ్లే... వాడికేం. మీ పెద నాన్నా వాడూ కలిసి చదువుకొనేవారు మీ ఇంట్లో మీ పెదనాన్న, మీ నాన్నా, చదువు హైస్కూలు తోనే చాలించేరు. వాడు పై చదువులకి వెళ్లేడు ...మెద్రాస్ వెళ్లి 'లా' చదివేడు. మీ తాత బాగా సాయం చేసేడు. లేకపోతే వాడి నాన్నకేం ఉండేది ... అక్షయపాత్ర ... అవన్నీ ఇప్పుడు గుర్తుకురావులే. అంతా వాళ్ల ప్రతిభే అనుకుంటారు ...'' కొండయ్య పెద్ద ఉపన్యాసం ఇచ్చేడు

ఏ సంగతి నమ్మడమో మానడమో తెలీదు రామానికి. మనిషొక విధంగా అంటారు. కొండయ్య తండ్రి ఈ భూములన్నీ జోగయ్య దగ్గరనించి ఎన్నో కుతంత్రాలతో తన పరం చేసుకున్నాడని అంటారు. తన పూర్వీకుల నించి అందరూ ఇంతో అంతో సహాయం కాని మేలు కాని పొంది ఉన్నారు. ఇప్పుడు తనకి సహాయం చెయ్యవలసి వచ్చేసరికి ఎవరిమట్టికి వారు తప్పుకుంటున్నారు...అన్న భావం వచ్చేటట్టు ప్రతి ఒక్కడూ రెండోవాడి గురించి చెప్పినప్పుడు చెప్తునే ఉన్నాడు. దానివల్ల తనకి వచ్చిందేమీ లేదు.

ఇంటికి తిరిగివచ్చేడు రామం. దారిలో ఎందరో బుగతలు పలకరించేరు ... క్రావధానికి ఎనభై ఏళ్లు. పొలానికి వెళ్లి పచ్చగడ్డికోసి మోపు కట్టి తల మీద పెట్టుకొని ఇంటికి వస్తాడు. అది ఆవుకోసం. తరవాత జంజాలకోసం నూలు అల్లుతూ అరుగుమీద కూర్చొని, వచ్చేపోయే వాళ్లని పలకరిస్తాడు. వేదం అన్ని పన్నాలూ వచ్చు. చెవులకి బంగారు కుండలాలు చెవిని క్రిందికి లాగేస్తున్నట్టు కనిపిస్తాయి. ఎవరింట్లో కథా కార్యం జరిగినా అతనిదే మొదటి తాంబూలం. క్రావధాని రామాన్ని ఆపి అడిగేడు ...

''యెంతవరకూఒచ్చిందిరా నీ చదువు ?''



"ఈ ఏడాదితో సరి తాతా !" అన్నాడు రామం.

"ఏమిటో యీ ఇంగ్లీషు చదువులు. శుభ్రంగా సంస్కృతం చెపుతాను రమ్మంటే వచ్చేవుకాదు. మీ వంశం పేరు నిలబెట్టడానికన్నా నాలుగు ముక్కలు నేర్చుకో ... నా దగ్గరికొచ్చి రోజుకొక గంట కూర్చున్నావంటే చాలు ..." నూలు పేనుతూ అన్నాడు అవధాని.

"అలాగే తాతా ... పరీక్షలయిపోయేక నీ ఇష్టం ..." అని అక్కడ్నించి వచ్చేడు.

తనకా ఊరిలో ఎన్నో పేర్లున్నాయి. జోగయ్య మనవడు ... కాళిదాసు పెద్దకొడుకు. కాంతమ్మ పెద్దవాడు ... ఎర్రబ్బాయి ...ఇలా. "జోగయ్య మనవడు కదూ ఆ వెళ్తున్నదీ" అని చెయ్యి కళ్లమీదకి తెచ్చి చూస్తూ ఒక ముసలా డంటే, అతనికోడలు సహాయానికొచ్చి, "అవును కాంతమ్మ పెద్దకొడుకు !" అంటుంది.

రాత్రి భోజనాలప్పుడు కొండయ్య, సీతారామయ్య గురించి అన్నమాటలు చెప్తే కాళిదాసు చిరునవ్వు నవ్వేడు. "ఇంత ఉంటే అంత చెప్తారు. సీతారామయ్యా, అన్నాకలిసి మన ఇంట్లో చదువుకొనేవారు ... అన్న చదువు మానీసేకకూడా, సీతారామయ్య వచ్చి మన ఇంట్లోనే చదువుకొనేవాడు. వీధి గది విశాలంగా, ఖాళీగా ఉండేది. తరవాత అతను మెడ్రాస్ వెళి పోయేడు 'లా' చదవడానికి ... వాళ్ల పరిస్థితి ఆ రోజులలో కష్టంగానే ఉండేది ... కాని మరీ అంత గడ్డుపరిస్థితికాదు ... వాళ్ల తండ్రి పౌరోహిత్యుడు. అందరి దగ్గరా నెలకి అర్ధో, రూపాయో సహాయం దొరికేలా మాటపుచ్చుకొని కొడుకుని పైచదువులకి పంపేడు. మీ తాత ఎంత ఇచ్చేవారో నాకు తెలీదు. కాబట్టి మనవల్లే సీతారామయ్య బాగుపడ్డాడంటే అది అబద్ధ మౌతుంది. శాంతమ్మ ఎలాగుంది ?"

ఆ మాట విని అమ్మ నవ్వడం చూసి రామం అడిగేడు. "ఎందుకమ్మా నవ్వేవ్ ?"

ఉదయ సంధ్య

"మీ నాన్నగారికి ఆవిడ గురించి ఒకసారి అడుగుతేనే కాని మనసు కుదుటపడదు."

"సరే ... ఆ సంగతెందుకిపుడు" అన్నాడు కాళిదాసు.

"కుర్రాడు తెలుసుకుంటే వచ్చే నష్టం ఏమీలేదు ... శాంతమ్మా, మీ నాన్నా చిన్నప్పుడు ఆడుకొనేవార్ట నాయినా ... మీ తాత విశాఖ పట్నంలో ఉన్నప్పుడు ... మీ తాతకి ఆస్తి ఉండి ఉంటే మీ నాన్నకి శాంతమ్మని ఇచ్చి ఉందురు. మీ నాన్నకి పెళ్లీడొచ్చేసరికి ఉన్నదేదో చాలా ఊడ్చుకపోయింది. శాంతమ్మది కలిగిన కుటుంబం. పక్కపక్కనే ఇల్లు మీవి ... అదీ సంగతి ..." కాంతమ్మ చెప్పింది ముసిముసినవ్వులు నవ్వుతూ.

కాళిదాసూ నవ్వేడు. "ఆఁ ... ఏవో చిన్నప్పటి ముచ్చట్లు. ఇంట్లో అందరూ శాంతమ్మ అంటే కాళిదాసు పెళ్లామే అన్నట్టు వ్యవహరించేవారు. అంత మాత్రాన పెళ్లిళ్లయి పోతాయా ? కొండయ్యని తీసుకో ... శారద పుట్టగానే కామయ్య పెళ్లాం పుట్టిందన్నాం ... ఏదీ ఇప్పటికీ తేల్చకుండా ఉన్నాడు ..."

అప్పటివరకూ శ్రద్ధగా వింటున్న శారద తుర్రుమంది లోపలికి.

శాంతమ్మ అంది ... "మీరన్నదీ నిజమే... కొండయ్యకి కట్నం ఆశ బాగా పట్టుకుందిరా బాబూ రామం. అతని భూమికి తగిలి ఉన్న మన అయిదెకరాలూ రాసిచ్చీమంటాడు. దానిమీద రెండువేలవరకూ అప్పు పెట్టేడు మనకి. అది మినహాయించుకొని స్వంతం చేసుకుంటాడు అతను పెళ్లికి ఒప్పుకుంటే ..."

రామం ఆశ్చర్యపోయేడు. శారదకింకా పదమూడు నిండలేదు అప్పుడే పెళ్లా ? ఇప్పుడు పెళ్లయితే, ఇరవై ఏళ్ల నిండకుండా గంపెడు సంసారంతో కొనఊపిరితో తయారవుతుంది. రామంకి తెలును, శారద, కామయ్య కోసం చిన్ననాటినించీ అట్టే పెట్ట బడిందని. కాని మొగ్గలాటి చెల్లెలిని ఇప్పుడు చూస్తూ ఉంటే ఇప్పటినించీ పెళ్లి చెయ్యడం అన్యాయం అనిపించింది. కాని ఏ సంగతి మాట్లాడడానికీ ఇది సమయం కాదు. ఇంకా వ్యవధి ఉంది.

రాత్రి తన గదిలో కూర్చొని లాంతరు ముందు పుస్తకాలు తీసేడు చదవడానికి... తమ్ముళ్లిద్దరూ వచ్చి కబుర్లలోకి దింపేరు. తను లేనప్పుడు జరిగిన ఎన్నో సంగతులు చెప్పేరు... పట్నంలోని వింతలూ విశేషాలూ అడిగి తెలుసుకున్నారు. చదువు సాగనివ్వలేదు. పాలగ్లాసు పట్టుకొని అమ్మ వచ్చింది... "ఇవి తాగీ రామం..." అంది... మీగడతో పాలు... "నాకు పాలు ఇష్టం లేదమ్మా !" అన్నాడు. "ఇష్టం ఉన్నా లేకపోయినా తప్పదు బాబూ... ఇక్కడ ఉన్నన్నాళ్లన్నా నీ ఆరోగ్యం బాగుపడితే... అక్కడ ఏం తిండో... ఏం పడకో..."

పాలు తాగేక రామం అడిగేడు, "శారదని కామయ్య కివ్వడానికి నిశ్చయం అయిందేమిటి ?"

"ఏనాటినించో అనుకుంటూనే ఉన్నాం కదా ? కుర్రాడు బాగుంటాడు. ఆస్తిపాస్తు లున్నాయి. పిల్ల ఎదిగికూర్చుంది. ఇప్పుడెక్కడని వెతుకుతాం సంబంధాలు. ఇంతకన్న మంచి సంబంధం మనకి రాదు. ఏదో ఆ మూడు ముళ్లూ పడిపోతే మన బాధ్యత తీరిపోతుంది."

"శారదకి నేను చదువు చెప్పి ప్రయివేట్‌గా మెట్రిక్ కట్టిస్తాను. అది చదువుకుంటే ఇంతకన్న నయం..."

కాంతమ్మ నవ్వింది... "ఓరి వెర్రివాడా... నేనేం చదువుకున్నాను ? ఎంత చదువుకున్నా ఆడది ఆఖరికి పెళ్లి చేసుకొని ఇల్లు చూసుకోక తప్పదుకదా ? ఎక్కువ చదువయితే సంబంధాలు తేవడం కష్టం. వయస్సు ముదురుతున్నకొద్దీ వాళ్ల ఇష్టాయిష్టాలు ఎక్కువవుతాయి. ఎన్నో ఇబ్బందులున్నాయిరా..."


"ఒక్క శారదే కదా ? ఎంతమంది ఆడపిల్ల లున్నారు కనక మన ఇంట్లో..."


"ఎలా జరగవల్సింది అలా జరగకమానదు. ఇంకా వాళ్లేమీ అనలేదు. ఇంక నీ సంగతొక టుంది. ఈ పరీక్ష పాసయేక నిన్నొక ఉద్యోగంలో పెడదాం అని అంటున్నారు మీ నాన్న. చదివించ లనే ఉంది, కాని ఎలా ? కాలేజి చదువుకి డబ్బు ఎక్కువ కావాలి. నువ్వెక్కడుంటావు... ఎక్కడ తింటావు ?"

"మీ ఇష్టమమ్మా... ఏం చెయ్యమంటే అదే చేస్తాను..." అన్నాడు రామం.

నిట్టూర్చింది కాంతమ్మ. "ఏంచేస్తాం. చదువుకుంటానన్నవాడికి డబ్బు లేదు. చదువొద్దనుకున్నవాడికి డబ్బుంది..."

అక్కడితో సంభాషణ ఆఖరయింది.





"తలనొప్పికోసం ఎన్నో
వాడి చూశాను...
అయితే అత్యుత్తమంగా పనిచేసేది సారిడన్!"
ఒక్క బిళ్ల సారిడన్ వేసుకుంటే చాలు. మీ తలనొప్పి క్షణంలో వదిలి పోతుంది. కారణం, ఔషధ పరిశ్రమలో ప్రపంచ నేతలైన రోష్‌వారు పరిశోధించి రూపొందించిన అద్వితీయ ఔషధ సూత్రం సారిడన్‌లో ఉండడమే!
కనుక, ఈసారి మీకు తలనొప్పి వచ్చినప్పుడు గట్టి మందే వేసుకోండి. సారిడన్ తీసుకోండి.
Saridon
సారిడన్
ట్రేడ్‌మార్కు 'రోష్'
ఒక్కటి, నిజంగా పనిచేసేది.

RPL-1205

9

పండుగ వచ్చింది. వెళ్లిపోయింది. భోగీ మంటల కోసం చెట్టుమానులు కొట్టి పట్టు కొచ్చేరు. వీధికొక భోగీమంట. రామం, కామయ్య, తదితర మిత్రులు కలిసి పెద్ద మంట వేసేరు. రాత్రి కర్రలు ఇళ్లల్లోంకి దూరి తీసుకొచ్చి మంటలో పడేసేరు. పొద్దున్నే పిల్లలంతా స్నానాలుచేసి, కొత్తబట్టలు కట్టుకొని, భోగీ పిడకల దండలు తెచ్చి మంటలో వేసేరు. డబ్బు ఉన్నా లేకపోయినా బట్టలు కొనడం తప్పదు. అగ్రహారంలో ఒక టయిలరున్నాడు ... మిన్నారావు... ఎలా కుట్టినా ఈ పల్లెటూరికి సరిపోతుంది. ఇవాళరా, రేపురా అని తిప్పి తిప్పి, భోగీనాడు ఉదయం ఏడు గంటలకి రామానికీ, తమ్ముళ్లకీ, శారదకీ బట్టలిచ్చేడు. కొన్నిటికి గుండీలు కుట్టడం మరిచిపోయేడు.

బట్టలు వేసుకున్నాక మగపిల్లలంతా తిరగడానికి బయల్దేరేరు. తోటల్లోని చెరుకుగడలు విరుచుకుతిన్నారు. వేరుసెనగలు కాల్చుకతిన్నారు అక్కడే గడ్డిలో. ఇంటికి తిరిగివచ్చేక సర్దీ, బొబ్బట్లతో భోజనం. మధ్యాహ్నం భోగిపళ్లు, ముత్తయిదువుల రాకపోకలు.

పండుగ అయిపోతుంది వేగం అన్న విచారం ఉండదు, మర్నాడు సంక్రాంతి ... మూడోనాడు కనుము, తరవాత ముక్కనుము. ప్రతి రోజూ పిండివంటలే చేసుకుతిరాలి. లేకపోతే ప్రక్కింటి వాళ్లు చెక్‌చేసి ముక్కుమీద వేలువేసు కుంటారు. ''మీ ఇంట్లో ఏంచేసుకున్నారు ?'' అంటే ''మీ ఇంట్లో ఏంచేసుకున్నారు ?'' అని ప్రశ్నలు వేసుకొని జవాబులు రాబడతారు. అల్లుళ్లు, కూతుళ్లు వస్తారు సంసారాలతో. వాళ్లకి బట్టలు పెట్టాలి. ఇంట్లో పనిచేసే పనివాళ్లకి బట్టలూ, డబ్బూ ఇవ్వాలి. పండుగ వచ్చి వెళ్లేసరికి మామ్మూలు తెలుగు సంసారి వందో, రెండు వందలో అప్పు చెయ్యకుండా జరగదు. ఇంటి పెద్దకి తప్ప తక్కిన అందరికీ పండుగ చాలా ఆనందదాయకంగానే ఉంటుంది.

ఐదు ఎకరాల మీదా ఇంటికి కొంత పంట ఒచ్చింది. కరణంగారికి ఇవ్వవలసిన మామ్మూళ్లు ఏవో ముట్టేయి, నగదు రూపేణా, వస్తువుల రూపేణా. కందులు, మినుములు, పెసలు, వేరుసెనగలు సంవత్సరానికి సరిపడా వచ్చి ఇంట్లో పడ్డాయి. అందుకు కాళిదాసుకి పండుగ బాగానే వెళ్లిపోయింది. వచ్చే ఏటి నుండీ కొడుకు చేతి కందుకొస్తాడు. పిల్ల పెళ్లి చేసేస్తే కొంత బాధ్యత తీరుతుంది.

పండుగ మూడురోజులూ కొండయ్య ఇంటికీ, కాళిదాసు ఇంటికీ రాకపోకలు జోరుగా సాగేయి. కొండయ్యా, కాళిదాసు, తదితరులూ, కొండయ్య ఇంట్లో పేకాట వేసేరు, మూడు ముక్కలు. మొదటిరోజు సాయంత్రానికి కాళిదాసు ఇరవై రూపాయలు గెలిచాడు. అందులోది పిల్లలకి రూపాయి చొప్పున్న ఇచ్చేడు. రాత్రి ఆట తరువాత పొద్దున్నకి నలభై పోయింది. ఇచ్చిన రూపాయలు మళ్లీ వాపసు వెళ్లిపోయేయి. అలా నాలుగు పగళ్లు, నాలుగు రాత్రులూ ఆట నడిచింది. ఆఖరికి కాళిదాసుకి వచ్చింది అరవై రూపాయలు. ఫరవాలేదు, రోజులు బాగున్నాయి అనుకున్నాడతను. డబ్బు వస్తే రోజులు బాగున్నట్టు, పోతే రోజులు బాగులేనట్టు. మనిషి సంతోషం డబ్బుతో ముడిపడి ఉంది.

గంగిరెద్దులు వచ్చేయి... తలలూచేయి ... వెళ్లిపోయేయి మరోపల్లెకి. కాలం కూడా గంగిరెద్దులా తల ఊచుకుంటూ వెళ్లిపోయింది. దానికి మనుషుల కష్టసుఖాలతో సంబంధంలేదు. మనిషికి తక్కిన జీవరాసుల కష్టసుఖాలతో సంబంధం లేనట్టే. పాపలు పిల్లలౌతున్నారు, పిల్లలు పెద్దలౌతున్నారు, పెద్దలు వృద్ధులౌతున్నారు, వృద్ధులు బూడిదౌతున్నారు .. పంటలు పండుతున్నాయి. మనిషి ఆకలికి ఆహుతౌతున్నాయి. పంటలు' పండటంలేదు, ఆకలికి ఆహుతౌతున్నారు మనుషులు... రోగాలు ... వరదలూ, దుర్భిక్షం, వస్తున్నాయి పోతున్నాయి...కాలం గంగిరెద్దులా తల ఊచుకుంటూ వెళ్లిపోతోంది.

కామయ్యకి శారద మీద ఇష్టం ఉందని గ్రహించేడు రామం. శారదకీ కామయ్యంటే ఇష్టం ఉన్నట్టే ఉంది. ఇద్దరూ ఒకరి కొకరు ఎదురుపడ్డప్పుడు కంగారుపడ్డా, వాళ్ల ముఖాలు సంతోషంతో వికశించడం చూసేడు. కామయ్య శారదతో చాలా కలుపుగోలుగా ఇండేవాడు. కాని వ్యక్తురాలయేక సరదా వెనక్కి వెళ్లిపోయింది. ఎదురయినా మాట్లాడడంలేదు. ప్రశ్నవేస్తే క్లుప్తంగా జవాబు చెప్తుంది. కాని కామయ్య తమ ఇంటికి వచ్చేసరికి ఆమెకి తెలుస్తుంది. అతడు వెయ్యబోయే ప్రశ్న కోసం ఎదురు చూస్తూ వస్తుంది. ''మామయ్య ఉన్నారా ?'' ''లేరు ... అలా పొలం వేపు వెళ్లేరు'' ''అత్త ఉందా ?'' ''ఉంది ... వంట చేసుకుంటోంది'' అలాటి జవాబులు వచ్చేవి. కొండయ్య ఇంటికి వెళ్లినపుడు ఎదురుపడితే పక్కకు తప్పుకనిల్చొనేది. కామయ్య ఏమన్నా ప్రశ్నలు వేద్దాం అనుకొనేవాడు, కాని ఏం అడగడమో తెలియక కాస్త సందేహించి, ముందుకి వెళిపోయేవాడు. చాలా సున్నితమైన తీగె అల్లుకుంటోంది, ఇద్దరి మధ్యా. దానిని ఏ చిన్నగాలన్నా, ఏ చిన్నతాకిడన్నా పెకలించి వచ్చు.


పండుగలు అయిపోయేయి. మళ్లా రోజులు యధావిధిగా గడుస్తున్నాయి. ఇక్కడ ఉండి చదువుకోడమా, విశాఖపట్నం వెళ్లడమా అన్న మీమాంస పట్టుకుంది. ఇక్కడనించి వెళ్లాలని లేదు. పరీక్షలు వారంరోజులు ఉన్నాయనగా వెళ్లొచ్చు. ఇక్కడ ఏ బాదరబందీ లేకుండా చదువుసాగిపోతుంది. ఎవ్వరూ తనకి ఏ పనీ చెప్పడంలేదు. అమ్మ రోజూ మధ్యాహ్నం తన కిష్టమయిన టిఫెన్లన్నీచేసి పెడుతోంది. పండుగులకి చేసిన చేగోడీలూ, జంతికలూ, లడ్డుండలూ ఇంకా ఉన్నాయి. ఊసుపోకపోతే అలా పోయి ఏటి ఒడ్డున కూర్చోవచ్చు. ఇక్కడే ఉందాం అని నిశ్చయించుకున్నాడు. వెంకటేశ్వర్లు రమ్మన్నాడు మరీమరీ. బస్సువరకూ వచ్చి దిగబెట్టేడు. సీతారామయ్యగారు వచ్చీమన్నారు. కాని ఒకసారి ఇక్కడికి వచ్చేసేక మరి అక్కడికి వెళ్లాలని ఉండదు. ఇక్కడ తన బాధ్యతలన్నీ నాన్నా, అమ్మా తీసుకుంటారు. అక్కడ తన బాధ్యతలన్నీ తనవే.

ఒకనాడు మధ్యాహ్నం కాళిదాసు రామాన్ని పిలిచేడు తన వీధి గదిలోకి మధ్యాహ్నం పడక తీసీలేచేడతను. కాఫీలూ, టిఫిన్లూ అయ్యేయి. రామం వచ్చేక కూర్చోమన్నాడతను. ఇంట్లోకి వెళ్లి తపులుకి గడిపెట్టేడు ... ''నీతో కొన్ని సంగతులు మాట్లాడాలి రా బాబూ !'' అన్నాడు.

రామం కూర్చున్నాడు. తండ్రి తనతో ముఖ్యమైన సంగతులు మాట్లాడడం అప్పుడప్పుడు జరుగుతుంది ఆ సమయం తనకి ముళ్లమీద ఉన్నట్టే ఉంటుంది. తనకి తోచిన అభిప్రాయం తను చెప్తాడు. ఇవాళ తండ్రి ఏం మాట్లాడతాడో తెలీదు. కాని ఇటువంటి సందర్భాన్ని ఒక్కసారన్నా ఎదుర్కోక తప్పదని తెలుసు. కొన్ని నిర్ణయాలు ఎప్పటికీ వాయిదా వెయ్యడం జరగదు. కొన్ని వాయిదా అలా వేస్తూనే ఉండొచ్చు. ''చెప్పు నాన్నా ...'' అన్నాడు రామం. పెద్దకొడుకవడం మధ్యతరగతి కుటుంబంలో ఒక శాపమే. యవ్వనంలో అడుగు పెట్టీ పెట్టగానే సగం బరువు తండ్రి తన భుజాలమీదికి నెట్టేస్తాడు. తండ్రికున్న ఆర్థిక ఇబ్బందులూ, బాధలు, అప్పులూ అన్నీ సగభాగం సంక్రమిస్తాయి. దురదృష్టవశాత్తూ ఇంట యజమానికి దేనికేదొచ్చినా సంసార భారమంతా పెద్దవాడి నెత్తిన పడుతుంది. తమ్ముళ్లని చదివించి పెద్దవాళ్లనిచేసి వాళ్లకి ఉద్యోగాలు చూడడం, చెల్లెళ్లుంటే వాళ్లకి పెళ్లిళ్లు చెయ్యడం, ఇంతలో నలభై ఏళ్లు నెత్తిన పడేసరికి తన సంసారం గురించి తాపత్రయ పడడం జరుగుతుంది. తెలీకుండానే ముసలితనం నెత్తిన పడుతుంది.

[ఇంకా వుంది

వేదాద్రి-పంచ నారసింహ క్షేత్రము



శ్రీ యోగానంద నరసింహస్వామి, పీఠమునందు ప్రతిష్ఠింపబడిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని చిత్రంలో చూడవచ్చు.

ఆంధ్రదేశమునందలి పంచ నారసింహక్షేత్రము లనబడు వేదాద్రి, మంగళగిరి, సింహాచలము, యాదగిరి, ఆగిరిపల్లి క్షేత్రములలో పంచ రూపాత్మకుడై దర్శనమిచ్చే నరసింహస్వామి వెలసిన పుణ్యక్షేత్రము వేదాద్రి. ఈ తీర్థములో జ్వాల, సాలగ్రామ, వీర, యోగానంద, లక్ష్మీ నారసింహమను నామములతో నారసింహుని రూపము దర్శనమిచ్చుచున్నది. ఈ పుణ్యక్షేత్రము విజయవాడ—హైదరాబాదు జాతీయ రహదారిలో చిల్లకల్లు కూడలికి 10 కిలోమీటర్ల దూరమున జనపదములకు దూరముగా కృష్ణా జిల్లా జగ్గయ్యపేట తాలూకాలో ఉన్నది.

జ్వాలా నరసింహస్వామి !

వేదాద్రి శిఖర ప్రదేశమున అతి తక్కువ మాత్రమే దృగ్గోచరమగు రూపము ఈ జ్వాలా నారసింహుని రూపము. బహిర్గతముకాని మూర్తిని దర్శించుటకు ఎవరైనా పర్వతమును త్రవ్వుటకు ప్రయత్నించిన అక్కడ నుంచి జ్వాలలు వచ్చునని, స్వామికి దేవాలయ మండప నిర్మాణమునకు ప్రయత్నించినప్పుడు కూడ ఇట్టి అవాంతరాలే జరిగినాయని, కావుననే ఈ జ్వాలా నారసింహుడు ఎట్టి అచ్ఛాదన లేకుండ ఉండుననియు, అట్టి జ్వాలారూపుని ప్రసన్న మొనరించుకొనుటకు ఈనాడు భక్తులు

పటిక బెల్లపు పానకం స్వామికి సమర్పించుదురనియు చెప్పబడుతున్నది. ఈ నరసింహస్వామికి కుడివైపున ఒక శివలింగము, దానికి కొద్ది దూరములో ఒక గుహగలవు. ఈ శివలింగము ఈ కొండ ప్రాంతములోనున్న పంచలింగములలో ఒకటి. ఇచ్చటి శివాలయమునందుగల తెల్లని 'మత్స్య సాలగ్రామము' అపురూపమైనది. ఈ గుహనుండి గరుడాద్రికి భూమార్గము ఉందని ప్రాంతీయులు చెప్పుచుందురు దానికి చిహ్నముగా గరుడాచలమునందు సైతము ఇట్టి గుహ కన్పించుచున్నది.

సాలగ్రామ నరసింహస్వామి :

కృష్ణానదీ గర్భమున యోగానందస్వామికి అభిముఖముగా నీటియందు చిన్న ద్వీపము వలె కన్పించు పర్వతరూపమే సాలగ్రామ నరసింహమూర్తి. స్వామి పైకి శిలామూర్తిగా గోచరించినను నీటి లోపలి భాగములందు కరాళముగలదనియు పాపులను, దుష్టగ్రహము లను నశింపజేయుననియు, చెప్పెదురు. దుష్టగ్రహపీడితులు యోగానందస్వామి ఎదుట ప్రాణాచారము బడినపుడు, వారి పాపము తీరు సమయమున ముఖమండపములో ఆంజనేయ మూర్తి పాదతాడనము చేయగా నదిలో పడిన గ్రహములను ఈ సాలగ్రామ నారసింహస్వామి కరాళమున గ్రహించునని భక్తుల నమ్మకము.

వీర నరసింహస్వామి :

గరుడాద్రికి 7,8కిలో మీటర్ల దూరమున ఈ క్షేత్రము వెలసియున్నది. ఇచ్చట వెలసియున్న వీరనరసింహస్వామిమూర్తి స్వయంభువు గుహాంతర్భాగములో ఎత్తయిన కొండ పై భయంకరముగ కన్పించు ఈ రూపము భక్తులకు ఆనందదాయకముగా ఉన్నది

యోగానందస్వామి :

యోగ పట్టములో కూర్చొని రెండు చేతులను జానువులపై ఉంచి, శంఖు చక్రములు ధరించి, మొలను చిరుకత్తి వ్రేలాడుచుండగా, గుహలోనున్నట్లు గర్భాలయములో కన్పించు ఈ మూర్తి అతి సుకుమారము, అత్యంత సుందరము భక్తులపాలిట కామధేనువైన ఆ మూర్తిని జూచి తరింపవలసినదేకాని వివరింప నలవికాదు


లక్ష్మీనరసింహస్వామి ·

అట్టి ఈ యోగానందములో నున్న ఈ స్వామికి లోక కళ్యాణార్థము జరిపించు కళ్యాణ క్రీడ అసాధ్యమని భావించిన ఋష్యశృంగముని వర్యుడే ఆ స్వామి పీఠమునకు లక్ష్మీయుతమైన నారసింహుని ప్రతిష్ఠించి, లోక క్షేమమునకై కళ్యాణము జరిపించెను అట్టి కళ్యాణమునే ఆధారముగా తీసుకొని వైశాఖ శుద్ధ ఏకాదశి నుండి పంచాహ్నికముగా వైఖాన సాగమానుసారము తిరుకళ్యాణము జరుగుచున్నది

ఈ దేవాలయ సమీపమున గల రంగరాజు కోట యని ప్రసిద్ధి చెందిన చారిత్రక కట్టడముతో ఈ దేవాలయ చరిత్ర ముడిపడియున్నది. ఇచ్చట లభించిన కొన్ని శాసనములు సైతము ఈ దేవాలయమున నిలబెట్టబడినవి. ఈ దేవాలయ ప్రాకారములు, సోపానములు సైతము రెడ్డి రాజులచే నిర్మింపబడినట్లు దేవాలయ చరిత్ర చెప్పుచున్నది. కన్నులారాగాంచి తరించవలసిన స్థలము ఈ పంచ నారసింహ క్షేత్రము


— " మాధుర్య "

శ్రీ స్వామివారి ఆలయం, మండపం, గోపుర ప్రాకారాదులు, దూరంగా కనిపించే పవిత్ర కృష్ణవేణిని చిత్రంలో చూడవచ్చు.



కొత్త సీరియల్ ప్రారంభం!





జీవితం మైనస్ సెంటిమెంట్

యర్రంశెట్టి శాయి

కృష్ణ బయట నుంచి విసుగ్గా స్కూటర్ హారన్ మోగించాడు

"వస్తున్నా బ్రదరూ! ఒక్క నిమషం" అన్నాడు ప్రసాద్ హడావుడిగా మేకప్ చేసేసుకుంటూ.

"ఆడపిల్లలాగా గంటసేపు మేకప్ అవుతావేంరా ?"

"మరి ఆడపిల్లలు మనని వరించాలంటే 'షో' ఉండాలి కదా !"

నవ్వుతూ బయటికొచ్చాడతను.

"అసలు దేవుడు నిన్ను ఆడపిల్లగా పుట్టించాల్సిందిరా !" అతను కూర్చోగానే స్కూటర్ స్టార్ట్ చేస్తూ అన్నాడు కృష్ణ.

"ఎందుకంటావ్ ?"

"లేకపోతే మొగాడెవడయినా అంతసేపు అద్దం ముందు మేకప్ అవుతాడా ?"

"నీకు తెలుసో, తెలీదో గాని నేను గుడి కెళ్ళినప్పుడల్లా దేవుడిని అదే ప్రార్థిస్తూంటారా!"

"ఏమని ?" ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణ.

"వచ్చే జన్మలోనయినా నన్ను ఆడపిల్లగా పుట్టించమని ..."

కృష్ణ స్కూటర్ ఆపి వెనక్కు తిరిగి ప్రసాద్ మొఖంలోకి చూశాడు.

"ఎందుకురా అలా కోరడం ?"

"అప్పుడిక ఇలా మేకప్ అవడాలు, ఏ ఆడ కూతురు కరుణిస్తుందా అని కాపలాలు కాని, వెంబడి ప్రదక్షణాలు చేయడం ఉండవు కదా! కుర్రాళ్ళందరూ మన వెనుకే తిరుగుతారు. అందులో మనకు నచ్చినవాడిని చూసి ఇసింటా నవ్వితే చాలు – ఇంక మనకు సినిమాలకూ, షికార్లకూ, హోటళ్ళకూ—అన్నీ వాడి ఖర్చే—"

ఇద్దరూ నవ్వేశారు.

"దేవుడిక్కూడా తెల్సురా బాబూ! నువ్వలాంటి వెధవపనులు చేస్తావనే నిన్ను మొగాడిగా పుట్టించాడు..."

అంటూ మళ్ళీ స్కూటర్ స్టార్ట్ చేశాడు కృష్ణ.

పది నిమషాల్లో ఇద్దరూ గవర్నమెంట్ హాస్పిటల్ చేరుకున్నారు.

స్కూటర్ని స్టాండ్‌లో పార్క్ చేసి ఇద్దరూ గేటుకి కొంచెం దూరంలో నిలబడ్డారు.

ప్రసాద్ వాచీ చూసుకున్నాడు.

"అరె. టైమయిపోయిందిగా! మీ పిట్ట రాలేదేం?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"నీ వాచీని నమ్మకోకురా అని లక్షసార్లు చెప్పాను. అమ్మాయిల వేటలో ఉన్నప్పుడు ఇలాంటి ఎలక్ట్రానిక్ వాచీలు వాడ్కాలా చిట్టి తండ్రీ. లేపోతే టైములు మిస్సయిపోయి, కొంపలు కూలిపోయే ప్రమాదాలున్నాయ్— ఇదిగో—నా వాచీలో చూడు! ఇంకా పది నిమిషాల టైముంది—"

ఈలోగా ప్రసాద్ హాస్పిటల్ భవనం వేపు చూశాడు.

"బ్రదర్ ! వచ్చేస్తోంది !" అన్నాడు హుషారుగా.

కృష్ణ హడావుడిగా జేబులోనుంచి కూలింగ్ గ్లాసులు తీసి కళ్ళకు తగిలించుకుని తనూ అటు వేపు చూశాడు.

నర్స్ దుస్తుల్లో ఆకర్షణీయంగా ఉన్న ఓ యువతి అప్పుడే మెట్లు దిగి గేటువేపు వస్తోంది ఆమె చేతిమీద ఎర్రరంగు స్వెట్టర్ ఉంది

కృష్ణ ఆమెను చూడగానే ఆనందంగ విజిల్ వేశాడు.

"ఒరే పక్షీ ! నువ్వాపక్కకెళ్ళిపో ! నేన ఆ దేవతకు పాఠం చెప్పి వచ్చేస్తాను..." అన్నాడ జేబులోనుండి స్టెతస్కోపుతీసి పట్టుకుంటూ ప్రసాద్ వడివడిగా మరో మూలకెళ్ళి నిలబడ్డాడ

కృష్ణ ఆ యువతికెదురువెళ్ళి, ఆమె గేట దాటి బయటకురాగానే కలుసుకున్నాడు.

"హలో..." అన్నాడు ఆమెవంక చిరునవ్వు చూస్తూ. ఆమె ఠక్కున ఆగిపోయి అతనివే చూసింది.

"ఎలావున్నారు సిస్టర్ ! బాగున్నారా ! అడిగాడతను ఎంతో ఆప్యాయంగా. ఆమె అత గుర్తుపట్టడానికి ప్రయత్నించి విఫలురాలయిం

"బాగానే ఉన్నానండీ ! థాంక్‌యూ అంది ఆలోచిస్తూ.

"హమ్మయ్య ! బ్రతికించారు. నాలు గేళ్ళ

జీవితం — సెంటిమెంట్



నెల్లూరు న్యాయవాదుల సమావేశంలో కూచిపూడి నాట్య ప్రదర్శన ఇచ్చిన నాట్యమయూరి చి. మద్దాలి అపర్ణని అభినందిస్తున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ వై. వి. ఆంజనేయులుగారిని చిత్రంలో చూడవచ్చు

పోయింది కదా హౌస్ సర్జన్ చేసి! గుర్తు పడతారో లేదో అనుకున్నాను..." అన్నాడు నవ్వుతూ.

ఆమెకేమీ గుర్తులేదు కానీ ప్రతి సంవత్సరం ఓ కొత్త బాచి రావడం మూలాన అందరినీ గుర్తు పెట్టుకోవడంకూడా సాధ్యంకాదు

"ఇప్పుడెక్కడున్నారు ?" మర్యాదకోసం అడిగిందామె

"ఇక్కడే ప్రాక్టీస్ పెట్టానీమధ్య! చాలా బాగుందిలెండి! క్షణం తీరిక ఉండడంలేదు. అందుకే ప్రాక్టీస్‌పెట్టి ఆరు నెలలయినా ఇక్కడికొచ్చి మీలాంటి ఫ్రెండ్స్‌ని కలుసుకోవటం సాధ్యపడనేలేదు," నొచ్చుకుంటూ అన్నాడతను

ఆమె చిన్నగా నవ్వి కేస్ చూసుకుంది.

మరుక్షణంలో 'వెళ్తానండీ' అనేసి జారుకుంటుందని తెలిసిపోయింది కృష్ణకి.

"ఆ! చూడండి సిస్టర్! మిమ్మల్నో సాయం అడగడానికొచ్చాను.." అన్నాడతను.

"ఏమిటది ?" ఆశ్చర్యంగా అడిగిందామె

"నా పేషంట్ ఒకామెకి రోజూ ఇంజక్షన్ ఇవ్వాలి. నాకేమో డిస్పెన్సరీ వదలి వెళ్ళేందుకు టైమ్ దొరకడంలేదు. మీకు అభ్యంతరం లేకపోతే పదిరోజులు మీరు రోజూ వాళ్ళింటికెళ్ళి ఆమెకు ఇంజక్షన్ ఇచ్చిరావాలి. అఫ్‌కోర్స్ వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళు గనుక మీరెంత ఫీజ్ ఛార్జ్ చేస్తే అంత ఇస్తారు. దయచేసి నాకీ హెల్ప్ చేయండి."

ఆమె ఓ క్షణం ఆలోచించింది.

"ప్లీజ్ !" అన్నాడు కృష్ణ.

అతనిని కాదనడం భావ్యంగా కనిపించలేదామెకి.

"ఓకే !" అంది.

"అయితే ఓ పని చేయండి ! మీరు నైట్ షిఫ్ట్‌లో ఉన్నారు కదా ! సాయంత్రం ఆరు గంటల కల్లా మా ఇంటి కొస్తే మిమ్మల్ని వాళ్ళింటికి తీసుకెళ్ళి ఇంట్రడ్యూస్ చేస్తాను .. ఆ తరువాత మీ ఇష్టం ! రోజూ మీకెప్పుడు కన్వీనియెన్స్ ఉంటే అప్పుడేవెళ్ళి ఇంజక్షన్ చేద్దురుగాని..."

"మీ ఇల్లెక్కడ మరి ?"

"కనుక్కోవడం చాలా తేలిక ! తిలక్‌రోడ్ తెలుసు కదా మీకు ?"

"ఓ !..."

"ఆ రోడ్‌లో పెట్రోల్‌బంక్‌కి ఎదురుగ్గానే ఉంటుంది కొత్తగా కట్టిన బంగళా అది ! 'ప్రేమసాగర్' అని ఉంటుంది బోర్డు — అదే!"

"ఓ.కే. సాయంత్రం వస్తాను ."

"ప్లీజ్ ! సారీ ఫర్ ది ట్రబుల్ అయామ్ గివింగ్ ..."

"దట్సాల్ రైట్."

ఆమె వెళ్ళిపోయింది.

స్టాండ్‌లోకెళ్ళి స్కూటర్ తీసుకుని స్టార్ట్ చేసేలోగా ప్రసాద్ పరుగుతో వచ్చి అతని వెనుక కూర్చున్నాడు.

స్కూటర్ వేగంగా రోడ్‌మీద పరుగెట్టసాగింది.

"ఏమయింది గురూ ! కాయా ! పండా?"

"ఒరేయ్ ! మన జన్మలో ఇంతవరకూ ఏ కేసయినా ఫెయిలవడం చూశావా !"

"లేదు !"

"మరి ఇది మాత్రం ఎలా ఫెయిలవుతుందనుకున్నావ్‌రా పక్షీ ! సాయంత్రం ఆరు గంటలకు ఆ దేవత మన ప్రేమ సాగరానికి వస్తోంది."

"అబ్బబ్బ — ఏమి అదృష్టం గురూ !"

"అదృష్టం కాదురా పక్షీ ! కృషి! సిన్సియర్‌గా కృషి చేసినవాడికి అపజయం లేదని అన్నారు."

"ఎవరు ?"

"నేనే ! ఇంకెవరో అంటే మనకెందుకు?"

"అంటే ఇప్పుడు ఆ టెలిఫోన్ ఆపరేటర్ ఒక దేవత, ఈ నర్స్ ఒక దేవత, త్రీ స్టార్ హోటల్ రిసెప్షనిస్ట్ మరో దేవత — మొత్తం ముగ్గురు ప్రియురాళ్ళన్నమాట !"

"నోర్మూసుకోరా ! అలా దిష్టికొట్టకు శకుని పక్షీ !"

స్కూటర్ ఓ అందమైన ఇంటి ఆవరణలో ఆగింది.

ఇంటిముందు 'ప్రేమసాగర్' అన్న బోర్డు మరింత అందంగా కనబడుతోంది.

ప్రసాద్ జేబులోనుంచి తాళం చెవి తీసి దానితో ఇంటి తలుపులు తెరిచాడు.

ఇద్దరూ లోపలకు నడిచి చెరో సోఫాలో కూలబడ్డారు.

"ఒరేయ్ ప్రసాద్ . ఆ డోర్ కర్టెన్లు, విండో కర్టెన్లూ సాయంత్రానికల్లా మార్చేసెయ్ !..." అన్నాడు కృష్ణ ఇల్లంతా పరీక్షగా చూస్తూ.

"వాటికేం— అవి బాగానే ఉన్నాయిగా. ." ఆశ్చర్యంగా అన్నాడు ప్రసాద్.

"వెధవ ప్రశ్న వేయకురా ! కొత్త పెళ్ళి కూతురు ఇవాళ ఇంటి గడప తొక్కుతోంటే ఇల్లు ఎంత అందంగా కళకళలాడి పోవాలి?"

"సరే— నీ ఇష్టం—" అంటూ లేచి కర్టెన్లన్నీ తీసి పారేసి అల్మారాలో ఉన్న కొత్త కర్టెన్లు తగిలించసాగాడతను.

ఈ లోగా ఫోన్ మోగేసరికి కృష్ణ పరుగుతో వెళ్ళి రిసీవర్ తీసుకున్నాడు.

"హలో. " అన్నాడు ఆతృతగా.

"హలో— కృష్ణేనా మాట్లాడేది ?"

"అవును ! ఎవరు ?"

"ఇంకెవరు, నేనే ! చంద్రకళని !"

"హలో డార్లింగ్ ! ఏమిటి నేనివాళ ఇంత పొద్దున్నే గుర్తుకొచ్చాను ?"

"ఇప్పుడే డ్యూటీకొచ్చాను,"

"ఓహో ఇవాళ్టినుంచీ డే 'డ్యూటీ' అన్న మాట ! అంతేనా ?"

"కరెక్ట్ ! ఇవాళ సాయంత్రం ప్రోగ్రాం ఏమిటి ?"

"సాయంత్రమా ! ఏముంది? ఏమీలేదు !"

"అయితే ఆరింటికల్లా వచ్చేస్తాను..."

"ఎక్కడికి?" గాబరాగా అన్నాడు కృష్ణ.

"ఎక్కడికేమిటి? మీ ఇంటికి!"

"ఇంటికా...వద్దు...వద్దు..."

"ఏం? ఎందుకని?"

"నేను ఉండను!"

"అదేమిటి? ప్రోగ్రామేమీ లేదన్నావుగా!"

"అలా అన్నానా! వెధవది బుర్ర పూర్తిగా పాడయిపోయింది."

"ఇంతకూ ఎక్కడికెళ్తున్నావ్ సాయంత్రం?"

"ఎక్కడికా...అదే–ఎక్కడికంటే...ఎక్కడికబ్బా—ఆ! అదే! రవీంద్ర భారతికి!"

"రవీంద్ర భారతికెందుకు?"

"అక్కడ మా ఫ్రెండ్ ఒకడు ఖవాలీలు పాడుతున్నాడట—రమ్మని మరీ మరీ చెప్పాడు..."

"అతని పేరేమిటి?"

"శ్యామ్‌లాల్!"

"అదేమిటి? తెలుగతను ఖవాలీలు పాడతాడా?"

"అదా...అదీ ... వాడు చిన్నప్పటినుంచీ

ఖవాలీ ట్రూప్‌తో తిరిగాడ్లే ! అందుకని నేర్చుకున్నాడు...''

''కాని ఇవాళ సాయంత్రం ఆరింటికి పి. సి. లాల్ మాజిక్‌షో అని ఉందిగా పేపర్లో?''

''పి. సి. లాల్ మాజిక్‌షో...అహహ—పి. సి. లాల్ మాజిక్‌షో—అహహ—పి. సి. లాల్ అంటే ఎవరనుకుంటున్నావ్ ? వాడే — మా శ్యామ్రావ్‌గాడి బాబాయి అన్నమాట ...''

''సరే అయితే రేపు సాయంత్రం వస్తాను.''

''రేపు సాయంత్రమా ! ఓ.కే — ఆరు గంటలకల్లా వచ్చేసెయ్. హాయిగా కాసేపు ప్రేమించుకుని ఆ తరువాత ఫియట్‌లో బీచ్, మూన్‌లైట్ డిన్నర్ — ''

అతని మాటలు విని ప్రసాద్ ఉలిక్కిపడి డయిరీ తీసి చూశాడు.

''ఒరేయ్ — రేపు వద్దని చెప్పు'' అన్నాడు కృష్ణ చేతిలో ఫోన్ లాక్కుని మౌత్ పీస్ చేత్తో మూసివేస్తూ.

''ఎందుకని ?''

''ఎందుకనేమిట్రా ! రేపు అరుంధతి వస్తున్నట్లు లెటర్ రాసిందిగా !''

''ఇంకా నయం కొంపలు మునిగిపోయేవి'' అంటూ మళ్ళీ ఫోన్ అందుకున్నాడు కృష్ణ.

''హాయ్ చంద్రా డియర్! ఇంకో ప్రాబ్లెమ్ వచ్చి పడింది. రేపు సాయంత్రం మా రూమ్మేటు ప్రసాద్‌గాడు లేడూ వాడి బర్త్‌డే పార్టీ ఉంది. పాపం — వాడికి తల్లీ తండ్రీ, అన్నీ నేనే కదా ఇక్కడ ! అందుకని నేను లేకపోతె వాడు ఏడ్చేస్తాడు — రియల్లీ — నేను వెళ్ళలేదని కిందటిసారి ఏడ్చేశాడు కూడా ! ఏడుపు విన్నవాళ్ళు స్వయంగా నాతో చెప్పారలా అని.''

''ఆల్‌రైట్ ! అలా అయితే అసలు రానులే ఇక ... '' కోపంగా అందామె.

''అయ్యాయ్యో ! అంత కోపమొస్తే ఎలాగోయ్ ! ఎల్లుండి సాయంత్రం కేవలం నీ కోసం ప్రోగ్రామ్‌లన్నీ కాన్సిల్ చేసుకుని వెయిట్ చేస్తాను — ఓకే ?''

''సరే ... ''

ఫోన్ పెట్టేశాడతను. లేచి బయటికెళబోతూంటే ''మళ్ళీ ఎక్కడికి ?'' అంటూ అరిచాడు ప్రసాద్.

''అద్దె కారుకి.''

''గురూ ! ఈసారికూడా కొత్త ఫియెట్ తీసుకురా — బ్రహ్మాండంగా ఉందది.''

''రడీగా ఉండాలి కదా ... ''

అతను వెళ్ళిపోయాడు. కాసేపటికి కుర్రాడు కారియర్‌లో భోజనం తీసుకొచ్చాడు. డైనింగ్ టేబుల్‌మీద భోజనానికి ఇద్దరికీ ఏర్పాట్లు చేశాడు ప్రసాద్.

అప్పటికీ ఇంకా కృష్ణ రాకపోయేసరికి విసుగుపుట్టి స్టీరియోలో ఇంగ్లీష్ మ్యూజిక్ ఆన్ చేశాడు.

బానీ'యమ్' 'హాలె హాల' చెవులు హోరెక్కించేస్తోంది.

బయటనుంచీ కాలింగ్ బెల్ మోగడం వినిపించడమేలేదు. కాలింక్ బెల్ నొక్కి నొక్కి టెలిగ్రాఫ్ మెసేంజర్‌కి చేతులు నొప్పెట్టినయ్. ఇలా లాభంలేదని తనే లోపలకు జొరబడి ప్రసాద్ భుజంతట్టి 'సార్' అంటూ పిలిచాడతను.

మ్యూజిక్‌లో మునిగిపోయి ఉన్న ప్రసాద్ అదిరిపోయి ఎగిరి నిలబడి భయంగా అతనివేపు చూశాడు.

''టెలిగ్రాం సార్ !'' అన్నాడు మెసేంజర్ వినయంగా.

''అదేమిటోయ్ ? టెలిగ్రాంలువస్తే ఇలా ఇళ్లల్లో జొరబడి, మనుషుల్ని కుదిపేసి, అదరగొట్టి ఇస్తారా ?'' అన్నాడు ప్రసాద్ కోపంగా.

''కాలింగ్ బెల్ నొక్కి నొక్కి ఇదిగో — ఈ వేలు చూడండి ఎలా కందిపోయిందో — మీరు వినడమేలేదు. అందుకని... ఇదిగో — ఇక్కడ సంతకం చేయండి...'' అనేసి సంతకం పెట్టించుకుని టెలిగ్రాం అతని చేతికిచ్చి వెళ్ళిపోయాడతను.

ఖంగారుగా టెలిగ్రామ్ తీసి చదివాడతను.

''ఎరైవింగ్ ట్వంటీ ఫోర్త్ కోరమండల్. ఎటెండ్ స్టేషన్ — శీతారామయ్య'' అని ఉందందులో.

''అమ్మయ్య ! వస్తోంది మా నాన్న కాదన్నమాట ! థాంక్ గాడ్'' అనుకున్నాడు ధైర్యం తెచ్చుకుని.

బయట కారు హారన్ మోగింది.

పరుగుతో బయటికొచ్చి చూశాడు ప్రసాద్. కృష్ణ ఫియట్‌లోంచి దిగుతున్నాడు.

''అదృష్టంరా ! మనం కోరుకున్నదే దొరిందన్నమాట !'' అన్నాడతను ఆనందంగా.

''అదిగో అదే వద్దన్నారా ! అదృష్టం కాదు— కృషి— కృషి—''

ఏదోకటిలేరా—''

''ఛస్తే వప్పుకోను ! నేను వెళ్ళేప్పటికి ఆ డొక్కు స్టాండర్డ్ ఉంది. కావాలంటే ఇంకో పాతిక ఎక్కువ తీసుకోమని వాడికి మస్కాకొట్టేసరికి వాడు ఆ ఫియట్ తీసుకెళ్ళిన వాళ్ళకి ఫోన్ చేసి ఏదో నచ్చజెప్పి అప్పటికప్పుడు తెప్పించాడు''

''ఎన్ని రోజులకి తీసుకున్నావ్ ?''

''ప్రస్తుతానికి రెండు రోజులని చెప్పాను. కావాలంటే ఎక్స్‌టెండ్ చేయవచ్చు.''

ఇద్దరూ లోపలకు నడిచారు.

''కుర్రాడు మీల్స్ తెచ్చాడా ?''

''ఓ ! రడీగా ఉంది—''

''అయితే పద— ఇంక ఆలస్యం ఎందుకు''

ఇద్దరూ డైనింగ్ రూమ్‌లోకి జొరబడి టేబుల్‌ముందు కూర్చున్నారు.

ఇద్దరికీ తనే వడ్డించాడు ప్రసాద్.

భోజనం చేస్తూండగా టెలిగ్రామ్ సంగతి తక్కున గుర్తుకొచ్చింది ప్రసాద్‌కి !

''అన్నట్లు చెప్పడం మర్చిపోయాన్రోయ్- మీ అన్నయ్య టెలిగ్రామిచ్చాడు—''

అదిరిపడ్డాడు కృష్ణ.

''టెలిగ్రామా ?''

''అవును !''

''ఏమని ? ''

''రేపు కోరమండల్ కొస్తున్నాడట...''

''కోరమండల్‌కెలా వస్తున్నాడు ఒకవేళ బిజినెస్ మీద విజయవాడ వెళ్లి డైరెక్టు ఇక్కడికొస్తున్నాడేమో ! కొంప మునిగిం కదా.''


''అద్దెదేగా—మునగనీ.''


''అది కాదురా ! రేపు సాయంత్రం ఽ ట్రైనుకి అరుంధతి కూడా వస్తోంది కద మర్చిపోయావా ?''

''అవున్రా ! నిజమే ! మర్చేపోయాను !

''ఇప్పుడేం చెయ్యటం ?'' భోజనం చేయడం ఆపి ఆలోచనలో పడ్డాడు కృష్ణ

''ముందు భోజనం చేయరా, తరు:





జీవితం—సెంటిమెంట్

ఆలోచిద్దాం!"

"అంతేనంటావా ?"

"లేపోతే అటు ఆలోచానా రాదు – ఇటు భోజనమూ చేయలేము–కానీ త్వరగా."

ఇద్దరూ భోజనం చేయడం ముగించి మళ్లీ హాల్లోకొచ్చి కూర్చున్నారు.

"ఓ పని చేద్దాంరా! అరుంధతిని నేను రిసీవ్ చేసుకుని, నువ్ హఠాత్తుగా మీ అన్నయ్యకు సీరియస్‌గా ఉందని మీ ఊరు వెళ్లావని చెప్పేస్తాను. దాంతో ఆమెగారు 'అయ్యో' అని అశోక వృక్షం కింద సీతలాగా కూలబడి పోతుంది కదా– వెంటనే ఓ రిటర్న్ టికెట్‌కొని ఆమె చేతిలో పెట్టి రైలెక్కించేస్తాను."

కృష్ణ ఆనందంగా చూశాడతనివేపు.

"ఎంత దారుణమయిన బ్రెయిన్‌రా నీది ఏదీ ఇంత మంచి ఉపాయం చెప్పినందుకు ఒక్కసారి కౌగలించుకోనీ."

"ఛ! వద్దులేరా! మగాడు, మగాడ కౌగలించుకుంటే ఏం బాగుంటుంది?"

అంతలోనే ఏదో అనుమానం వచ్చింది కృష్ణకి.

"అవునూ! అరుంధతిని రిసీవ్ చేసుకుంటానంటున్నావ్– లోపల ఏమీ దురుద్దేశం లేదు కదా!" అనుమానంగా అడిగాడతను.

"ఛ ఛ! ఫ్రెండ్ ప్రియురాలు సిస్టర్‌తో సమానమని పెద్దలన్నారు! అలాంటి అనుమానాలు పెట్టుకోకు! కళ్ళు పోతయ్."

"అంతేనంటావా ?"

"ఒరేయ్! నువ్ లేనప్పుడు నీ కోసం ఎన్నోసార్లు చంద్రకళ, రజని, అరుంధతి రాలేదుట్రా ? అప్పుడు నేనేమయినా మిస్‌బిహేవ్ చేశానా ? లేదే! సొంత వదినల్లాగా అందరినీ ఆదరంగా ఆహ్వానించి, కాఫీ, వోవల్టీనూ, హార్లిక్సూ– లాంటివన్నీ తాగించి, కాలక్షేపానికి మంచి మ్యాగ్జైన్లు ఇచ్చి, కబుర్లు చెప్పి–"

"ఓకే– వప్పుకున్నాను– ఇంక ఆపెయ్–"

"అంటే– మనిద్దరి మధ్యా ఇంక ఎలాంటి అనుమానాలూ, అపార్థాలూ రావని గ్యారంటీ ఇస్తున్నట్లేనా ?"

"ప్రస్తుతానికి–"

"ఓకే – తరువాత ఎక్స్‌టెన్షన్ ఇద్దూ గానిలే –"

"అయితే రేపు మనిద్దరం స్టేషన్‌కెళ్తాం– నువ్వు అరుంధతిని రిసీవ్ చేసుకుని వెయిటింగ్ రూమ్ దగ్గరకు తీసుకెళ్ళిపో! నేను మా అన్నయ్యతో కాసేపు ప్లాట్‌ఫారం మీదే హస్క్ కొట్టి– నువ్వూ, అరుంధతీ వెయిటింగ్ రూమ్ లోకెళ్ళాక మేము బయటికెళ్ళిపోతాం –"

"సరే–"

వాళ్ళిద్దరూ మాట్లాడుతూండగానే గడియారం అయిదు గంటలు కొట్టింది.

"మైగాడ్! అప్పుడే అయిదయిపోయింది. ఇంకో గంటలో ఆనర్స్ దేవత వచ్చేస్తుంది –" అంటూ హడావుడిగా లేచి బాత్‌రూమ్ వేపు పరుగెత్తాడు.

మరో అరగంటలో ఇద్దరూ రడీ అయిపోయారు.

"ఒరేయ్! నువ్వెళ్ళి సరిగ్గా ఆరుంబావుకి నాకు ఫోన్ చేయ్." ప్రసాద్‌తో చెప్పాడు కృష్ణ.

"నీకెందుకు ఆ అమ్మాయి ఇంట్లోకి రాగానే ఫోన్ చేస్తాను –"

"ఎక్కడినుంచి చేస్తావ్?"

"అవతల హోటల్ ఉందిగా! అక్కడి నుంచి!"

"ఓకే–"


ప్రసాద్ వెళ్ళిపోయాడు.


ఇల్లంతా మరోసారి కలియజూశాడు కృష్ణ. చాలా అందంగా ముచ్చటగా ఉందిప్పుడు.

'టీ'పాయ్ మీద ఉదయం తెచ్చిన రెండు మెడికల్ జర్నల్స్ ఉన్నాయ్. ఇల్లు, ఫర్నిచర్‌తో సహా అద్దెకు తీసుకోవడం మూలాన చాలా ధనవంతుల ఇల్లులా కనబడుతోంది.

ఖరీదయిన సోఫాలూ, తివాచీలూ, బెడ్‌లూ, డైనింగ్ టేబులూ, కుర్చీలూ, అచ్చం సినిమాలలో సెట్టింగ్‌లాగా ఉంది.

అందుకే ఇల్లు ఇచ్చేటప్పుడు ఓనరు లక్ష కండిషన్లు పెట్టాడు.





మీ యింటికెవరైనా రాగానే, గడపతొక్కి లోపలికి రాగానే, మీ అతిథులకి మీరు చేసే సత్కారం ఏమిటి? ఓ చిరునవ్వు, ఓ కప్పు టీ—అవునా? మరి పరంపరాగతంగా వస్తూన్నదది—మీ సంప్రదాయం, సంస్కృతి, ఆదరణ-వీటి చక్కని పరిణామ స్వరూపం.

మరి వాళ్ళొచ్చేసరికల్లా మీ యింట్లో పాలు అయిపోయాయనుకోండి. మీకెలాగో యిబ్బందిగా అనిపించదూ? ఇక అప్పటి కప్పుడు ఉన్న పళంగా పాలు రమ్మంటే ఎలా వస్తాయి గనక?

సాగర్ స్కిమ్ మిల్క్ పౌడర్, మరి మీ అమ్మగారి, అమ్మమ్మగారి నుంచీ తరతరాలుగా వస్తూన్న ఆ చక్కని సంప్రదాయాన్ని నిలబెడుతుందిక. అది గూడా పొదుపుగా, త్వరగా, తేలికగా. ఇక తీపి పదార్థాలూ, పుడ్డింగులూ అవీ చేసుకోవడానికి యిదెంతో బాగుంటుంది.

సాగర్
స్కిమ్ మిల్క్ పౌడర్

పాలలోని మంచిదనాన్నంతా యిస్తుంది, కొవ్వు పదార్థాలు లేకుండానే.



ASP/SMP/5/84

మార్కెట్ చేసేవారు:
గుజరాత్ కోపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్
పోస్ట్ బాక్స్ 10, ఆనంద్ 388 001. గుజరాత్.



గోడల మీద మరకలు పడకూడదు.

సోఫాలు పాడవకూడదు.

కుర్చీలు విరగకూడదు.

డైనింగ్ టేబుల్ మీద డెకోలాక్ పోకూడదు.

మంచాలూ, ఫోమ్ పరుపులూ చెక్కు దరకూడదు.

తివాచీలు కాలటం—చిరగటం—ఏమీ జరగ్గ కూడదు—

ఇలా ఎన్నో—

అద్దె కొంచెం ఎక్కువే!

అంతా కలిపి ఎనిమిది వందలు—

అన్నయ్యతో నాలుగు వందలని అబద్ధం చెప్పేశాడు తను. లేకపోతే అంత ఎక్కువ అద్దె ఇంట్లో ఉంటానికి అన్నయ్య ఒప్పుకోడు. ప్రతి నెలా తనకు రెండువేలు పంపుతాడన్నయ్య. తను ఎలాంటి బాధా పడకుండా కోరిన బట్టా, తిండీ, ఇతర సరదాలు — అమర్చాలని అన్నయ్య తాపత్రయం.

తమ చిన్నప్పుడు అన్నయ్య కటిక దరిద్రం వల్లే చదువుకోలేకపోయాడు. చదువుకొనే రోజుల్లో ఎప్పుడూ చిరిగిన చొక్కాలూ, పస్తులు, స్కూలు ఫీజులు కట్టలేకపోవడం, ఇవన్నీ అతనిని చాలా హింసించినయ్.

అందుకే ఇప్పుడు తనమీద ''లేమి'' అనే నీడ పడకూడదని అతని కోరిక.

వ్యాపారంలో సంపాదనకూడా బాగానే ఉండడంతో తను అడిగినంత డబ్బు ఇచ్చేస్తూంటాడు.

డబ్బు విచ్చలవిడిగా చేతికి దొరకడంతో తనకు చదువుమీద శ్రద్ధ సన్నగిల్లిపోయింది.

డిగ్రీ పాసయ్యేవరకూ సినిమాలకూ, పార్టీలకూ, బట్టలకూ విపరీతంగా ఖర్చు చేసేవాడు.

కానీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో జాయినయ్యా తన అభిరుచులు మారిపోయినాయ్.

ఆడపిల్లలమీద మోజు ప్రారంభమయింది

ఆ మోజువల్లే ఎమ్మే పరీక్ష పోయింది.

అయినా తనేం పశ్చాత్తాప పడడంలేదు ఉద్యోగంలోకో, అన్నయ్య వ్యాపారంలోకో జొరబడే లోగానే జీవితాన్ని తనివితీరా అనుభవించాలని తన కోరిక.

ఆ తరువాత ఇలాంటి అనుభవాలూ, ఆనందాలూ లభించడానికి అవకాశాలు తక్కువ

కాలింగ్ బెల్ మృదువుగా మ్రోగింది.

ఒక్క ఉదుటున లేచి బయటకు నడిచాడతను.

ఎదురుగ్గా ఆమె నవ్వుతూ నిలబడి ఉంది.

నర్స్ దుస్తుల్లో కన్నా చీరలో బాగా అందంగా కనబడుతోంది. కొద్ది క్షణాల పాటు చూపులు మరల్చుకోలేక పోయాడు కృష్ణ.

''రండి! మీకోసమే చూస్తున్నాను...'' అన్నాడు తక్కున స్ఫృహలోకొస్తూ.

ఆమె లోపలికొచ్చింది.

''కూర్చోండి!''

ఇద్దరూ సోఫాల్లో కూర్చున్నారు.

''మీరు ఏం తీసుకుంటారో చెప్పండి ముందు. కాఫీయా, హార్లిక్సా— కూల్ డ్రింక్సా?''

''ఏమీ వద్దులెండి!'' సిగ్గు పడుతూ అందామె.

''అలా కుదరదులెండి! ఏదో ఒకటి తీసుకోవాల్సిందే!''

''అయితే— మీ ఇష్టం! ఏదయినా సరే!''

''ఇదిగో! అందాకా ఈ పుస్తకాలు చూస్తూండండి! ఈ లోగా నేను హార్లిక్స్ తయారు చేసుకొస్తాను...''

''మీరు చేసుకొస్తారా?'' లోపలకు సందేహంగా చూస్తూ అడిగిందామె.

''అవును! ఇంకెవరున్నారు మరి!''

''అంటే... మీరు...''

''ఇంకా ఎవ్వరూ పిల్లనివ్వడానికి ధైర్యం చేయడం లేదు...''

''ఓ!'' నవ్వుతూ అందామె.

అతను లోపలకు వెళ్ళాడు.

డైనింగ్ రూమ్‌లోనుంచి గ్లాసుల శబ్దాలు వినిపించసాగాయి.

ఆమె మాగజైన్స్ తిరగేయసాగింది.

(ఇంకా వుంది)

ఎస్.ఆర్.సి.—రాజం అయ్యంగార్ – సిద్ధాంతం

మానస సరోవర్ యాత్రకు వెళ్ళటకు అర్హనైజరు వున్నారా? మనల్ని వెళ్ళనిస్తారా?. వివరాలు తెలుపకలరు.

★ ఈ సమాధానం మీకందేసరికి వివరాలూ అందుతాయి. మెడికల్ ఫిట్‌నెస్ కూడా చూస్తారు. మీకింకా వివరాలు కావలిస్తే ఏ టూరిజమ్ శాఖవారికి రాసినా అందిస్తారని ఆశిస్తున్నాను. (సాధారణంగా వీళ్ళు 'విదేశీయులని' చూసినంత మర్యాదగా మనని చూడరు !)

గణేశ్ – ఆదోని

అనాదిగా మగవాడికి బలి అయిపోతూన్నా ఆడది మగవాడినే నమ్ముకుంది.

★ మరే – గొర్రె కసాయివాడినీ, కాపరినీ నమ్మినట్లు !!

వెంకట్ – ఉరవకొండ

మనిషికి శాంతి ఎక్కడ దొరుకుతుంది ?

★ స్మశానంలోకూడా దొరకడం లేదు ! యింకెక్కడి శాంతిలెండి.

మీ అభిప్రాయంలో ఎట్టి మానవుడికి చీకూ చింతా వుండదు ?

★ పుట్టనివారికీ; చనిపోయినవారికీ.

మీ ఆడవాళ్లకి ఎందుకండీ అనుమానాలు ?

★నిప్పుకీ పొగకీ అంత దూరం వుండదని తెలిసినవాళ్ళు కనుక.

ఆర్.టి.బి.కె. — హైదరాబాదు

ఆడది కోరుకునే వరాలు రెండే రెండు — తను జీవితాంతం పుణ్యస్త్రీగా బ్రతకాలని, మాతృత్వం పొందాలని — మరి మగవాడు ?

★ ఆడదీ — మగవాడూ — ఒకే వరాలు కోరుకున్నప్పుడే — అది సుఖసంసారం అవుతుంది.

పి. ఎన్. బి. – హైద్రాబాదు

ఆంగ్ల మాసపత్రిక డెబినోయిర్‌లో నగ్నంగా ఫోజులిచ్చే అతివలు మీ స్త్రీ జాతిని బజారున పెడుతున్నారు. ముందు వాళ్ళపై దాడి చేసి అప్పుడు స్త్రీ జనోద్ధరణ చేద్దురుగాని.

★ అలాగే సూరిబాబూ, కాని వాటికోసం ఎగబడే వారిని ఏంచేయాలి ? అంతకంటే అసహ్యంగా రాస్తూ, బొమ్మలు వేస్తూన్న వారినేం చెయ్యాలి ? మోడలింగు వృత్తి. ఆర్థిక సూత్రాల ప్రకారం— డిమాండుని పట్టే సప్లై వుంటుంది—కాని సప్లై తక్కువైతే— ఎగబడి కొనేసే—వాళ్లలాంటి వారికోసమే—మీరుదహరించే పత్రికల్లాంటివి ! జయమాలిని స్మితలకు కట్టే పూసలే అధికం అనుకునే వాళ్ళుండబట్టే — నగ్న చిత్రాలకి గిరాకీ... దీనికీ స్త్రీ జనోద్ధరణకీ సంబంధం ఏమిటో—నాకంతుపట్టడంలేదు.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

పి. ఆర్; పి. ఎన్. — ఇల్లెందు

గాంధీ గొప్పవాడా ? భగత్‌సింగ్ గొప్పవాడా ?

★ ఎవరి ధోరణిలో వాళ్ళు — ఇద్దరూ గొప్పవాళ్ళే.

మీరు ఈ మధ్య కొన్ని ప్రశ్నలకు చాలా తెలివిగా సమాధానాలిస్తూ తప్పించుకుంటున్నారు ?

★ దాన్నే — బ్రతక నేర్వడం అంటారు !

ఎన్. పి. హెచ్. – ఉదయగిరి

ఈ సమాజంలో ప్రతి ఆడదీ నడివీధుల్లో ఒంటరిగా తిరగాలంటే ?

★ ఎందుకబ్బా — అంత నడివీధిని ఒంటరిగా నడవడం ?! నా కర్థమై చావటం లేదు ... పబ్లిక్ లైటింగు బాగు పరచాలి.

ఐ. ఎస్. ఆర్. – రాజేంద్రనగర్

రాజకీయ నటులకు, సినిమా నటులకు తేడా ఏమిటి కెరా గారూ !

★ ఏంలేదు వారు ప్రజల ముందు, వీరు ప్రేక్షకుల ముందు—అంతే !

ప్రేమిచ్చేవారికి మీరిచ్చే సలహా ?

★ జాగ్రత్త—అని— (పాటిస్తారని) కాదు!

జె. ఎస్. ఎమ్. — వరంగల్

మీకు సంగీతం అంటే యిష్టమా ? కర్నాటక సంగీతంపై మీ అభిప్రాయం ?

★ ఇష్టమే. తమిళనాట వుండడం వల్లనో ఏమో — కర్నాటక సంగీతం అంటే సదభిప్రాయం వుంది. మరీ మన సినిమా వాళ్ళు హేళన చేసినట్టు — కర్ణకఠోరంగా వుండదు వికారంగానూ వుండదు. వినడం అలవాటు చేసుకోవడంలో వుంది అంతే. చెవులు బద్దలుచేసే డిస్కోలూ, బూతు పాటలూ పెట్టుకుని 'రసిచ్చే' అలవాటులా — ఇదీను !

పి. ఆర్. ఎమ్. – సిద్దిపేట

గురువు లేకుండా విద్య అబ్బడం అసాధ్యం అంటారు. నిజమా ?

★ కాదు గురువుల స్థానం ఆంధ్రలో గైడ్సు ఆక్రమించుకున్నాయి.

కె. ఏ. ఆర్. – దోర్నకల్

వరకట్నం పేరిట జరుగుతున్న హత్యాచారాలకి అంతం ఎప్పుడు ?

★ అమ్మాయిల నెత్తిన యింత రూపాయో అర్థో పెట్టి వదుల్చుకోవలసిన అవసరం లేదని— తల్లి తండ్రులు గ్రహించినప్పుడు కట్నం లేకుండా ఎన్నో వివాహాలు జరుగుతూనే వున్నాయి. కాని ఏంలాభం ? దుర్గంధం త్వరగా వ్యాపించినట్టు—అన్పిస్తుంది — అలాగే కట్నం అడిగేవాళ్ళ సంఖ్యాను.

ఎన్.ఎన్. — తిరుపతి

మీరు వ్యంగ సమాధానాలు మాని సూటి సమాధానాలిస్తే బాగుంటుందేమో ?

★ ఎవరికి ?!

★

మే 16న బొంబాయిలో డా. యలమంచిలి శివాజీకి జాన్‌డాల్వీ అవార్డు బహూకరించిన సందర్భంగా సభకి అధ్యక్షత వహించిన శ్రీ నాని పాల్కీవాలా డా. శివాజీతో కరచాలనం చేస్తున్నదృశ్యం. శ్రీమతి మెహెర్ మసానీ, శ్రీ మినూ మసానీలని కూడా చిత్రంలో చూడవచ్చు.





'మానవుడే మహనీయుడు'లో అక్కినేని, రాధ

సినిమా విశేషాలు

జి.వి.జి.

"కిరాయి అల్లుడు"లో కొంతెమ్మ షరతులు

రమేష్ (కృష్ణ)ను రాధ (జయసుధ) ఒక డిలోకి తీసుకొచ్చి, "చూశారుగా మా ఇంటి రిస్థితి ?" అంది

"చూశాను ! ఇక చూపిస్తా నా తడాఖా!" ంటూ చిటిక వేశాడు రమేష్.

"ఆఁ. చూపిద్దురుగానిలెండి — ముందు ను చెప్పే కండిషన్స్ జాగ్రత్తగా వినండి. ఆ బగ్గురు శనిగాళ్ళు ఈ ఇల్లు వదిలి పోయే రకే మీరు ఇక్కడ ఉండేది."

"ఆఁ.. అదేమిటండీ ! ఉద్యోగం అని తీసుకొచ్చి మరీ ఇంత టెంపరరీ జాబా ఇచ్చేది?"

"అంటే — పర్మనెంట్‌గా ఇక్కడే సెటిల్ అయిపోదామనా మీ ఉద్దేశం ? నీళ్ళు నములకండి. మీ కష్టానికి తగ్గట్టు కిరాయి ముట్టచెబుతానుగా ?"

"అబ్బా ! కిరాయి అని మరీ డౌన్ రేట్‌గా మాట్లాడకండి. ఏదో ప్రెసెంటేషన్ అనండి. ప్రేమ కానుక అనండి."

"ఇష్ — అధిక ప్రసంగం.. నెక్స్ట్ కండిషన్ మీరు ఈ మేడ దిగి కిందికి రాకూడదు. కాఫీ, టిఫిన్, భోజనం అన్నీ

"కిరాయి అల్లుడు"లో కృష్ణ, జయసుధ



మాడా, ప్రభ "రామరాజ్యం వచ్చింది"



ఇక్కడికే వస్తాయి.''

''వెరీ గుడ్! అవే వస్తాయా లేక మీరు తీసుకొస్తారా ?''


''ఎవరు తెస్తారనేది మీకనవసరం. అవి మాత్రం వస్తాయి. మూడో కండిషన్... వాళ్ళు చూస్తున్నప్పుడు మాత్రమే నాతో ప్రేమ నటించాలి ''

''ఓకే, డార్లింగ్ ! మీ కండిషన్లు మీరు చెప్పారు. మరి నా కండిషన్లు కూడా విన్నడి, నాకు అర్లీ మార్నింగ్ ఆరు గంటలకి బెడ్ కాఫీ కావాలి. య్యైట్ ఓ క్లాక్‌కి బ్రేక్‌ఫాస్ట్. మెను



సుమన్, విజయశాంతి ''దేశంలో దొంగలు పడ్డారు''

నళిని ''ఇంటిగుట్టు''



ఏం లేదు — వెరీ సింపుల్. ఆరు పెసరట్లు, ఎనిమిది ఇడ్లీలు, మూడు దోసెలు, ఆరు పూరీలు . ఇక లంచ్ — టూ ప్లేట్స్ మటన్ బిర్యానీ, టూ ప్లేట్స్ ఫిష్ కర్రీ, వన్ ప్లేట్ ప్రాన్ మసాలా, వన్ ప్లేట్ పోర్క్... ఇకపోతే నైట్ డిన్నర్. చికన్ సూప్, చికన్ ఫ్రయ్డ్ రైస్. చికన్ మసాలా, తాండూరీ చికన్ అండ్ గడ్డ పెరుగు. . వాల్లెండి — అసలే డైటింగ్‌లో ఉన్నా.''

అంతవరకు అవాక్కయి వింటూన్న రాధ ''మీ లిస్టు చూస్తుంటే లంకణాల రోగేమో అనిపించింది వస్తా,'' అంటూ ఆ గదిలోంచి బయటకు నడిచింది.

ఎం; బాలయ్య బి ఇ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో పద్మాలయా స్టూడియోస్ సమర్పించే అమృతా ఫిల్మ్స ''కిరాయి అల్లుడు'' చిత్రానికి అలపర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు నిర్మాతలు. మన్నవప్రసాద్ సహ నిర్మాత. మే 31న విడుదల.

కట్టా సుబ్బారావు దర్శకత్వంలో వి. కె. ఇంటర్నేషనల్ చిత్రం

''నాన్ పాడుం పాడల్ — అనే తమిళ హిట్ చిత్రాన్ని తెలుగులో తీస్తున్నాం,' అన్నారు వేగి విజయకుమార్. సుహాసిని మోహన్, శరత్‌బాబు, రాజేష్. ప్రభాకరరెడ్డి వేలు, శ్రీలక్ష్మి, గీత, ఒక ప్రముఖ హీరో పాల్గొంటారు. ఇళయరాజా సంగీతం, రాజరాజన్ ఛాయ, తరణి శిల్పం, భాస్కరన్ కూర్పుతో వే రామకృష్ణ, జగదీష్ నిర్వహణ బాధ్యతల వహిస్తారు. ''మే 25 నుండి 30 వరక పాటలు రికార్డ్ చేస్తాం. జూలై 1 నుం 10 వరకు మొదటి షెడ్యూల్ జరుగుతుంది తదుపరి షెడ్యూల్ ఆగస్ట్ 25 నుం సెప్టెంబర్ 15 వరకు పూర్తిగా ఔట్‌డోర్‌లో జరుగుతుంది,'' అన్నారు ఈ చిత్ర సమర్పకుల వేగి బాబూరావు.



"ఈ తీర్పు ఇల్లాలిది"లో మోహన్‌బాబు

"లింగడు — రామలింగడు"లో డేంజర్ లైట్

గజదొంగ డేంజర్ లైట్ మల్లే ఉన్న లింగడ్ని రామలింగడు డొక్కుకారుకి కట్టి లాక్కొస్తున్నాడు. ఎన్నో హత్యలు, దోపిడీలు చేసిన డేంజర్ లైట్ పట్టుబడిపోయాడన్న ఆనందంతో ఆ కారు వెనుక కొందరు వస్తున్నారు. ఇంతలో పి. ఐ. డి. శశికుమార్ ఆ కారుకు ఎదురుగా తన మోటార్‌బైక్‌ని అడ్డుపెట్టి ఆపాడు.

"ఏయ్, మిస్టర్! బైక్ తియ్! నేను జయసింహాను," అన్నాడు రామలింగడు

"ఏమిటిదంతా?" శశికుమార్ అడిగాడు.

"మహాబలుడి సింహగర్జన."

"ఎవరు నువ్వు?"

"బందిపోటు దొంగ, గుండెలు తీసిన మొనగాడు అయిన డేంజర్ లైట్‌ని పట్టిన బొబ్బిలి పులిని... తప్పుకో!"

శశికి సందేహం కలిగింది. కారు వెనుక కట్టివేయబడి ఉన్న శాల్తితో "డేంజర్ లైట్ నువ్వేనా? వాడి చేతిలో పట్టుబడిపోయావా? ఇంతవరకు నువ్వు ఎన్ని హత్యలు చేశావ్?" అన్నాడు.

"లక్ష... రూపాయలు... కాదు కాదు," అంటూ ఆ శాల్తి తడబడ్డాడు.

"ఓహో! లక్ష రూపాయల కోసమా?" అంటూ శశికుమార్, బలంగా కొట్టేసరికి రామలింగడు కిందపడి, "అంధా కానూన్‌లో అమితాబ్బచన్‌లా కొట్టావయ్యా!" అన్నాడు.

శశి మరింత రెచ్చిపోయాడు "అసలు ఎవరయ్యా మీరు?" అడిగాడు

"నా పేరు లింగడు.'

"నా పేరు రామలింగడు."

"ఓహో! మీరేనా?" అంటూ శశి "మీరెక్కడ ఉండేది?" అని అడిగాడు.

"లింగడు — రామలింగడు" రాజేశ్వరి, జయమాలిని





"నీ బుర్ర నే గోకుతాగానీ
చెయ్యి తియ్యవయ్యా బాబూ
సినిమా కనిపించటంలేదు!"

"మాయా లోకంలో," అన్నాడు లింగడు.

"ఏం చేస్తారు?"

"యమగోల," అని జవాబిచ్చాడు రామలింగడు.

దాంతో మతిపోయినట్లయింది శశికుమార్‌కు. "మీతో మాట్లాడ్డం నావల్ల కాదు," అంటూ బైక్‌లో బయలుదేరాడు.

ఇంతలో డొక్కుకారు రయ్‌మని పల్లంలోకి పోతూంటే దాని వెంటపడ్డారు లింగడు, రామలింగడు.

శ్రీ విజయలక్ష్మి క్రియేషన్స్ సమర్పించే శ్రీ భూలక్ష్మి కంబైన్స్ "లింగడు — రామలింగడు" చిత్రాన్ని పింజల భాస్కరరావు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో ఎ. వి. సత్యనారాయణ, అశ్వత్థనారాయణ, లక్ష్మినారాయణ, డి. వి. రాజగోపాల్ నిర్మించారు. జూన్ విడుదల.

కొత్త పంపిణీ సంస్థ 'వినోదా ఫిలిమ్స్'

సికింద్రాబాద్‌లో బి. కృష్ణాజీరావు, డాక్టర్ ఆర్. వి. రావు నెలకొల్పిన వినోదా ఫిలిమ్స్‌కు ఏప్రిల్ 16న రామకృష్ణా థియేటర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ నందమూరి జయకృష్ణ ప్రారంభోత్సవం గావించారు ఈ సంస్థ ద్వారా కె. విశ్వనాథ్ దర్శకత్వంలో డాక్టర్ వి. మధుసూధనరావు నిర్మించే స్వాతి కళామందిర్ వారి తొలిచిత్రం, ఎ కోదండరామిరెడ్డి దర్శకత్వంలో డాక్టర్ ఆర్. వి. రావు నిర్మించే శిల్పి ఆర్ట్స్ తొలి చిత్రం వగైరాలు పంపిణీ చేయబడతాయి.



'భారతంలో శంఖారావం'లో

కృష్ణంరాజు, జయసుధ

కోటారెడ్డి "తమాషాలో తదిగినతోం"

''ఫుల్ లెంగ్త్ కామెడీ,'' అన్నారు ఎం. ఎస్ కోటారెడ్డి. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో జూలైలో చిత్రీకరణ మొదలయ్యే ప్రసాద్ ఇంటర్నేషనల్ ఫిలిమ్స్ ''తమాషాలో తదిగినతోం''లో నరేష్, బాలాజీ ఆదిగా గలవారు పాల్గొంటారు. కాశీ విశ్వనాథ్ సంభాషణలు, శంకర్ గణేశ్ సంగీతం, ఒ. ప్రకాష్ ఛాయ, రమేష్ రెడ్డి కూర్పుతో శ్రీమతి నాగయ్య నిర్మాత. ''జూన్‌లో పాటలు రికార్డవుతాయి,'' అన్నారు ఈ చిత్రాన్ని సమర్పించే సి. హెచ్. నాగయ్య

వాసంతి నిర్మించే భాగ్యరాజ్ చిత్రం "మాయదారి మొగుడు"

''మాంచి సస్పెన్స్‌తో సాగే ఫామిలీ సెంటిమెంట్ సబ్జెక్ట్,'' అన్నారు అలనాటి నటీమణి, నిర్మాత వాసంతి, బి. యె .. ఈమె ''భలేపాప, మేమూ మీలాంటి మనుషులమే, అత్తకు తగ్గ అల్లుళ్ళు'' చిత్రాల అనంతరం భాగ్యరాజ్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంతోపాటు ప్రధాన పాత్రను నిర్వహించిన లావణ్య ఆర్ట్స్ ''మాయదారి మొగుడు'' చిత్రాన్ని మే ఆఖరి వారంలో విడుదల చేస్తున్నారు. సత్యకళ, సువర్ణ, కరాటే మణి తక్కిన నటవర్గం. పూర్తిగా ఊటీలో తయారైన ఈ చిత్రానికి ఆత్రేయ గీతాలు, ఇళయరాజా సంగీతం, నరసింహారావు కూర్పు తెరవెనుక హంగులు.

"రౌడీలకు సవాల్"

''జూన్ మొదటి వారంలో విడుదల చేస్తున్నాం,'' అన్నారు కె. సత్యనారాయణ. ఈయన సమర్పించే శ్రీ రాఘవేంద్ర ఆర్ట్ మూవీస్ వారి పై చిత్రంలో రజనీకాంత్, రాధ, స్మిత, వనిత ముఖ్య భూమికలు నిర్వహించారు. వసంతకుమార్ మాటలు, రాజశ్రీ పాటలు. శంకర్ గణేష్ సంగీతంతో కె. నాగేశ్వరరావు నిర్మాత.

"అందరికంటే మొనగాడు"

''సెంటిమెంట్‌తో పాటు సస్పెన్స్, ఆక్షన్ పుష్కలంగా ఉండే చిత్రం,'' అన్నారు ఎడిటర్ టి. కృష్ణ. ఈయన దర్శకత్వం వహించే శ్రీ అజంతా ప్రొడక్షన్స్‌వారి పై చిత్రంలో కృష్ణ, జయసుధ, ప్రభాకర్‌రెడ్డి, నూతన్ ప్రసాద్, నరసింహరాజు, రాజేష్, రాజేంద్ర ప్రసాద్, ఈశ్వరరావు, రాజ్యలక్ష్మి, జయమాలిని, శ్రీలక్ష్మి, లక్ష్మీకళ, మహిజ నటిస్తారు. ''ఆగస్ట్ 6న పాటల రికార్డింగ్‌తో ప్రారంభిస్తున్నాం. ఫస్ట్ షెడ్యూల్ అక్టోబర్ 11 నుంచి 31 వరకు జరుగుతుంది. డిసెంబర్‌కు షూటింగంతా ముగించి, వచ్చే జనవరిలో విడుదల చేయాలనుకుంటున్నాం,'' అన్నారు నిర్మాత శ్రీ రామ్‌రెడ్డి. జి. ప్రభాకర్ మాటలు, కె. వి. మహదేవన్ స్వరకల్పనలో సి. నారాయణ రెడ్డి, వేటూరి పాటలు రాస్తారు. పుష్పాల గోపీకృష్ణ ఛాయ, తోట శిల్పంతో ఎం. లక్ష్మారెడ్డి సమర్పిస్తారు.




''రౌడీలకు సవాల్''లో రాధ

తెలుగులో ఊరుకి ఉపదేశం

నూతన నిర్మాణ సంస్థ ''లక్ష్మీదుర్గా పిక్చర్స్'' వారు తమిళంలో విజయవంతముగా ప్రదర్శింపబడిన ''ఊరుకి ఉపదేశం'' చిత్రాన్ని తెలుగులో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం : తాతినేని ప్రసాద్. నిర్మాతలు : రజని, సరోజిని. త్వరలో లక్ష్మి ఫిలింస్ ద్వార ఈ చిత్రం విడుదల అవుతుంది.

''మాయదారి మొగుడు'' భాగ్యరాజ్, సత్యకళ





'దండ యాత్ర'లో జయసుధ, శోభన్‌బాబు

శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ చిత్రం

"అన్ని తరగతుల ప్రేక్షకులనూ ఆకట్టుకునే ఇతివృత్తం," అన్నారు కె. ఎస్. ఆర్. దాస్. ఈయన దర్శకత్వంలో మోహన్‌బాబు ప్రధాన పాత్ర నిర్వహిస్తూ నిర్మించే సై సంస్థ 4వ చిత్రం షూటింగ్ ఏప్రిల్ 29న మొదలైంది. మురళీమోహన్, మాధవి, బెంగళూరు జయమాల, ప్రభాకరరెడ్డి, గుమ్మడి, నూతన్ ప్రసాద్, కె. ఆర్. విజయ నటిస్తున్నారు సత్యానంద్ సంభాషణలు, వేటూరి గీతాలు, శంకర్ గణేశ్ సంగీతం, పుష్పాల గోపీకృష్ణ ఛాయ, సూర్యనారాయణ శిల్పం తెరవెనుక హంగులు. "మొదటి షెడ్యూల్ మే 19 దాకా. జూన్ 17 నుంచి 30 వరకు జరిగే తదుపరి షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది. ఆగస్ట్ రిలీజ్," అన్నారు మోహన్‌బాబు.

ఎం. మల్లికార్జునరావు దర్శకత్వంలో నరేష్, స్వప్న

"సింగపూర్, కౌలాలంపూర్‌లో ఏప్రిల్ 27 నుంచి మే 26 వరకు మొత్తం షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు ఎం. మల్లికార్జునరావు. ఈయన దర్శకత్వంలో కె. జి మోహన్, పి ఎ పద్మనాభం నిర్మించే చిత్రంలో నరేష్, స్వప్న, రాజ్‌కుమార్, గుమ్మడి, రమణమూర్తి, శివప్రసాద్, వేలు, కాకినాడ శ్యామల ఆదిగా గలవారు పాల్గొంటున్నారు. డాక్టర్ బాలకృష్ణ కధ, సత్యానంద్ మాటలు, వేటూరి పాటలు రాశారు. చక్రవర్తి సంగీతం, పి. దేవరాజ్ ఛాయ, రాయప్రోలు గోపి సహకార దర్శకత్వం, సలీం నృత్యాలతో డి. శ్రీరామమూర్తి నిర్మాణ సారధి.

"రామాయణంలో భాగవతం"

డైరెక్టర్ తాతినేని ప్రసాద్ నిగర్వి నిండుకుండ. ఈయన సెట్‌లో ఏ విధమైన టెన్షన్, కన్‌ఫ్యూషన్ లేకుండా ప్రశాంతంగా వుంటుంది వాతావరణం. షూటింగ్ చకచకాసాగిపోతూంటుంది. ఇది ఈయన గురించి నిర్మాతలు నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ వెలిబుచ్చే ఏకాభిప్రాయం. సినిమా ప్రాతికేయుల పట్ల ఉన్న గౌరవం కొద్దీ ఈయన ఏప్రిల్ 22 నుంచి దర్శకత్వం నెరపే లక్ష్మీ దుర్గా ఫిలింస్ వారి "రామాయణంలో భాగవతం" చిత్రానికి 'సితార' ఉమామహేశ్వరరావు కెమెరా చలనం, 'జ్యోతిచిత్ర' పసుపులేటి రామారావు ప్రారంభ ఫలకాన్ని కొట్టడంతో ప్రారంభోత్సవం గావించారు. రెండు షెడ్యూల్స్‌తో చిత్రీకరణ ముగిసే ఈ చిత్రంలో చంద్రమోహన్, భానుప్రియ, జగ్గయ్య, గొల్లపూడి, శుభకర్, నాగేంద్ర, అన్నపూర్ణ ఆదిగాగలవారు పాల్గొంటున్నారు. విశు కధకు గణేశ్‌పాత్రో సంభాషణలకర్త. వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త. నవకాంత్ ఛాయ, కొండపనేని రామలింగేశ్వరరావు శిల్పం, కె సత్యం కూర్పుతో తాండవకృష్ణ, కృష్ణమూర్తి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. డాక్టర్ సి. వి. రాంప్రసాద్ ఎం. డి. సమర్పించే ఈ చిత్రానికి రజని, సీత నిర్మాతలు. మాదాల రామయ్య నిర్మాణ సారధి.

సత్యనారాయణ చిత్రంలో చిరంజీవి

"డైరెక్టర్ శ్రీధర్ తమ్ముడు సి. వి. రాజేంద్రన్ డైరెక్ట్ చేసిన ఒక తమిళ చిత్రం గొప్ప హిట్ అయింది. దాన్నే తెలుగులో తీస్తున్నాం. రాజేంద్రనే దర్శకుడు," అన్నారు కైకాల సత్యనారాయణ ఈయన సమర్పించే అజయ్ క్రియేషన్స్ చిత్రంలో చిరంజీవి హీరో. వి. రఘు నిర్మాణ సారధ్యంలో కె. లక్ష్మీనారాయణ, కె. వి రామారావు నిర్మాతలు. జూలైలో సెట్‌కు వెళ్తుంది.

"పాపి కొండలు"లో మోహన్‌బాబు, మంజుల



హిందీ చిత్ర విశేషాలు!

★ అమితాబ్‌బచ్చన్ తండ్రి తేజ్ బచ్చన్ గొప్పకవి. చిన్నప్పుడు "నేను కూడా పొయెట్రీ రాస్తానమ్మా," అంటే అమితాబ్ తల్లి "ఒక కుటుంబానికి ఒక కవి చాలులే," అందట. ప్రమాదానికి లోనై నర్సింగ్‌హోమ్‌లో ఉన్నప్పుడు మాత్రం ఒకసారి అమితాబ్ కలానికి పని కల్పించాడు. ఆ హిందీ కవితకు తెలుగు పరివర్తనం:

"డిష్యుం డిష్యుం
డిష్యుం డిష్యుం
ఏమి ధ్వని ?
ఇది ఏమి ధ్వని ?
చుక్ చుక్ చిక్ చిక్
చిక్ చిక్ చుక్ చుక్
ఏమి ధ్వని
ఇది ఏమి ధ్వని ?
దిన్ చక్ దిన్ చక్
చక్ చక్ చక్ చక్
ఏమి ధ్వని
ఇది ఏమి ధ్వని ?

★ దాదాపు 23 ఏళ్ళ క్రితం దక్షిణ బెంగాల్‌లోని రాణా ఘాట్ వద్ద ఒక బెంగాలీ చిత్రం ఔట్‌డోర్ షూటింగ్ జరుగుతోంది. అప్పటి పేరుమోసిన హీరో అనిల్‌చటర్జీ ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఒక ఎనిమిదేళ్ళ అమ్మాయి ఆయన వద్దకు వచ్చి, "నన్ను సినిమాలో చేర్పిస్తారా? నేను బాగా పాడుతాను కూడా," అంది. ఆయన పాడమన్నాడు. ఆ అమ్మాయి పాడుతూండగా ఆమె తండ్రి వచ్చి, "తూర్పు పాకిస్తాన్ నుంచి మేం వచ్చాం. ఇక్కడ కాందిశీకుల శిబిరంలో ఉంటున్నాం. మా అమ్మాయిని చదివించే శక్తి లేదు నాకు. ఏదైనా వేషమిప్పించి పుణ్యం కట్టుకోండి," అని ప్రాధేయ పడ్డాడు. ఆ అమ్మాయే నేటి మేటి హిందీ నటి రాఖీ. ఇటీవల ఈమె ఒక చిత్రం షూటింగ్‌కు కలకత్తా వెళ్లినప్పుడు ఆ నటుని కలుసుకోవడం జరిగింది. అపర్ణాసేన్ హిందీ, బెంగాలీ భాషల్లో దర్శకత్వం నెరపే "పరామా" అనే చిత్రంలో రాఖీతో పాటు ఆ నటుడూ ఓ వృద్ధ పాత్ర ధరిస్తున్నాడు. ఆయన్ని తను 23 ఏళ్ళ క్రితం కలుసుకున్న విషయాన్ని రాఖీ చెప్పింది. "అరే! నాకు గుర్తులేదే! నేడు నువ్వింత పెద్ద స్టార్‌వి అయినా ఆ విషయాన్ని ఇంకా మరచిపోకుండా ఉండడం నీ ఉత్తమ సంస్కారానికి నిదర్శనం," అన్నాడట ఆ నటుడు.

★ "తుషారం" మలయాళం చిత్రం లోగడ హిందీలో డబ్ చేయబడింది. అయినా ఇప్పుడా చిత్రం మళ్ళీ శిబ్బుమిత్ర దర్శకత్వంలో హిందీలో పునర్నిర్మించబడుతోంది. రాజేష్‌ఖన్నా సరసన టీనామునీమ్, పద్మిని కొల్హాపురి నాయికలు.

★ ఇంగ్రిడ్ బెర్గ్‌మన్ నటించిన "ఫర్ హూమ్ ది బెల్ టోల్స్" ఆంగ్ల చిత్రాన్ని దిలీప్‌కుమార్ 21 సార్లు – రోజుకి మూడు ఆటల చొప్పున వరుసగా వారం రోజులపాటు చూశాడట. ఈయన మిత్రుడు, సుప్రసిద్ధ హాలీవుడ్ నటుడు ఓమర్ షెరీఫ్ మనదేశంలో తయారు చేసే చిత్రంలో ఒక కీలకమైన పాత్రను దిలీప్ నిర్వహిస్తాడట.

సీరియల్

కర్మయోగి

డా|| కె.వి. కృష్ణకుమారి

(గత సంచిక తరువాయి)

పుట్టెడు దిగులుతో వున్న ముదివగ్గులా వుంది తులశమ్మ. నూనె రాసుకుని ఎన్నాళ్లైందో వెండి తీగల్లా వున్న వెంట్రుకలు అస్తవ్యస్తంగా వున్నాయి. మనిషి పాలిపోయి క్షీణించినట్టుంది. కళ్ళల్లో కాంతి చూద్దామన్నా కన్పించటంలేదు. జీవితంలో ఆశ అనేదీ, ఆనందం అనేదీ కనుచూపుమేరలో లేనట్టున్నాయి చూపులు.

"అమ్మా—"

కృష్ణారావు వంక నిర్లిప్తంగా చూసింది.

"అన్నీ తెల్సున్నదానివి నువ్వే ఇలా ఐపోతే ఎలాగమ్మా—"

తులశమ్మ కళ్ళల్లో చివ్వున నీళ్ళు చిమ్మాయి.

"నువ్వుకూడా ఇంత సామాన్యురాల్లా అందర్లా దిగులు పడుతూ కూర్చుంటే—మిగతా వాళ్ళని వోదార్చగలిగేది ఎవరమ్మా."

కడుపులోంచి దుఃఖం పెల్లుబికి వస్తోంది తులశమ్మకి.

"చెప్పమ్మా."

కళ్ళ నీళ్ళు ధారలు కడుతుంటే—నిస్సహాయంగా తలవంచుకుంది.

"...అన్నీ తెల్సిన కొడుకుముందు—తలెత్తుకోవాల్సింది పోయి ... ఈ స్థితికి వచ్చాన్రా... అన్నీ తెల్సున్నవాడివి నువ్వే చెప్పు...ఇప్పుడు ఇప్పుడు నేనింతకన్నా ఎలా ఉండగలను?"

"అమ్మా—"

అతి ప్రశాంతంగా — ఏమీ జరగనట్టు చూస్తున్నాడు కొడుకు.

సర్వం నాశనమై పోయినట్టు కుళ్ళిపోతోంది తల్లి.

"ఏం చెప్పమన్నావురా—పద్మిని ఈ ఇంట్లో అడుగు పెట్టటంతో మన కష్టాలన్నీ పోయినట్టే ఆనందపడిపోయానురా. పెళ్ళికి వొప్పుకోవనుకున్న నువ్వు పెళ్ళి చేసుకున్నావు. బంగారు బొమ్మ ఇంటికి వచ్చింది. ఈ ఇల్లు నిలబడుతుందనుకున్నాను. పసివాడి నవ్వులతో—ఆటలతో—మన ఇల్లుకూడా అందరి ఇళ్ళలాగే వుంటుందనుకుని ఎంతో ఆశపడ్డాను — కృష్ణా—చివరికి జరిగిందేమిటిరా?—ఇలా ఎందుకైందిరా?—ఇంత ఐశ్వర్యముంది—ఇంటిల్లపాదీ ఆ భగవంతుడ్ని నమ్ముకున్న వాళ్ళం—ఐతే—ఐతే ఏం లాభం?—ఒక్కరోజైనా కడుపునిండా భోజనం చేస్తున్నామా?—కంటి నిండుగా నిద్రపోయే యోగ్యత మనకుందా? మనంత దురదృష్టవంతులు ఇంకెవరుంటారురా కృష్ణా—"

"........."

"మనుష్యులమై పుట్టినందుకు కనీసపు కోరికలు కూడా తీరక పోటానికి మనమేం పాపం చేశామురా—ఆ దేముడ్నే నమ్ముక్కూర్చున్నాం—ఏమైంది?—నీ రాత ఏమైంది?—అమాయకురాలు లక్ష్మి రాతేమైంది?. చివరికి పద్మిని...పద్మిని..."

కృష్ణారావు మనస్సు కలుక్కుమంది.

తన తల్లి...తనకు కన్పించేదైవం తన ముందే అనాధలా కుమిలి పోతోంది. దిక్కులేని దానిలా నిస్సహాయంగా—పసిదానిలా దూరమైన దానికోసం ఆక్రోసిస్తోంది. తనువుండి కూడా... తను వున్నాకూడా...

తనెంత తప్పు చేశాడు.

ఎంత పొరపాటు చేశాడు.

"అమ్మా—"

కృష్ణ వొళ్ళో తలపెట్టుకుని భోరున ఏడ్చేసింది తులశమ్మ.

"...ఆ దేముడ్ని నమ్ముకున్నందుకేరా... ఇలా ఐంది — అందరిలా వుంటే—అందరిలాగే వుండేవాళ్ళం. ఎవరికేమపకారం చేశాం?—ఎవరికైనా ద్రోహం చేశామా? చెప్పరా కృష్ణా—చెప్పరా—ఎందుకు భగవంతుడింత అన్యాయం చేస్తున్నాడురా మనకీ—"

"భగవంతుడు అన్యాయం చేస్తాడా అమ్మా. మనమూహించుకుంటున్న కష్టాలన్నిటికీ—అతనే కారణమంటావా?"


"కాదా?— కాదా నాయనా?— పెద్దాడికి ఏమంత వయసు మీరి పోయిందని? పిల్లాజెల్లాతో హాయిగా వుండాల్సిన వయసే అది—ఎంతమంది మంచానపడితీసుకుంటున్న వృద్ధులుకూడా బ్రతికి వుండటం లేదు ? పద్మిని— పద్మిని మటుకు — ఎంత చిన్నపిల్ల. దీనికి ముందు ముందు ఎంత జీవితముంది ?— పసిది— జీవితం మీద ఎన్ని ఆశలు పెట్టుకుందో—కష్టాలన్నీ తీరాయనుకున్న సమయానికి— ఆ భగవంతుడు మృత్యురూపంలో వచ్చి తీసుకు వెళ్ళటమేమిటి ?— కృష్ణా— ఆ కృష్ణుడ్ని ఇంకా ఎందుకురా నమ్ముతావూ — ఇంకా ఎవరు పోవాలనిరా— ఈ పూజలూ—"

వయసును మించిన వార్ధక్యంతో —

వార్ధక్యం పెంచిన పసితనంతో ఇంకా ఏడుస్తూనే వుంది తులశమ్మ.

"అంధకారంలో దీపాన్ని పూర్తిగా ఆర్పేసు

జరిగిన కథ — 15 : తులశమ్మగారు గత జీవితాన్ని శ్రీహరిగారితో చెప్పి హృదయభారాన్ని తగ్గించుకొంటారు. కృష్ణారావు తల్లి ఆవేదనని చూసి చలిస్తాడు. తల్లి కోరిక ప్రకారం పెళ్లి చేసుకొనుటకు అంగీకరిస్తాడు కృష్ణ. కృష్ణ పెళ్లి పద్మినితో నిశ్చయమవుతుంది. కృష్ణారావు, పద్మినిల వివాహం జరిగిన కొద్దిగంటలకే పద్మిని తల్లి యశోదమ్మ మరణిస్తుంది. యశోదమ్మ కర్మకాండ అనంతరం పద్మినితో కూడ కృష్ణప్రియను తమ దగ్గరకే పంపమని రామచంద్రరావుకి చెప్పి తులశమ్మ కృష్ణారావుతో కలిసి తమ ఊరు వెళ్లిపోతారు. పద్మిని, కృష్ణప్రియల రాకతో తులశమ్మగారి ఇంట్లో చైతన్యం వస్తుంది. కృష్ణారావు చర్చలకు అందరూ ఆకర్షితులవుతారు. శోభనం నాటి రాత్రి మూర్ఛవచ్చి పడిపోయిన పద్మినికి సేవలు చేసి అనునయిస్తాడు కృష్ణ. గుండె నొప్పితో బాధపడుతున్న పద్మినిని మనస్సుకు ఉల్లాసం కలిగించే మాటలతో వూరడిస్తాడు కృష్ణ. మనుమడి కోసం తాపత్రయ పడే తులశమ్మను చూసి పద్మిని కృంగిపోతుంది. కృష్ణారావుని గోష్టిలో అల్లరిపాలు చేయాలనుకున్న నారాయణ ప్లాను తల్లక్రిందులవుతుంది తులశమ్మకు మనుమడిని ఎత్తుకోవాలనే కోరిక రోజు రోజుకు బలపడుతోంది. కాని ఆమెకు కృష్ణ వైఖరి ఆందోళన కలిగిస్తుంది. పద్మిని ఆరోగ్యం ఇంకొంచం క్షీణించింది. పద్మిని మంటల్లోపడి మరణిస్తుంది. పద్మిని మరణం ఆ ఇంటి వాతావరణంలో పూర్తి మార్పు తెచ్చింది. లక్ష్మి బాధ్యతల విషయం గుర్తుచేయగా తన బాధ్యతల్ని తను నెరవేరుస్తానని వదినకు మాట ఇస్తాడు కృష్ణ.



కుని చేతులారా చీకటిని ఆహ్వానించుకోమంటావా అమ్మా...''

''.................''

''ఎవరి స్థితికి ఎవరు కర్మలు? ఎవరి చావుకు ఎవరు కారకులు? భగవంతుడు కాలుడే— ఐనా— ప్రాణాన్ని హరించే దెప్పుడు?— ప్రాణాన్ని లాగేసుకునేది ఎవరి దగ్గర నుంచి? అమ్మా ఇంత తెల్సున్న దానివి. అన్నింటికీ 'కర్మ' కారణమని మర్చిపోయావా? ఎవరి కర్మ వారినే మృత్యు రూపంలో నాశనం చెయ్యదా? పద్మిని కాలి చనిపోయింది. అన్నయ్య—అన్నహారాలూ మానేసి— క్షీణించి మరీ చనిపోయాడు — మరొకడు మరొక రకంగా. ఇంకొకడు— హత్య చెయ్యబడి— కారణాలు ఏవైనా — ఎన్నైనా — అవి కర్మననుసరించి జరిగేవి కావా? — తన కర్మ— తన స్థితికి కారణమని— ఇతరులు కేవలం నిమిత్త మాత్రులనీ— ఆ భగవంతుడు కేవలం సాక్షీ మాత్రుడేననీ తెలియదా?— పుట్టిన ప్రతీ ప్రాణీ తనకు మృత్యువు దగ్గరవటం నిజమనీ, సత్యమనీ తెల్సు— ఐతే— ఎప్పుడు ఏ రకంగా—ఏ రూపంలో వస్తుందో— రాగలదో తెల్సున్న వాళ్ళు లక్షకొకరైనా వుంటారా? మనం శ్రీకృష్ణుని నమ్ముకున్నాం — ఇతరుల సుఖాన్ని కోరుకుంటున్నాం—అంత మాత్రాన ఆ భగవంతుడు మన విధిని తప్పించాలనుకోటం — మన విషయంలోనే పక్షపాతాన్ని చూపించి కర్మలను మార్చాలని కోరుకోటం మంచిదా అమ్మా — అదే వాంఛనీయమైతే— ఆ పరమాత్మకి పాండవుల కన్నా దగ్గర వారమా?— చక్రవర్తులై యుండీ — నడివీధిలో భిక్షాటన చెయ్యలేదా? అభిమన్యుని కన్నా ఆప్తులమా? ముక్కుపచ్చలారని పసి వయస్సులోనే ఘోర మరణానికి ఆ శ్రీకృష్ణుడే సాక్షీభూతుడు కాలేదా? తనుమటుకు కర్మకు తలవంచలేదా? విధితో పోరాడి నిలిచాడా?

హృదయంలో భగవంతుడు స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. ఎటువంటి పరిస్థితిలోనైనా నిలబడి నిలద్రొక్కుకోగల ధైర్యాన్ని ఇస్తానంటున్నాడు. కర్మ కబళిస్తున్నా — ధైర్యాన్నిచ్చి కన్నీళ్ళను తుడుస్తానంటున్నాడు. బాధలకు కృంగి కృసించిపోకుండా జీవంతో నిలబెట్టి — మనకుద్దేశింపబడిన కర్తవ్యాలకు మనల్ని కర్తలుగా ఇంకా ఇంకా నిలబెట్టేస్తున్నాడు —

అటువంటి భగవంతుడ్ని నమ్మటం మానెయ్యమంటావా అమ్మా — కావాలని పాత గూట్లో చిక్కుకోమంటావా అమ్మా —''

నీళ్ళింకుతున్న కళ్ళకు కృష్ణరూపం శాంతంగా, అతి ప్రశాంతంగా, అరుదైన తేజస్సుతో కన్పిస్తోంది.

ఎటువంటి కలతల్నైనా కరిగించగల శక్తి ఆ కళ్ళల్లో చూసినకొద్దీ కన్పిస్తోంది.

''...కృష్ణా — నీతో మాట్లాడలేను... మాట్లాడి నెగ్గుకురాలేను. నువ్వు చాలా పెద్దవాడివైపోయావు నాయనా — ఇరవై నాలుగ్గంటలూ — ఆ గ్రంథాలు ముందు పెట్టుకుని నిజంగానే పెద్దవాడివైపోయావు ఆ భగవంతుడ్నే — కన్నతల్లిలోనూ చూడగలుగుతున్నాననీ — అందుకు నా కంటి తడి చూడలేననీ ఒకప్పుడు అన్నావే... ఇప్పుడవన్నీ మర్చిపోయావా నాయనా? — ఆ భగవంతుడు నీ కెక్కువ కావచ్చు. కానీ తల్లిగా నా బిడ్డ నా కెక్కువ కాడా? — ఆ బిడ్డ జీవితం ఈ విధంగా నాశనమైపోయిందన్న దిగులూ విచారం నాకుండదా? — నీద్వారా — ఈ ఇల్లూ, ఈ వంశం వృద్ధిచెందాలనే కోరిక నాకుండదా? — మనింట్లో జరుగుతున్న ఘోరాలు తట్టుకునే విధంగా వున్నాయా నాయనా...''

తల్లి కళ్ళు తుడుస్తూ చిన్నగా నిట్టూర్చాడు కృష్ణారావు.

''...నీలోనేకాదమ్మా — అందర్లోనూ భగవంతుడ్ని చూడటమే నా లక్ష్యం అనుకున్నాను. నా సుఖంకన్నా— నా వారి సౌఖ్యంకన్నా— అందరి సౌఖ్యం కోసం నన్ను నేను అర్పించుకోవాలనుకున్నాను... ఆ తరువాత కర్మయోగ సిద్ధాంతం నన్నమితంగా ఆకర్షించింది. ఆమోదించాను... అమ్మా — సాధారణంగా తల్లులకు పిల్లలమీద వుండే ప్రేమ మోహపరిపూర్ణమైనది. తన పిల్లల్ని ప్రేమించే విధంగా ఇతరుల పిల్లల్ని ప్రేమించగల తల్లులు అరుదు — అధికంగా ప్రేమిస్తూ — అధికంగా మోహాన్ని పెంచుకుని— అతనికోసమూ—అతని సుఖసంతోషాల కోసమూ—

అనుక్షణం తపించే తల్లికి మిగిలేదేముంటుంది ? అతను దూరమైతే — ఆవేదన — అతను చిన్నబుచ్చితే వ్యధ. అతను ఎదురుతిరిగితే పరితాపం. అతను శాశ్వతంగా దూరమైతే — శాశ్వతమైన దుఃఖం... ఇంతేనా ? ఇంతేనా అమ్మా — తల్లికి కావల్సిందీ — తల్లి పొంద వల్సిందీ — ప్రతీ క్షణం — ఇతరులకోసం చస్తూ బ్రతుకుతూ వుండటమేనా పరమార్థం ? — అదేనా మానవజన్మ ఎత్తినందుకు సాఫల్యం ? — మనసును విశాలం చేసుకుని — ఆ ప్రేమనే వృద్ధి చేసుకుని — అందరికీ సమంగా పంచగలిగినప్పుడు మనసును పెంచగలిగినప్పుడు — ఈ స్వార్థానికీ — భేదభావానికీ — సంకుచితత్వానికి తావే వుండదు కదమ్మా —

మనకు నిజమైన ఇల్లేదో — మన నిజమైన ఆత్మబంధువెవరో — గుర్తించగలిగినప్పుడు — ఇటువంటి కన్నీళ్ళకు తావుంటుందా ? — కర్మ సిద్ధాంతాన్ని నమ్మగలిగినప్పుడు — 'నీకీ స్థితి వుంటుందా అమ్మా...''

చాలాసేపు మౌనంగా వుండిపోయింది తులశమ్మ.

ఆ మాతృహృదయం కృష్ణతో రాజీ పడలేక పోతోంది. ఎప్పటికప్పుడు బాధలతో కరిగిపోతున్న ఆ మనస్సు— ఘనీభవించే స్థితికి రాలేక పోతోంది—

కృష్ణారావు వొళ్ళోంచి లేచి మరోవైపుకు తిరిగి గోడవారగా మొహం పెట్టుకు పడుకుం దావిడ.

కృష్ణారావు వచ్చేస్తుంటే లక్ష్మి చిన్నగా అంది.

''అన్నీ విన్నాను. చెప్పటానికీ— వినటానికీ బాగానే వుంది. ఐతే ఎవరెవరికి స్థితి ఏ తవర కుందో—ఆలోచించుకుని చెప్పడం మంచిదయ్యా. ఆవిడకి కావల్సింది పురాణాలు చెప్పే ధైర్య వచనాలు కావు. నిజ జీవితంలో అందరిలా— హాయిగా నవ్వుతూ బ్రతికే జీవితం... అన్నీ తెల్సు నీకు—''

వదిన వంక విచిత్రంగా చూశాడు కృష్ణారావు.

''...రామచంద్రరావుగారు ఎప్పుడొస్తానని వ్రాశారు. ప్రియ గురించి ఆలోచించాల్సిన బాధ్యత కూడా మన మీదుంది...''

అప్పటికే గుమ్మందాటి వెళ్ళిపోయాడు కృష్ణారావు.

*   *   *

కల్యాణికి ఆశ్చర్యం ఆగటం లేదు. ఆ కుర్రవాడెరో నమ్మకంగా చెప్పటమే కాకుండా తన అనుమానాల్నీ తీర్చి మరీ వెళ్ళాడు—

'నిజమా ?— ఇది నిజమా ?'

సాయంత్రం ఆరుగంట లవుతుంటే— య తప్పుతోంది— మనసు వశం తప్పుతోంది— అంతర్గతంగా తనలోవున్న కోరిక నిజంగానే

కర్మయోగి

నిజం కాబోతోందా? అంత అదృష్టమా తనకి? ఇంతకు మించిన అదృష్టమంటూ ఇంకొకటి వుంటుందా? సజ్జలో—పూలూ పళ్ళూ పట్టుకుని వేణుగోపాలస్వామి గుడికి బయులుదేరింది కల్యాణి. సాధారణంగా చీకటిపడే వేళ వరకూ గుడిలో రాకపోకలుంటాయి. వేణుగోపాలస్వామిని ప్రతిష్ఠించి— అంత విశాలమయిన గుడిని కట్టించి ఆదే, కృష్ణారావు ముత్తాత జగన్నాథ స్వామిగారు— గుడికయే సర్వ ఖర్చులూ, వంశ పారంపర్యంగా వచ్చే పురోహితుల పోషణ భారం అప్పట్నుంచీ ఇప్పటివరకూ, ఆ కుటుంబమే భరిస్తోంది. వేదాంత గోష్ఠులకూ, పురాణ కాలక్షేపాలకూ, సత్కథా పఠనాలకూ— పుణ్య కార్యాలకు అనువుగా— గుడి వెనుక భాగంలో— కళాత్మకంగా మలచిన విశాలమైన ఆవరణవుంది.

నిర్వేదం

-దిలావర్

ఈ సమస్యల గడ్డం
ఎప్పటి కప్పుడు మొలవకా మానదు
ఏదో ఒక మొండి బ్లేడుతో
మనం గీక్కోకా తప్పదు !
రోజూ చూసే బతుకు న్యూస్‌పేపర్లో
గానుగెద్దు వార్తలు తప్ప ఏముంటాయని ?
కన్నీళ్ళలో కలిపిన కష్టాల చద్దిమెతుకులన్నా
పడందే
యీ కడుపు ఎటూ నిండదు.
రొప్పుతూ రోజుతూ ఎంత పరుగెత్తినా
ఎప్పుడో అప్పుడు — ఎక్కడో అక్కడ ఆగకా
తప్పదు !
ఈ సుఖాల చేపలేమో
ఏ కలల వలలకూ చిక్కవు.
ఏ మాత్రం కనురెప్పల సందు దొరికినా
యిట్టే తుర్రుమంటాయి......
అంతులేని సీరియల్ లాంటి
ఈ రొటీన్ నుండి, రొచ్చునుండి
అశాంతి నుండి, అవమానాల నుండి
కొన్ని నిమిషాలనైనా బతికించుకుందుకు
ఏ చల్లని మనసు తీరానికో పారిపోయి
సేదతీర్చుకుందాం రా !
ఎగరలేని గతకాలపు మధురక్షణాలకు
జ్ఞాపకాల రెక్కలు కడదాం రా !
కొంచెం చిరుచేదు
కొంచెం పుల్లటి తీపి
కలబోసిన వెచ్చవెచ్చని అనుభూతుల్ని
గుండె ఫ్లాస్కుల్లోంచి
వెన్నెల కప్పుల్లోకి వొంపుకొని
తనివితీరా సిప్ చేద్దాం రా !

ఆ ఆవరణ పై భాగాన, కృష్ణార్జునుల గీతోపదేశ సన్నివేశాలన్నీ జగన్నాథస్వామిగారు—ఎంతో వెంతో ఎంతో కళాత్మకంగా సజీవంగా చెక్కించారు. అక్కడ అడుగుపెట్టిన ప్రతివారూ— గీతోప దేశాన్ని తన్మయతతో చూడకుండా వుండలేరు— చూసి క్షణకాలం గీతను ధ్యానించకుండా వుండ లేరు—ఆయన సంకల్పంకూడా అదే! సిద్ధించింది.

కృష్ణారావు ''కృష్ణతత్వరచన''కి శ్రీకారం అక్కడే చుట్టాడు. ఆ రోజు మొదలు సాయం కాలాలూ— ప్రశాంత సమయాలూ— అక్కడే గడపటానికి అలవాటుపడ్డాడు. మనసుకోరుకునే ఏకాగ్రత- మనసులోవుండే సంకల్పం—ఎక్కడైనా దొరుకుతుంది. ఏ విధంగావున్నా దొరుకుతుంది. ఇంట్లో దొరకకపోదు — ఈ వాతావరణం —ఈ వంటరితనం— విశేషంగా ఆకర్షించిందంతే.

చీకట్లు అలముకున్నాయి— గుళ్ళో దేముడి దగ్గర సందడి తగ్గుముఖం పట్టింది—కృష్ణారావు కూర్చున్న ఆవరణలో — మూలగా — కృష్ణ విగ్రహంముందు అఖండజ్యోతిలా దీపం వెలుగుతూ వుంది.

తదేకంగా చూస్తున్న కృష్ణారావు కళ్ళ ముందు అంతా వెలుగే — ఆ చూపులన్నీ తేజో పుంజాల్లా — ఆ ఆకారమే తేజోమయంగా కన్పిస్తోంది. ఎవరూ చేపట్టటానికి సాహసించని 'శ్రీ కృష్ణతత్వాన్ని' వ్రాయటం మొదలు పెట్టాడు. జ్ఞానులకుకూడా అసాధ్యమైన ఆ తత్వాన్ని—ఆకళింపు చేసుకునే ప్రయత్నంలో— వర్తమానవులకూ — అందించే — యత్నంలో — ఒక తపస్విగా మిగిలిపోతున్నాడు — ఈ ధ్యేయం ఏమౌతుందో — ఈ సంకల్పం ఏ మలుపుల్ని తిప్పుతుందో... ఐనా చెలించని మనోధైర్యంతో— నిష్ఠతో — దీక్షతో కూర్చున్న కృష్ణారావు మనసు చెలించింది—

ఆ లీలామానుషుని దివ్య మంగళ రూపాన్ని చూడగానే.

ఆ లోక నియంత జగన్మోహనావతారం కళ్ళముందు నిలవగానే —

కందర్ప కండూల కటాక్ష బందీ
రిందీ వరా క్షీరభిలాష మాణాన్
మందస్మితాధార ముఖారవిందాన్
వందా మహే వల్లభ ధూర్త వాదాన్
వయమేతే విశ్వసిమః కరుణాకరమూర్తి
కింవదం త్యంగే
అపిచ విబోతవలితే చపలతరామతిరియం
బాల్యే.
మధురిమ భరితే మనోభిరామే
మృదులతరస్మిత ముద్రితాననేందే
త్రిభువన నయనైక లోభనీయే
మహసి వయం వ్రజభాజిలాలసాస్మ

మృదుమధురంగా— అత్యంత మనోహరంగా, గంభీర సాగర తరంగ దొంతరల్లా బాష్పస్థితినే మర్చినట్టు, తన్మయతలోవున్న కృష్ణారావు పెదాలు శ్రీకృష్ణ భగవానుని స్మరిస్తున్నా —

ఆ కళ్ళు వర్షిస్తున్నాయి. ఆ కళ్ళల్లో వేణు గోపాలుని మూర్తి నిర్మలంగా వెలుగుతోంది.

నిశ్చేష్టురాలై నిలబడి పోయింది కల్యాణి. తనొచ్చి ఎంతసేపైందో మర్చిపోయింది.

ఎందుకు రావల్సి వచ్చిందో మర్చిపోయింది.

కళ్ళముందు కన్పిస్తున్నది కృష్ణారావు పవిత్రమూర్తి.

తను వింటున్నది శ్రీకృష్ణ పరమాత్మ స్తుతి.

తను నిల్చింది చిన్మయావస్థలో.

తనున్నది అరుదైన పవిత్ర ప్రాంగణంలో.

అక్కడ మరో ఆలోచనకి తావులేదు.

ఆలోచనలకు ఆస్కారమేలేదు.

అపర శ్రీకృష్ణ చైతన్యుడిలా చిరుచీకట్లో కూడా వెలిగిపోతున్న కృష్ణారావు కాళ్లముందు భక్తితో కూర్చుండిపోయింది కల్యాణి.

ఇద్దరి స్థితీ వేరు.

ఇద్దరూ బాహ్యస్థితిలో లేరనే చెప్పాలి.

ఎంతోసేపటికి పెద్దగా కలకలం విన్పించింది.

చిరుచీకటిని చీల్చుకుంటూ లాంతర్ల వెలుగుతో నిండిపోయిందా ఆవరణ.

"చూశారా ... చూశారా ... నేను చెప్తే నమ్మలేదు...ఇప్పుడైనా నమ్ముతున్నారా ?—"

నారాయణ గొంతు ఖంగున విన్పించింది.

"ఇంకా నమ్మకుండానా ?"

"...చెప్పేవి శ్రీరంగనీతులూ ... దూరేవి—"

"అవునవును..."

"...ఇంకా ఊరుకుంటారా ?"

"...ఎలా వూరుకోవాలి ? — వూరు పాడై పోతుంది లేకపోతే—"

ఉలిక్కిపడి చూసింది కల్యాణి.

నారాయణ బృందం వాళ్ళు కూడగట్టుకు వచ్చిన మరికొంత మంది పెద్దలూ...—విషయం అర్థమవటం మొదలుపెట్టేసరికి మొహం కంద గడ్డలా ఐపోయింది.

"సన్యాసి మాటలు చెప్తూనే — దండిగా కట్నం తీసుకుని పెళ్లి చేసుకున్నాడు. సంసారం చేస్తూనే— అందర్నీ సన్యాసుల్లో కలవమన్నాడు —ఇంట్లో పెళ్ళాం కన్నా అందమైన మరదలుండీ— ఆవిడ్ని పట్టాడు — అందుకే పెళ్లాం ఆత్మహత్య చేసుకుని కాలి మరీ చచ్చిపోయింది. అపర శ్రీకృష్ణమూర్తి కదూ—అందుకే గుళ్ళూ గోపురాలను బృందావనాలు చేసుకుంటున్నాడు."

నారాయణ గొంతు పెద్దగా విన్పిస్తోంది.

చివాలున లేచాడు కృష్ణారావు.

నిదానించి నారాయణ వైపు చూశాడు.

తడబడిపోయాడు నారాయణ.

తన కతి దగ్గరగా వున్న కల్యాణి వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

పూర్తిగా తల వంచేసింది కల్యాణి.

" ... తప్పు చేసినవాడికి నోటిమాటెలా వస్తుందీ—ఏం మొహం పెట్టుకుని మాట్లాడతాడైనా...ఊళ్లోవున్న ఆడాళ్లందరూ పెళ్లాలనుకుంటున్నాడేమో—వాడు నమ్ముకున్న కృష్ణుడు మేనత్తని వుంచుకున్నాడు — ఈ కృష్ణుడు."

మౌనంగా వెళ్లిపోతున్న కృష్ణారావు నీ మాటలు దావానంలా తాకుతూనే వున్నాయి.

అప్పటికి పూర్తిగా ఈ ప్రపంచంలోకి వచ్చింది కల్యాణి — జరిగిన దుర్మార్గం గుర్తుకు వచ్చింది.

నారాయణ ఆడిన నాటకం అర్థమైంది.

"ఇందుకన్నమాట కృష్ణారావు రమ్మంటున్నాడని ఈ నారాయణ నాటకం ఆడించింది."

"...కళ్యాణీ...కదులు... ఇందుకన్నమాట ఇంటి నుంచి సింగారించుకుని బయలుదేరింది— ఎన్నాళ్ళ నుంచీ జరుగుతోందీ వ్యవహారం ?—"

గద్దించి అడుగుతున్నాడు నారాయణ.

దగ్గరగా వచ్చింది కల్యాణి.

"ఛీ వెధవా —"

ఖాండ్రించి మొహం మీద తుపుక్కున ఉమ్మేసింది.

* * *

గీతా మందిరంలో నిశ్చలంగా వ్రాసుకుంటున్నాడు కృష్ణారావు.

కృష్ణ మందిరంలో అన్నీ అమర్చిన లక్ష్మి— కృష్ణారావుని చూసి సందేహంగా నిలబడిపోయింది.

తపోనిష్టలో వున్నట్టు వ్రాస్తున్న అతన్ని కదిలించటం ఇష్టంలేదు— ఐనా తప్పనిసరి.

"కృష్ణా—"

" ...."

"కృష్ణా ..."

"ఊఁ ..."

వ్రాస్తూనే తల యెత్తలేదు.

"అత్తయ్య పిలుస్తున్నారు ..."

కృష్ణారావు ఈ లోకంలో రావటానికి కొంతసేపు పట్టింది.

గుమ్మంలోకి అడుగుపెట్టబోతూ ఆగిపోయాడు.

రామచంద్రరావు గొంతు విన్పిస్తోంది.

అలికిడి విని ఆగిపోయిందది.

"రా నాయనా ..."

పుట్టెడు దిగులుతో వున్న రామచంద్రరావుకు— రామకృష్ణారావుని ఇంత ప్రశాంతంగా చూడటం క్రొత్త కాదు.

పద్మిని పోయిన రోజుల్లో కంటె — రామచంద్రరావుగారు చాలా కోలుకున్నారు— అది కేవలం కాలం తెచ్చిన మార్పే. విషాదచ్ఛాయలింకా మాసిపోకపోయినా అంతకు మించిన ఆందోళనేదో కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

"బావున్నారా —"

సమాధానంగా తల ఊపినా — వోరగా కృష్ణారావుని చూసిన రామచంద్రరావుకు సాహసం కలగలేదు.

"తను వచ్చిన పని ఎలా చెప్పాలి ?"

అర్థం చేసుకున్న తులశమ్మే చిన్నగా అంది.

"కృష్ణా— రామచంద్రరావుగారొక పనిమీద వచ్చారు— బాధ్యతతో కూడుకున్న బాధతో వచ్చారు ..."


తలుపు దగ్గర లక్ష్మి వుంది. కృష్ణప్రియ వుంది. తల్లి కళ్ళల్లో — దిగులూ — ఆరాటం నిరాశా — వేదనా — ఆశా — నిరాశా పోటీలమీద కన్పిస్తున్నాయి.

ఆయనా దాదాపు అదే స్థితిలో వున్నట్టున్నారు.

కృష్ణారావు ప్రశాంతంగా వుండటం చూశాక ధైర్యం వచ్చింది తులశమ్మకు.

"కృష్ణా —"

అమ్మ పిలుపులో అభ్యర్థన వుంది. అంతకు మించిన ఆర్ద్రత వుంది.



చప్పమ్మా –''

''చెపితే వింటావా నాయనా?''

''చెప్పమ్మా''. దృఢంగా వుంది కృష్ణారావు గొంతు.

డొంక తిరుగుడు మానేసి – అసలు విషయమే సూటిగా అడగటం మంచిదన్పించింది.

అడిగిన తరువాత వచ్చే జవాబుకోసం ఎదురుచూసే సహనంకూడా ఎవరిలోనూ మిగిలి లేదు.

''ప్రియ మనల్ని నమ్ముకుంది. మనం తప్పదానికి ప్రస్తుతం నా అన్న వాళ్ళెవరూ లేరు. రామచంద్రరావుగారున్నా–ఆయన పరిస్థితులన్నీ నీకు తెల్సు–ఎటువంటి కార్యం జరక్కుండా–అక్క అత్తగారింట్లో–ఇలా వుండటం–మన్లో మనకి బాగానేవున్నా – లోకానికి ఎబ్బెట్టుగా వుంటుంది...నువ్వా వయసులో వున్నవాడివి–''

కృష్ణారావు చూపుల్లో ఎటువంటి మార్పు కనపడక పోవటంతో ఎక్కడలేని శక్తీ వచ్చింది తల్లికి.

''...నువ్వే ఆలోచించునాయనా–కష్టమో సుఖమో–ప్రియకి ఇక్కడే అలవాటై పోయింది. మనం మరో సంబంధం చూసినా–ఏమో–వాళ్ళెటువంటివాళ్ళో – పిల్ల సుఖపడుతుందో లేదో–చేతులారా పిల్లని కష్టాలపాలు చెయ్యటానికీ–మనసెలా వొప్పుతుంది? అదీగాక...''

అర్ధోక్తిగా ఆగిపోయిన తల్లిని చూస్తూ చిన్నగా అన్నాడు కృష్ణారావు.

''అర్థమైందమ్మా–ఇంతమంది సంతోష పడతారంటే...అదీ నా మూలాన – నువ్వడగబోయేదానికి వొప్పుకుంటున్నాను... ఎందుకైనా మంచిది కృష్ణప్రియ అభిప్రాయం కనుక్కోండి.''

లేచి వెళ్ళబోతూ ఒక్క క్షణం కృష్ణప్రియ వంక చూశాడు.

ఇది కలో నిజమో అర్థంకాని విచిత్ర స్థితిలో చిత్తరువులా నిలబడి వుంది ప్రియ.

ప్రియను చూస్తుంటే ఆలయంలో జరిగిన

కర్మయోగి

సంఘటన గుర్తుకు వచ్చింది కృష్ణారావుకి. అందుకేనేమో తన ఉద్దేశ్యం మరింత బలపడింది.

ఏదో చెప్పబోతూ తల తిప్పి చూశాడు.

అంత ఆనందాన్ని అణుచుకునే శక్తిలేని వాళ్ళ కళ్ళల్లో ఆనంద భాష్పాలు.

ఆ వదనాల్లో ఎప్పుడూ చూడని వెలుగు. ఏదో తెలియని తృప్తి...

కృష్ణారావులోనూ సంతృప్తిని నింపింది.

* * *

కృష్ణారావూ, ప్రియల వివాహం అతి నిరాడంబరంగా జరిగిపోయింది.

రామచంద్రరావు, శ్రీవారిగారూ మాత్రం వచ్చి ఆశీర్వదించి వెళ్ళారు. పురోహితుడు చెప్పే దాకా ఆ ఊళ్ళో చాలామందికీ విషయం తెలియనే తెలియదు. ఇంత ఐశ్వర్యవంతులు ఇంత గుట్టు చప్పుడు కాకుండా పెళ్ళి కానిచ్చారని చాలామంది గొంతులు నొక్కుకున్నారు. నారాయణ బృందం ఈ విషయాన్ని ఎంతో ప్రాముఖ్యత వున్న విషయంలా – ఇలా జరుగుతుందని ముందే తెల్సినట్టు–విషయానికి రంగులు పూసి వికృతం చేసి ఊరూవాడా ప్రచారం చేసి అర్థంలేని కసి తీర్చుకున్నారు.

పద్మిని మరణం అసహజమైన హత్యగా, దానికి కారణం ఆంతకన్నా అందమైన కృష్ణప్రియతో అక్రమ సంబంధంగా–దానిని సరిదిద్దుకొంటానికి ఈ గుట్టుచప్పుడు లేని పెళ్ళి జరిగిందనీ నారాయణ బృందం చెప్పగా చెప్పగా – నమ్మినవాళ్ళు నమ్మారు, లేనివాళ్ళు ఊరుకున్నారు.

''చూశావా కృష్ణా ఎంత అప్రదిష్ట వచ్చి పడిందో''–

గుడ్లనీళ్ళు కుక్కుకుంటున్న తులశమ్మ కళ్ళు తుడిచాడు కృష్ణారావు.

''ఇప్పుడేమైందమ్మా – ఎవరో ఏదో అనుకున్నంత మాత్రాన మనకొచ్చిన నష్టమేముంది? ఏదైనా వుంటుందనుకున్నా అది ప్రియకు ఇప్పుడదీ తప్పిపోయిందిగా–''

ఎప్పటిలాగే ఇప్పుడూ కొడుకువంక ఆశ్చర్యపోతూ చూసింది తులశమ్మ. ఎప్పటికప్పుడు ఆశ్చర్యపోతూనే వుంటుంది.


మిన్ను విరిగినా చెలించని తన కొడుకు వ్యక్తిత్వానికి తనే గర్వపడింది. ఆ ఇంట్లో గౌరవప్రదమైన స్థిరమైన స్థానమంటూ ఒకటి దొరికాక, తన ఇంటికి పరాయిది కాదన్న భావం బంధంతో పటిష్టమయాక – మానసికంగా చాలావరకు కోలుకుంది కృష్ణప్రియ. గతాన్ని క్రమక్రమంగా మర్చిపోటానికి ప్రయత్నిస్తోంది.


పద్మినితోనే ఈ ఇంట్లో పచ్చదనం – సౌభాగ్యం దూరమైందని కుమిలిపోతున్న తులశమ్మలో క్రొత్త ఆశలు చిగురించాయి. అన్నీ ఉన్నా ఈ వంశం కృష్ణతోనే పిల్లా పాపా లేకుండా – ఊరూ పేరూ లేకుండా – నాశనమైపోతుందేమోనన్న దిగులు దూరమై వొంట్లో శక్తి – మొహంలో కళాకాంతీ వచ్చాయి.


యాంత్రికమైన ఆవాతావరణంలో నూతనత్వం కన్పిస్తోంది.

పద్మిని పోయాక – విరక్తితో – లక్ష్మి సహచర్యంలో ఆధ్యాత్మిక తత్వానికి దగ్గరైన ప్రియ, అన్నివిధాలా భర్తకు సహకరించాలనే నిశ్చయించుకుంది. ఈ ఇంటి కోడలవటం – కృష్ణారావుకి భార్య కావటం – తన పూర్వజన్మ సుకృతమనే భావం ప్రియలో ప్రేళ్ళు నాటుకు పోయింది. ఈ పవిత్ర దేవాలయానికి సర్వాధికారిణిగా కాక పవిత్ర అనుబంధం వున్న ఒక భక్తురాలిగా తనని తను గుర్తించుకుంది.

బాధ్యతను నెత్తిన వేసుకుని – ఆ ఇంట్లో ప్రశాంతిని నింపటమే తన లక్ష్యంగా నిర్ణయించు






బ్రూక్ బాండ్ సూపర్ డస్ట్
"మీ అభిమాన సినీ తారలను గుర్తించండి"
పోటీలో పాల్గొనండి
రూ.2 లక్షలు
కన్నా ఎక్కువ,
బహుమతుల
రూపంలో గెలవండి.
మొదటి
బహుమతి:
రూ. 25,000 విలువ చేసే
బంగారు నెక్లెస్ లేదా
నగదు.
840
వారపు బహుమతులు:
ప్రతి వారం మాకు అందిన
మొదటి 105 చెల్లెడు
ప్రవేశములకి,
100 రూపాయల చెక్కు.
10
రెండవ బహుమతులు:
రూ. 8,200 విలువ చేసే
KSL BSA GT 50
మోటార్-సైకిల్ లేదా
రూ. 5,000 నగదు.
20
మూడవ బహుమతులు:
రూ. 865 విలువ చేసే
ప్రెస్టీజ్ ఎలెక్ట్రొమాటిక్
ప్రెషర్-కుక్కర్ లేదా
రూ. 500 నగదు.
మీకు దగ్గరనున్న డీలర్ వద్ద నుండి మీ
ప్రవేశ పత్రములను తీసుకోండి
త్వరపడండి!
పోటీ ముగింపు తేదీ :
జూలై 31,1984
బ్రూక్ బాండ్
సూపర్ డస్ట్
భారత దేశంలో అత్యధికంగా అమ్మబడు
చున్న ప్యాకెట్ టీ
Super Dust Tea
Brooke Bond
Super
Dust
Tea

BBI-5493-1

కర్మ యోగి

కున్న ప్రియను చూసి మరింత గర్వపడింది తులశమ్మ.

సగం భారం తగ్గినట్టు నిట్టూర్చింది లక్ష్మి.

"ప్రియా... తల్లీ... ఈ ఇంటికి జీవం వచ్చింది నిజమే – కానీ – నీ కడుపులో ఒక నలుసు పడితే..."

కష్టాలతో – దిగుళ్ళతో – కృంగిపోయి ముసలితనం ముంచుకువచ్చినట్టు కన్పిస్తున్న అత్తయ్య జీవం లేనట్టున్న గాజు కళ్ళల్లో – ఎప్పట్నుంచో జీవంతో బ్రతుకుతున్న ఆ కోరికను చూసిన ప్రియ మనసు ఆర్ద్రమైంది.

అడుగుల చప్పుడు విని ప్రియ తత్తరపడింది.

ఇద్దరినీ తేరిపారచూసి గీతా మందిరంలోకి సాలోచనగా వెడుతున్నాడు కృష్ణారావు.

*   *   *

"వ్రాసుకుంటున్నారా ?"

"అవును –"

"చాలా రాత్రయిందిగా –"

"ఐపోవచ్చింది –"

చిన్నగా నవ్వింది కృష్ణప్రియ.

"వ్రాయటం ఐపోవచ్చిందా? అది ఈ జన్మలోనా ?"

నవ్వుతూ చూశాడు కృష్ణారావు.

"ఉహుఁ... ఇవాల్టికి..."

పొలగ్గా సందుకుంటున్న భర్త స్పర్శకి అదోలా ఐపోయింది ప్రియ.

పద్మినిలా కాదు తను – మంచి చొరవుంది. అనుకున్నది అయితీరాలనే పట్టుదల వుంది. ఆ పట్టుదల తీరే పద్ధతిలో వాదించగల నేర్పు వుంది. అన్నిటినీమించి సమయానుకూలంగా ప్రవర్తించగల సహసం వుంది.

ఇప్పుడిప్పుడే మామూలు మనిషి కాగలుగుతోంది. మొదట్లోవున్న నిర్వేదం – జడత్వం ఇప్పుడు అంతగా కన్పించటంలేదు.

సాధ్యమైనంతవరకూ – మానసికంగా – శారీరకంగాకూడా తనకు దగ్గర కావాలనీ – స్త్రీ సహజమైన బేలత్వంతో – తననుంచి ఏదో అందుకోవాలనీ – ఆశిస్తోంది – అందులో తప్పుందా ?

కృష్ణప్రియ చర్యల వెనుక తల్లి ఆకాంక్ష బలమైన కారణంగాకూడా వుంది.

"ఏమండీ..."

"ఊఁ –"

"నేనొక్కటి అడగనీ."

ప్రియగొంతు క్రొత్తగా వుంది.

"కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకా దయః..." అన్న శ్లోకానికి సరైన అర్థం కావాలి. విచిత్రంగా చూశాడు కృష్ణారావు.

"చెప్పరా –?" మృదువుగా అడుగుతోంది కృష్ణప్రియ.

ప్లవము

క్షుధాయుధమైన
కుక్షి రాక్షసిని
అదుపులో పెట్టటానికి
అడుగు మనిషికి
ఆహారాస్త్రాలు
అందియ్యకపోతే...
వానిలోని *'ప్లవము'*
చెలరేగి
అడ్డమైన నేరాలు
చేయిస్తుంది
ఆ 'ప్లవమే'
విప్లవమునకు...నాంది ?

* కోతి *

—నల్లాన్ చక్రవర్తుల శేషాచార్య

"అర్థం తెలియకనేనా ?"

"మీరు చెప్తే వినాలని –"

చిన్నగా నవ్వుకున్నాడు కృష్ణారావు.

"నిష్కామ కర్మచేతనే జనకుడూ మొదలైనవారు సిద్ధిపొందారు. సిద్ధిపొందికూడా నిష్కామ కర్మనే చేశారు లోకాన్ని మంచి మార్గాన నడిపించటానికి అందుకోసం నిష్కామ కర్మ చేస్తున్నా – సిద్ధికి ఎటువంటి భంగమూ రాదు –"

శ్రద్ధగా వింటున్నట్టు తలవూపింది కృష్ణప్రియ.

"మరి గీతలో – యద్యదాచరతి శ్రేష్ఠ..."
"నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు .." అన్న శ్లోకాలకూ–"

అర్థమైంది కృష్ణారావుకి. త్రిలోకాల్లో తనకి కావల్సిందేమీ లేకపోయినా కర్మనే చేసిన శ్రీకృష్ణుని కర్మయోగ తత్వాన్ని ఎందుకు తరచి తరచి గుర్తుకు తెస్తోందో అర్థమైంది.

"అమ్మ కోరిక విన్నాను ప్రియా... అదే కోరిక నీకూ వుందా ?"

సిగ్గుతో తల దించుకుంది కృష్ణప్రియ.

"వివాహమంటూ చేసుకున్నాక... కొన్ని బాధ్యతాయుతమైన కోరికలు కలగటంలో తప్పు లేదనుకుంటాను... ఈ వంశం నిలవాలనీ పెరగాలనీ అత్తయ్య కోరిక. ఆ కోరిక తీర్చాలని నా ఆరాటం –"

సిగ్గు విడిచి తనవంక ఆత్రంగా చూస్తోంది కృష్ణప్రియ.

"భగవదేచ్ఛ –"

కృష్ణారావు భావాన్ని గ్రహించగలిగిన ప్రియ కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. సంతృప్తితో నిండిపోయాయి.

(ఇంకా ఉంది)

అగ్రరాజ్యాల్లో అంధులు!

ప్రపంచంలో 28 మిలియను మంది అంధులున్నారట. ఇందులో 21 మిలియనుమంది కేవలం పెద్ద పెద్ద దేశాలలోనే వున్నారుట. వైజ్ఞానికంగా యింత ముందంజ వేస్తున్న పెద్ద పెద్ద దేశాలలో యీ లెక్కన అంధులుండడం ఆశ్చర్యకరం.

చర్చి రికార్డు తెచ్చిన తంటా!

స్వీడనుకు చెందిన 80 ఏళ్ళ గోస్టా జాహన్సన్ అనే ఆయన 1978 లో చనిపోయినట్టు చర్చి కంప్యూటరు రికార్డులో వున్నదట. బాబోయ్ నే జావలేదు. చచ్చింది మాయావిడ. చర్చిలోని పాస్టరు మిస్సెస్సని చెప్పడానికి మిస్టర్ అని చెప్పిన వాచాదోషం వల్ల యీ రికార్టు జరిగిందని అతను వాపోయినా ఫలితం కన్పించగపోగా, మిస్టర్ జాహన్సన్ చనిపోయాడు, అతని భార్య జాడ తెలియలేదు. కనుక ఆ జాహన్సన్ ఆస్తి ప్రభుత్వాధీనం చేయాలి. నీలాటి దగుల్బాజీ అనుభవించ వీల్లేదని యీతన్ని ప్రభుత్వం బెదిరించిందట. ఆతను అన్నిరకాల అధికారులనూ కలిసి, తాను రాయిలా వున్నాననీ, చావలేదనీ నూటొక్క వొట్టు వేసినా నమ్మలేదట. ఇహ కోర్టుకు వెళ్ళి వీళ్ళ భరతం పట్టాలని అని ఆ 80 ఏళ్ళ జోహన్స్‌గారు వాపోయారట.

చెత్త కాగితాలతో పశు ఆహారం!

కెనడా దేశపు విజ్ఞానవేత్తలు పాత చెత్త కాగితాలనుంచి పశు ఆహారాన్ని చాలా తక్కువ ఖర్చుతో రూపొందించడంలో కృతకృత్యులయ్యారట. ఈ పద్ధతివల్ల పశు ఆహారకొరత తీరడమే గాక, పాత చెత్త కాగితాల బెడదకూడా తీరుతుందని వారన్నారట — నాచురల్లీ.





బులెట్ ప్రూఫ్ భార్య!


పారిస్‌లో ఓ శాంతమూర్తి భరించి నన్నాళ్ళా భరించి, యిహ తనభార్య ఆగడం సహించలేక ఎగిరిగంతేసి పిస్టలు తీసుకుని, తన సతీమణి నిద్రపోతుండగా ఆమె నవర కణతమీద పెట్టి ఢమీల్న 22 కాలిబర్ బులెట్ ఆమె తలలో దూచుకుపోయేలా పేల్చి నిట్టూర్చాడట. కాస్సేపటి కామెలేచి ''వాటిజ్దిస్'' అని తలగడ కంటుకున్న రక్తాన్ని ప్రశ్నించి, తలమీదా రక్తం చూసి తల షాంపూతో రుద్దుకుని సద్దుకుని పడుకుందట. ఆ భర్తగారు కొయ్యబారి యిహ ప్రయోజనం లేదని మరింత భార్యా విధేయుడయ్యాడట. ఈ తుపాకిగుండు బుర్రలో వుండటంవల్ల ఆమెకు కొత్తగా తలనొప్పి ఆరంభమయి, ఎక్స్‌రేతో గుండువున్న విషయం బయటపడి, భర్తన్నిలదీనడిగి, అతనిమీద కేసు బనాయించిందట. తత్ఫలితంగా అతని వుద్యోగం వూడి, అతను కచ్చేరీల పాలయ్యాడట.

ఒకరికి ఇద్దరైతే....!?

తమిళనాడు తలైవాసల్ అనే వూరికి చెందిన 27 ఏళ్ల చిన్నాయన్, అతని భార్య అదే వయసు అళగమ్మాళ్—యీ యిద్దరికి మధ్య పచ్చగడ్డివేస్తే కూడా భగ్గుమనేదట. ఈ ప్రత్యక్ష నరకం భరించలేని చిన్నాయన్ ఆమె చెల్లెలు కరుప్పాయిని లేవదీసుకుపోయి పెళ్ళాడేశాడట. ఈ అళగు అమ్మాళ్ మొగుణ్ణి వదలక, తానూ వాళ్ళతో కలిసి వుండనారంభించి, విడువక పోరు పెట్టేదట. ఒకనాడు గొడవలో అలిగి, పుట్టింటికి వెళ్ళిపోయిందట. కరుప్పాయి కూడా అంతకుముందు వాళ్ళమ్మని చూసొస్తానని వెళ్ళిందట. ఇద్దరూ లేనందువల్ల వొండి పెట్టేవారు లేక, అతనూ అత్తారింటికెళ్ళి అళగమ్మాళ్‌ను అన్నం పెట్టమంటే ఆమె ఎద్దేవా చేసిందట. దాంతో అతను ఆమెను కసకన కత్తితో కసాయివాడిలా పొడిచి చంపేశాట్ట.

ఇష్టంలేని పెళ్ళి తెచ్చిన ముప్పు!

తమిళనాడు కృష్ణగిరికి చెందిన అణ్ణామలై తన కూతురు 17 ఏళ్ల వళ్ళిని శ్రీనివాసన్ అనే వో రిక్షా అతనికిచ్చి దివ్యంగా వివాహం చేశాడట. వళ్ళి అపురూప సౌందర్యవతిట. ఆమె శ్రీనివాసన్ తనకు తగిన మొగుడు కాదని మొత్తుకున్నా ఆమె తండ్రి వినక, పెళ్ళిచేశాడన్న కోపంతో మొగుడుతో కాపురం చేయనందట. శోభనంలేదు, చట్టుబండలూ లేవందట. కూతుర్ని దార్లో పెట్టేమార్గం ఆలోచించి ఆ అణ్ణామలై తన అల్లుడిచేత వేరే కాపురం పెట్టించి, కూతుర్ని బలవంతంమీదాయింటికి పంపేశాడట. ఆ రాత్రి శ్రీనివాసన్ తన భార్య వళ్ళిని శోభనం చేసుకుందాం అని నచ్చచెప్పి యిల్లూ, పడకా అలంకరించాడట. వళ్ళి శివమెత్తిన దానిలా అవన్నీ పీకి పాకమెట్టి అతనిచేత చావుదెబ్బలు తిందట. మర్నాడు అతను పనికి వెళ్ళి, తిరిగి యింటికొచ్చి అన్నం తిని, మంచం మీద పడుకొని వుండగా వళ్ళి ప్రేమగా అతని మీద వాలినట్టు వాలి కత్తితో అతని పొట్టలో ఒక్క పోటు పొడిచి, కత్తిలాగి, మరో రెండు పోట్లు పొడిచి, 'నీ ముఖానికి శోభనం కావాలా' అని ఆ కత్తితో అతని కంఠంలో పొడిచి, అంతకూ ఆత్రం తీరక, సన్నికల్లు ఎత్తి అతని తల పగల కొట్టిందట. అది చూసిన పక్కింటావిడ గావుకేక వేసి వీధి తలుపు బయట గొళ్ళెం పెడితే వాళ్ళ ఇంటికప్పు తాటాకులు పీక్కుని పైకెక్కి పారిపోయి, నింపాదిగా పోలీసులకు చిక్కిపోయిందట.



మామపై కోపంతో ఆత్మహత్య!

ఆంధ్రప్రదేశ్ అల్లగడ్డ తాలూకా దీపగుంట్లకు చెందిన బోయి చినవెంకటన్న తన చిన్నతనం నుంచీ మేనమామ కూతురు వెంకటలక్ష్మి మీద మనస్సు పెట్టుకున్నాట్ట. తనను గాదని ఆమె మామ వెంకటలక్ష్మికి వేరే సంబంధాలు చూస్తున్నాడని ఆ వెంకటన్న తన తల్లితో పోరి, ఆమెను తీసుకుని తన మేనమామింటికెళ్ళి పిల్లనివ్వమని అడిగిస్తే ఆ మామ కుదరదన్నాట్ట. దాంతో చినవెంకటన్న ఆవేశంతో వో కత్తితెచ్చి కసకస తన్ని తనే పొడుచుకు చనిపోయాట్ట — వోర్నీ! ★

మరణశాసనం



ఎస్. గోవింద రాజులు

“ఏమేవ్ కావుడూ ఇలారా !” ఆ యా స పడుతూ పిల్చింది పిచ్చమ్మ.

“ఎందుకూ ?” విసుక్కుంటూ వచ్చింది.

“రావుడు ఏడీ...?”

“బయట అరుగుమీద కూర్చున్నారు.”

“అన్నం తిన్నాడా ?”

“లేదు...”

“అదేమీ, వాడికి యింకా విస్తర వేయ లేదూ !”

“మధ్యాన్నం భోక్తగా వెళ్ళారు. తరువాత కాసిన పాలు కాచి యిస్తాను” అంది.

“ఇదో ! నాకు ఏమీ వద్దుగానీ... యీ రోజు తిథి నక్షత్రం బావుందంటావా !”

“ఆఁ బాగానేవుందిగానీ... కాస్త కన్ను మూయకూడదూ !” విసుగ్గా అంది.

“మూస్తానే ! ఏకంగా ఒకేసారి మూసే యాలనికదూ యీ తాపత్రయం. పోయే ప్రాణం కాస్త మంచి ఘడియలలోనైనా పోతే మంచిదని.. యింత బ్రతుకూ బ్రతికీ... అవునూ... విశాలాక్షి దాని పిల్లలు రారేం...?”

“అయ్యో ! ఖర్మ... విశాల వదిన పెద్ద కూతురు లక్ష్మికి యీ తెల్లవారు ఝామున పెండ్లిగా” అంది.

“అవును కదూ ! మరిచాను. ఆ పిల్ల ముండకి పెండ్లి కావాలని పాపం విశాల తపించి పోయింది. నిర్విఘ్నంగా జరగని” అని మనసారా కోరుకుంది.

విశాలాక్షి తలుపులు తోసుకొని పాత్రలతో వచ్చింది. భక్ష్యాలు వున్నాయి అందులో.

“ఎవరూ విశాలా ! ఏమే కూతురు పెండ్లికి తపించిపోయావు ఆఖరకి చేస్తున్నావా ?”

“అవును పిన్నీ...అంతా నీ ఆశీర్వాదం. పిన్నీ... హల్వ తెచ్చాను. కాస్త నీవు నోట్లో వేసుకుంటే నాకు తృప్తి” అంది గిన్నెసి ఆమె ముందు పెట్టి.

“నాకు మాత్రం సంతోషం కదూ ! వేలు డంత వెర్రిముండకి పెండ్లి అంటే. బామ్మా బామ్మా అని నా వెంట వెంట తిరిగేది. ఏది వుసిరికాయంత ఈ అరచేతిలో వెయ్యి” అని చెయ్యి చాచింది.

విశాలాక్షి నిమ్మకాయంత వేసింది. దాన్ని నోట్లో వేసుకొని చప్పరించి “పాకం యింకా కొంచెం రావాలే విశాలా” అని అంది.

''బాగా చెప్పావు పిన్నీ'' అని కామేశ్వరి పేపు తిరిగి ''వదినా! ముహూర్తానికి పందిట్లోకి వచ్చి అన్నయ్యా నీవూ అక్షింతలు వేయండి. మీ ఆశీర్వాదమే దానికి శ్రీరామ రక్ష'' అంది కంట తడి పెడుతూ.

''వస్తాలే వదినా ! నీవు దిగులుపడకు''అని కామేశ్వరి అంది.

''పిన్నీ వస్తాను. ముహూర్తం అయిన తరువాత పిల్లనీ పిల్లాడినీ తీసుకొస్తా'' నని వచ్చినంత వేగంగానూ వెళ్లిపోయింది.

* * *

పిచ్చమ్మ బ్రాహ్మలావిడ. ఒక కొడుకు పుట్టిన తరువాత భర్త పోయాడు. అప్పటినుండి నీళ్ళుమోసి, అప్పడాలు వత్తి, వంటలుచేసి కొడుకుని పెంచింది.

ఎప్పుడో పాతికేళ్ళ క్రితం చిన్న పాక వెలికి వస్తే తను దాచుకుందిగాక, తనువంటచేసే యజమానురాలిని అడిగి కొంత పైకం తీసుకొని నెత్తిన గూడు ఏర్పరచుకుంది.

పిచ్చమ్మ కష్టజీవేగాక, పరోపకారి కూడా. తనకి లేకపోయినా యితరులకి యింత అయినా పెట్టాలన్న ధర్మగుణం మెండుగా వుంది.

తన శరీర కష్టంతో కూడా యితరులకి ఎంతో సహాయం చేసేది.

ఇరవై సంవత్సరాల క్రితం విశాల మూడేళ్ళ కూతురు, వెర్రిబాగుల పెనిమిటితో బ్రతకడానికి ఆ వూరు వచ్చి దేవుడు చెప్పి పంపినట్లు పిచ్చమ్మ యింటి వాకిలి ముందు నిలబడి బిడ్డకి పిడికెడు అన్నం అడిగింది.

చూడగానే గ్రహించింది పేద బ్రాహ్మణ కుటుంబం అని.

ఆదరించి కూర్చోపెట్టి, విస్తరివేసి తన కున్నదే వారికి కడుపునిండా పెట్టి ఆదరించింది.

విశాల తన కష్టం చెప్పుకుంది. మొగుడు వెర్రివాడు. తెలియక తల్లిదండ్రులు కట్ట బెట్టారు. అత్తగారూ వంటలు చేసి బ్రతుకు తుంది.

పెండ్లి అయిన మరు వుదయమే నీ బ్రతుకునీది అనేసి ఆవిడ మారు చీర తీసుకొని తన పనిలోకి వెళ్ళిపోయింది. వెర్రివాడిని తనకి అప్పగించి చేతులు దులుపుకుంది.

ఈ నాలుగేళ్ళు వున్న వూరిలో నానా కష్టాలు పడింది. ఇప్పుడు ఇలా వచ్చింది.

''అయ్యో పాపం ! ఎన్ని కష్టాలు పడ్డావే పిచ్చితల్లి. నిన్ను నా బిడ్డగా చూచుకొంటాను, నా పంచలోనే ఓ మూల పడివుండు. వయస్సు వేసుకొని వెర్రివాడితో ఎక్కడని తిరగగలవ్'' అని ఆదరించింది.

ఆ చిన్న తాటాకు యింటిలోనే మధ్య తడిక వేయించి వాళ్ళు వుండేట్లుగా దానికి ఏర్పాటు చేసింది.

తనతో బాటే నీళ్ళమోతకి, అప్పడాలు వడియాలు పెట్టడానికి, వంటలకి తీసుకొని వెళ్ళి బ్రతికే మార్గం చూపించింది.

విశాల భర్త చయనులు ఒక్కొక్కసారి బుద్ధిగా వుండేవాడు. ఒక్కొక్కసారి రాగిచెంబు పుచ్చుకొని యాయవారానికి వెళ్ళేవాడు.

ఈ రెండు చేసిన రోజున విశాలకి గానీ పిచ్చమ్మకి గానీ, ఆమె కొడుకు రామచంద్రకిగానీ నెమ్మదిగానే వుండేది.

అలా వుండని నాడు వీధిలో చెత్త అంతా యింట్లో పోగేసి– ''ముండకానా ! యిల్లు యిలా పెట్టి నీవెక్కడకి వెళ్ళావే'' అని జుట్టు పుచ్చుకొని కొట్టడానికి వచ్చేవాడు.

లేదా యింటికి అలసి వచ్చిన భార్యతో ''ఏమేవ్ ! నీళ్ళకుండలో నే మూత్రం పోశా ! నీ కిష్టం అయితే ఆ తీర్థం పుచ్చుకో !'' అనేసి ప్రక్కయింటికి వెళ్ళి– ''కాస్త తీర్థం యిస్తారా! మా యింటావిడో వెర్రిబాగుల ముండ, నీళ్ళ కుండలో మూత్రం పోసి వుంచింది'' అని మంచి నీళ్ళు అడిగి తాగేవాడు.

నిజంగా ఆ పని చేశాడో లేదో తెలియదు. చెప్పిన తరువాత ఆ కుండని ఎలా వుపయోగిం చడం ! పారవేద్దామంటే ఎన్ని కుండలని కొన గలదు ?

ఇలా ఎన్నెన్నో పనులు చేసేవాడు. విశాలతో బాటూ చయనులని పిచ్చమ్మ, రామచంద్రా భరించారు.

అలానే బ్రతుకుని లాక్కొని వస్తున్నారు. ఒక్క గదిని చెమటోర్చి రెండు గదులని చేసి వెనక వసారాలా వాల్చారు వంటకని. ఒక గదిలో పిచ్చమ్మ కుటుంబం, యింకొకటి విశాలది.

రామచంద్రకు నలుగురు కొడుకులు. రామచంద్ర తల్లి వృత్తినే స్వీకరించాడు.

కొడుకులు పట్నంవెళ్ళి అక్కడ హోటళ్లల్లో వంటవాళ్ళుగా వున్నారు.

విశాల కూతురు లక్ష్మికి పాతికేళ్ళు. పెండ్లి కాలేదని ఎన్నో నోములు వ్రతాలు కూతురితో చేయించింది. రోజూ మూడు పూటలూ లలితా స్తోత్రం చదివించేది.

తనలా తన కూతురు బాధ పడకూడదని విశాల ఆశ. చివరకి ఏదో కుదిరింది.

తన యింటిలోనే నలుగురిని పిలిచి పెండ్లి చేస్తోంది.

పెండ్లివారూ అంతంత మాత్రమే.

బాజాలు భజింత్రీలు ఓహో అని పెట్టక పోయినా, శాస్త్రోక్తంగా మంత్రాలతో చేయడానికి అడ్డులేదు కదా !

అది అయినా నాలుగు యిళ్ళవాళ్ళా సహాయం దయతో చేయబట్టి యిది అయినా చేయగలుగుతోంది.

''కావుడూ...కావుడూ... '' ఆయాసంగా పిల్చింది పిచ్చమ్మ.

మాగన్నుగా నిద్రలో వున్న కామేశ్వరి లేచి ''అత్తా పిల్చావా ?'' అంది.

''అవునే... దాని పెండ్లి అయిపోయిందా?'' అని అడిగింది.

''ఇంకా ఎక్కడా ? అది తెల్లవారు ఝాము లగ్నం. యింకా అర్ధరాత్రి దాటలేదు'' అంది.

''రావుడేడి ? వాడిని పిలవ్వే'' అంది.

''ఏమండి మీ అమ్మ పిలుస్తోంది'' అని భర్తని తట్టిలేపింది.


ఓ పదిహేను రోజులుగా పిచ్చమ్మ పరిస్థితి బాగోలేదు. ఏ క్షణాన పోతుందో అని అందరూ అనుకుంటూనే వున్నారు.

అయినా మాటామంతీ అంతా చాల తెలివిగానే వుంది.

పెద్దది వూరికి ఎంతో వుపకారం చేసింది అని వాడకట్టు వారంతా పండో ఫలహారమో చేసి తెచ్చి పిచ్చమ్మకి యిచ్చి నమస్కరించారు.

అందరినీ మనసారా దీవించింది.

తల్లికి ప్రాణం బాగోలేదని రామచంద్రా, కామేశ్వరి యింటి లోపలే వున్నారు. లేదంటే పెండ్లి పందిట్లోనే వుండేవారు.



''రావుడూ! తులసీ తీర్థం కాస్త గొంతుకలో పోయారా'' అంది.

ప్రక్కనే సిద్ధంగా వుంచిన తీర్థాన్ని నాలుగు చెంచాలు తల్లి గొంతుకలో పోశాడు.

అది గుటకవేసి -

''కావుడో వెర్రి బాగులది. దాన్ని కట్టు కోవడం యిష్టంలేక దానిని నీవు ప్రేమగానే చూడలేదు. అన్న కూతురు. తల్లిలేని పిల్లకదా అని నేను కడుపులో పెట్టుకుంటే నీవు అలా చేశావ్.

ఏమీ కావుడూ! పిచ్చిముండా! నీకేంలోటే బంగారంవంటి కొడుకులని నలుగురిని కన్నావ్. ఒక కొడుకు కొడుకూ ఒక కన్ను కన్నా అన్నారు పెద్దలు. అయినా ఆ ఒక్కకొడుకు చేతిమీద నేను లక్షణంగా వెళ్ళిపోతున్నా.

నలుగురు కొడుకులు వున్న నీవు అదృష్ట వంతురాలివే. హాయిగా నీ కాలం వెళ్ళిపోతుంది. దిగులు పడకూ!

కావుడూ! ప్రాణం ఎగిరిపోయేలాగుంది, కాస్త ఆ వెర్రిముండ లగ్నం అయ్యేవరకూ గుట్టుగా వుంచండే. అది పెండ్లో అని వెంపర్లాడి పోతుంది. ఆ మూడు ముళ్ళు పడి అది కాస్తా అత్తగారి యింటికి వెళ్ళి పోయేవరకూ ... దుఃఖాన్ని దిగమింగుకోండి. శవాన్ని బయటికి తీయవద్దు...

హంస ఎలానూ ఎగిరిపోతుంది. పోయేదాని కోసం నూరేళ్ళు బ్రతికేదాన్ని కంట తడి పెట్టించడం ఎందుకూ?

'బామ్మా బామ్మా' అని వెర్రిముండ నా చుట్టూనే తిరిగేది. అది వినిందంటే తట్టుకోలేదు.

మరణ శాసనం

కావుడూ నా సందూక పెట్టె తీవే'' అంది.

కామేశ్వరి ప్రక్కనే వున్న పెట్టెని అందించింది.

''రావుడూ! కావుడని బాధ పెట్టకురా'' అంది.

రామచంద్ర పచ్చగా అందంగా వుంటాడు. కామేశ్వరి ఛాయ తక్కువలో చాల పొట్టిగా పిలకజుట్టుతో వుండేది. ఆ పిల్లని చూసి తనకి వద్దని ఏడ్చాడు.

అన్న కూతురే దానిని ఎవడు కట్టుకుంటా డని పిచ్చమ్మ కొడుక్కి చేసుకుంది.

కామేశ్వరిని చూస్తే మండిపడేవాడు. అందుకే ప్రక్కదారులబడి పోయేవాడు.

తను సంపాదించినదంతా ఆడవారి కోసమే ఖర్చు చేసేవాడు.

పిచ్చమ్మ మాత్రం ఏం చేయగలదు? కోడలని తనతో త్రిప్పి సంపాదనాపరురాలని చేసింది.

ఎలానో నలుగురి పిల్లలకి తల్లి అయింది.

వయస్సు కావడంవలనగానీ, రోగాలు అంటు కోవడం వలనగానీ రామచంద్రం వ్యవహారాలని తగ్గించుకున్నాడు.

అందుకే ఆవిడ బాధపడుతోంది కోడలు కోసం.

''నేనెందుకు బాధ పెడతానే. నాకు మాత్రం ఎవ్వరున్నారు కావుడు తప్పా'' అని అన్నాడు. ఆ మాటకి ఆవిడ హృదయం పొంగి పోయింది.

''ఆ విశాల నీ చెల్లెలు ఏంటేదిరా. దాని ప్రాణం వున్నంత వరకూ దానిని యీ పంచలోనే వుండనీయండి'' అని అంది.

''సరేలే''

''ఇదిగో! నా చావు ఖర్చులకి ఓ ఐదు వందలు దాచి వుంచాను. దానితో చెయ్యి, కావుడూ! నా పెండికి మా అమ్మా నాన్న యిచ్చిన ఏడురాళ్ల దిద్దులు యివి. దాచుకో! ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని నేను అమ్మలేదు. వాటిని చూస్తే మా అమ్మా నాన్నా గుర్తుకు వస్తారు. ఆ దిద్దులని కంసాలి యింటి నుండి తేవడంకోసం మీ నాన్నని నేను పోరేదాన్ని. మా అన్న రోజూ వెళ్ళి వచ్చేవాడు. అది తెచ్చినరోజున మా అన్న అంటే మీ నాన్న నన్ను తెగ ఏడిపిం చాడు.

వాటిని చూస్తే...'' ఆయాసం. కామేశ్వరి నోట్లో కాస్త పాలు పోసింది.

గుర గుర శబ్దం వస్తూ వుంది.

ఘడియలని చూసింది. బాగానేవుంది.

గురక ఆగిపోయింది.

బయట మంగళ వాయిద్యాలు ప్రారంభం అయాయి.

రామచంద్రకి దుఃఖం వచ్చింది.

తల్లికిమాత్రమే తెలుసు. తను ఎన్ని వెధవ పనులు చేసినా కడుపులో పెట్టుకొని దాచుకొంది.

ఆ తల్లి అండ తనకిలేదు. ఆ తల్లి మరణిస్తే కూడా కరువుతీరేలా ఏడ్చే అదృష్టం కూడాలేదు.

పెండ్లి అయ్యే వరకూ ఏడవవద్దని శాసించింది.

కామేశ్వరికీ అలానే వుంది–

అత్తా...అత్తా అని ఏడవాలని.

తల్లి తరువాత తల్లిగా చూచిన అత్త. భర్త అనాదరణ ఎంత వున్న, అత్త ఆదరణ అపారంగా వుండటం వలన బ్రతక గలిగింది.

ఆ అత్త యింక లేదు.

అయినా ఏడ్చే అదృష్టం లేదు.

రామచంద్ర ముసుగు కప్పకుని ముడుచు కొని ఓ మూల కూర్చున్నాడు.

కామేశ్వరి మొహానికి చెంగు కప్పకొని కూర్చుంది.


పెండ్లి ఎప్పుడు అవుతుంది?

అంపకాలు ఎప్పుడు పూర్తి అవుతాయా–?

కరువుతీరా ఎప్పుడు ఏడుద్దామా అని.

బయట పెండ్లి తంతు జరుగుతూ వున్నది.

పిచ్చమ్మ 'మరణ శాసనం' వుల్లంఘించ లేదు ఆమె కొడుకు. ★



ఒక పల్లెవాసి కథనం :

విశాఖ జిల్లా గ్రామాల పరిస్థితి

-శ్రీ వంగపండు పారన్న

ఆంధ్ర రాష్ట్రములో విశాఖ జిల్లా అన్ని జిల్లాల కంటె విశాలమైనది. యితర జిల్లాలన్నిటి కంటె అన్ని విధాల బాగా వెనుకబడి యున్నది. యీ వెనుకబడుటకు అనేక కారణము లున్నవి. నేటివరకు యీ జిల్లా జమీందార్ల ప్రాబల్యములోనున్నది. గవర్నమెంటు ప్రాంతాల కంటె జమీందారుల కింద ప్రజలన్ని విధముల అణచి పెట్టబడినారు. ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలు పూర్తిగా ధ్వంసం చేశారు. ఆర్థిక, విద్యాభివృద్ధి సౌకర్యాలు ఏ మాత్రం లేకుండా చేశారు. ఉన్న స్థిరచరాస్తులమ్మి పన్నులు రాబట్టుటలోనే వీరి చాకచక్యమంతా ఉపయోగించారు. అధికంగా పన్నులు వేసి రైతులను విపరీతంగా పీడించారు. పన్నులు రాబట్టుటలో ప్రజలకు విపరీత భయపరిస్థితులు కలుగజేశారు. ప్రజలలో ధైర్యం పూర్తిగా సన్నగిల్లిపోయింది. వారిలో నూతనోత్సాహాన్ని కలుగజేసే ఎవ్విధమైన సహకారము ప్రజలకందివ్వలేదు. దాదాపు నలుబదిలక్షలు జనాభా కలిగిన యీ జిల్లాకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహింపవలసివుంది.


గ్రామ జీవితం

పల్లెలలో జీవించే ప్రజలకు శుచి శుభ్రతల లోనూ, ఆహారవిహారాదులలోనూ క్రమశిక్షణ లేదు. శ్రమించుటలో కూడా ఒక కాల నిర్ణయాన్ని పాటించుటకు అవకాశము లేదు. ప్రకృతిపై ఆధాపడి వర్షము పడినప్పుడల్లా వీరు ఎద్దడిగానే యుందురు. ఏ వృత్తికి సంబంధించిన ప్రజలను చూచినా, బుద్ధి నుపయోగించి పని చేస్తున్నట్లు కనపడలేదు. సాంప్రదాయంగా ఒక ఆచారానికి కట్టుబడి నిర్వహిస్తూ వుంటారు. సంఘీభావం తక్కువ, కులకట్టుబాట్లకు మూఢాచారములకు ప్రాధాన్యత బాగా యిచ్చెదరు. సంకుచిత స్వభావం ఎక్కువ, స్వార్థం మెండు. ఒకరిని ఒకరు వంచన చేసుకొనుటలో నేర్పరులు. ప్రతి గ్రామంలో గూడా నాయకత్వం బహు దుర్మార్గుల చేతిలో నడచుచున్నది. అమాయక ప్రజలను వ్యవహారములలో పెట్టి కోర్టుల కెక్కించి పీడించుక తింటూ వుంటారు. అనేక చిక్కులలో ప్రజల నైతిక శక్తి, సంస్కృతి వక్రగతి పట్టించినవి. పల్లె ప్రజలకు చదువులన్న భయం జాస్తి. ప్రాథమిక విద్యలో వుత్తీర్ణులై యిప్పుడు గ్రామానుల పీడించుకుతింటున్న వారిని చూచి విద్యాధికులని వీరి భయం. చదువుకున్నవారు మోసకులనే స్థితికీ యీ గ్రామనాయకత్వం ప్రజలను వెనుకకు నడిపించినది. విపరీతమైన భయం వీరిలో పాతుకపోయినది. మోసాన్ని గుర్తించగలరు. కాని ఎదుర్కొనే శక్తి లేదు. ఎదుర్కొంటే ఏమయ్యెదమోననే భయం. కొన్ని పల్లెలలో పాఠశాలలే లేవు. ఉన్న పాఠశాలలు గూడ ప్రజలను ప్రోత్సాహపరచునవిగా లేవు. తాలుకాకు ఒక హైస్కూలు తప్ప వేరే లేవు. మిడిల్ స్కూల్సు గూడా లేవు. పల్లెలలో పాఠశాలలకు సక్రమమైన కట్టడములు లేవు. చాల అనారోగ్యంగానూ, నిరుత్సాహంగానూ ఉంటాయి. యీ ప్రాంతంలో నిర్బంధ విద్యా విధానం గూడా ఆచరణలో సాధ్యపడుటలేదు. ప్రజలకు ఆర్థిక సౌకర్యాలు చాలా తక్కువ. పిల్లలను బడికి పంపితే వారి ఆర్థికస్థితి కుంటుబడే కుటుంబాలు చాలా ఎక్కువ. భూస్వాముల కుటుంబాలు చాలా ఎక్కువ. అంతా రైతు వర్గమే. యీ రైతులలో కూడా అధిక సంఖ్యాకులకు వారి కుటుంబ పోషణకు చాలని ఆదాయం. కొద్దిపాటి ఆవర్ణులలో తప్ప, సామాన్యముగా నూటికి ఎనబది మందికి ఏ కొద్దో భూవసతి యున్నది. యీ భూ వసతి చాలా తక్కువ విస్తీర్ణము. అయిదు ఎకరాల లోపు కుటుంబాలు నూటికి అరువది యున్నవి. వ్యవసాయ కూలీలు యీ ప్రాంతమున లేరు. చాలీ చాలని భూవసతి గలిగిన బహు చిన్న రైతులే యితరులకు కూలికి పోయెదరు. వీరికి గల భూవసతులు గూడా సరిగా పండుటకు వీలు లేదు. వర్షాధారముపై ఆధారపడుదురు. చాలా మంది చాలీ చాలని జీవితమున కలవాటుపడి కల్లో గంజో త్రాగి సంతుష్టి చెందుచున్నారు. విలాస జీవితమే వీరికి తెలియదు. మోటు పద్ధతుల కలవాటు పడిపోయినారు. వీరి ఆచారములు ఆభరణాలలోగూడా మోటుతనము కానవచ్చును.

పాడి పంట

పాడి చాలా తక్కువ. వీరి ఆహారములో పాడికి అంత ప్రాధాన్యతలేదు. పశుసంపద చాలా తక్కువ. వీరి ఆహారములో బియ్యము చాలా తక్కువ. పాడిపంటలు రైతులకు ముఖ్యమని వీరు మరచారు. పాడివలన కలిగే లాభాలు వీరికి తెలియవు. పాడివల్ల వచ్చే ఆదాయముకూడా వీరు గుర్తించలేదు. పురాతనంగా వీరికి వచ్చిన భూవసతిపైనే వీరి శక్తి ని ఉపయోగించెదరు.

వ్యవసాయ విధానములోగూడా వీరు తాము పడుచున్న కష్టనష్టములు గమనించరు. నీటి సదుపాయములు ఏర్పాటు చేసుకొన్న అభివృద్ధి చెందెదమనే భావము చాలా తక్కువ. దైవము మీదే హెచ్చు ఆధారపడెదరు. దైవసహాయము లేకపోతే పంటలు కలరావనే అభిప్రాయము వీరిలో పాతుకపోయినది. ఆధునిక వైజ్ఞానిక



దృష్టి చాలా తక్కువ. స్వశక్తిపై వీరికి నమ్మకము తక్కువ.

నేడు వ్యవసాయ భూములు చిన్న చిన్న ఖండాలుగా భాగించబడియున్నవి. జన సంఖ్య పెరుగుతున్నకొలదీ భూమిని బహు తక్కువ పీలికలుగా చీల్చుకొనుచున్నారు. పురాతన వృత్తులపై ఆధారపడుటే తప్ప ఉపవృత్తులు కూడ చేయుటకు వీరు యిచ్ఛగించరు. పెద్దలు నిర్ణయించిన వృత్తులు తప్ప అన్యవృత్తులు, కుల దృక్పథానికి వ్యతిరేకమని వీరి భావము. వ్యాపార దృష్టి చాలా తక్కువ. ఏ కొద్దిమంది తెలివికలవారో తప్ప సామాన్య కుటుంబస్తులు వృత్తులు కుంటుబడినా యితర వృత్తులు చేయుట కొప్పుకొనరు. కులాలవారీగా ఒకరి వృత్తి యింకొకరికి సాధ్యముగాదనీ, చేయుట నీచమనీ వీరి భావము. కూరగాయలు పండించుట కూడా కులవారని, కాయకూరలను, పండ్లను, విక్రయించువారు సచ్చుడివారని, వ్యాపారము చేయువారు వైద్యులనీ, యీ విధంగా ఏ వృత్తి చేయువారు ఆ వృత్తినే చేయుటకు దేవుడు పుట్టించాడనీ వీరి భావము. వ్యవసాయము చేయు వారిలో జనాభా పెరిగినందున భూవసతి చాలుటలేదు. భూమిపై ఆధారపడి జీవించే కుటుంబాలలో మాటికి— ఏబదిమందికీ వ్యవసాయంపై వచ్చు ఆదాయము చాలదు. కనీసజీవన ప్రమాణాన్ననుసరించి సక్రమమైన వస్త్రధారణ గాని, ఆహార నియమముగాని అనుసరించక, కూడబెట్టుటకే హెచ్చుగా ప్రజానీకం తాపత్రయ పడుచుందురు. ఎక్కువ కరువు కాటకాలకు గురి యగుటవలన వీరికీ దృష్టి అలవడినది. కష్టాలను సహించు అలవాటు వీరికి బాగా జీర్ణించిపోయినది. ఎన్ని విధములైన కష్టములు వచ్చి వీరిమీద పడినను భయపడెదరేగాని రోషపడి ప్రతిఘటించుటకు ప్రయత్నించరు. అది సహనభావమూ కాదు. హృదయ దౌర్బల్యంవలన కలిగిన నిర్వీర్యత. కాల దృక్పథము కాదు. సంకుచిత తత్వములోనుండి వెలువడే. స్వార్థపరత్వము.


ఆరోగ్యము

వైద్య సౌకర్యాలు బొత్తిగా తక్కువ. ఎక్కడో ఒకటి తప్ప, గ్రామాదులలో వైద్యాలయాలు లేవు. తాలూకా ముఖ్య పట్టణములో ఒక ఉచిత వైద్యశాల ఉండును. యిది పల్లె ప్రజలకు ఏమీ ఉపయోగ పడదు. యిరువది ముప్పది మైళ్ల నుండి వైద్యశాలకు వచ్చుటకు రాకపోకల సౌకర్యాలు తక్కువ. అనారోగ్యముచే పల్లెలలో కృశించి యుండెదరు. వారికి సలహా యిచ్చువారైనా యుండరు. ఆరోగ్య విషయము కూడా దేవునిపై భారంవేసి వదిలిపెట్టెదరు. ఆయువుంటే ఎలాగైనా బ్రతుకుతామనే భావం పాతుకపోయింది. గ్రామాల వీధులు విపరీతమైన మురికితో నిండియుండును. యిది గ్రామీణ ప్రజలు అలవాటు క్రింద భావించెదరు. గ్రామాల కట్టడములు బహు పురాతనములు. వాటిని మార్చుట కిష్టపడరు. యిల్లు మారిన అచ్చుబడి కాదనే మూఢ విశ్వాసము కలదు. పెద్దలు నిర్మించిన యిండ్లలోనే వుండుట మంచిదని వీరి భావము. కుటుంబాలు ఎంత విరివిగా పెరిగినా ఉన్న యిండ్లలోనే త్రొక్కులాడుకొంటున్నారు. పశువుల శాలలను కూడా యిండ్ల మధ్యలోనే కట్టెదరు. కట్టడములు బహు యిరుకుగా నుండును. పురాతనపు మిద్దెలు, గాలి వచ్చుటకు కిటికీలుగాని ఏ విధమైన అవకాశములుగాని ఉండవు. యిండ్లలో గాలి జొరబడే అవకాశములేక చాలా అనారోగ్యముగా యుందురు. చాలా గ్రామాదులలో నాటువైద్యులు గూడా ఉండరు. యిటువంటి గ్రామ వాతావరణమున కలవడిన ప్రజల బుద్ధిబలము క్షీణించినవి.

కళలు

వీరు బహు పురాతన కళల కలవడి యున్నారు. పురాతన ఫక్కీలోని భామ వేషములు, వీధినాటకములు, జముకుల, హరి హరి నారాయణ మొదలగు పాత విధానము లోని కళలనే అభిలషించెదరు. సినిమాలకు యిప్పుడే అలవడుచున్నారు. పల్లె ప్రజలలో అధిక సంఖ్యాకులు యింతవరకు సినిమా తప్ప అత్యధిక భాగానికి నీటి సౌకర్యాలు తక్కువ. పూర్తిగా వర్షములమీదనే పంటలు ఆధారపడి

ఇప్పుడు... గోద్రెజ్ రూపొందించిందొక కొత్త సబ్బు.
ఇది మీ అంత శ్రద్ధగా మీ చర్మాన్ని కాపాడుతుంది.



Godrej నిమిన్

శుద్ధమైన వేపనూనె యొక్క సహజ సద్గుణాలు కలిగినది.

నీమ్, మర్గోసా అన్న పేర్లతో పిలువబడే వేపచెట్టు, చర్మ సంబంధ సమస్యలకై మానవజాతికి ప్రకృతి ప్రసాదించిన వరాలలో ఒకటి. వేపనూనెను క్రమం తప్పకుండా వాడితే, అది మీ చర్మం నునుపుగా, తేటగా ఉండడానికి తోడ్పడుతుంది.

గోద్రెజ్, శుద్ధమైన వేపనూనెను చేర్చి రూపొందించిన సబ్బు, నిమిన్ — మీ చర్మ సమస్యలను కడిగి పారవేసే లగ్జరీ టాయిలెట్ సోపు. ఈ గోద్రెజ్ నిమిన్ మరింతకాలం మన్నుతుంది. ఎందుకంటే ఇది ఇతర కొన్ని మర్గోసా సబ్బులవలె మెత్తబడిపోదు.

మీ చర్మ సమస్యలను కడిగి పారవెయ్యండి...
మీ చర్మానికి శుభ్రమైన, ఆరోగ్యవంతమైన నిగనిగ ఇవ్వండి.

CHAITRA-BG 226 TEL

యున్నవి. యీ జిల్లాలోగూడా చాలినన్ని జలధారములు గలవు. కాని జమీందార్లు శ్రద్ధ వహించలేదు. చెరువులనుగూడా మరమ్మత్తు చేయించక పూడ్చివేసిరి. జులుముచేసి వారి పన్నులయితేరాబట్టుకొనిరిగాని వ్యవసాయాభివృద్ధి యందు జమీందార్లకు దృష్టిపోలేదు. విదేశీయ ప్రభుత్వం హయాములో గవర్నమెంటు ఏరియాలోగల ప్రాంతాలకు యీ దుస్థితి ఇంతగా పట్టలేదు. అన్ని సౌకర్యాలు జమీందారీ ప్రాంతాల కంటే ఎక్కువగానే యున్నవి. ప్రస్తుతము ఈ జిల్లాలోగల జలధారములకు చిన్న చిన్న ఆనకట్టలు కట్టించిన త్వరలో అభివృద్ధి జరగగలదు. పెట్టుబడికూడా చాలా తక్కువగా పట్టును ఒక్కొక్క ఆనకట్ట క్రింద ఒక తాలూకా మొదలు రెండు మూడు తాలూకాల వరకు నీటి సరఫరా జరగగలదు. పెద్ద పెద్ద స్కీములు వేసి డబ్బులేదని వూరుకుండుటకంటె చిన్న చిన్న మొత్తాలను వెచ్చించి ఆర్థికంగా సౌష్ఠవం పొందటానికి ప్రభుత్వం ప్రయత్నించుట అవసరం. తాత్కాలికాభివృద్ధికని చెరువుల మరమ్మత్తులకు బావుల నిర్మాణానికి వెచ్చించే ధనమును, శాశ్వత పునాదులు వేయడానికి వినియోగించినచో, నేడు జరుగుచున్న దుబరా తగ్గగలదు. ఆచరణలో నిర్మాణాత్మకమైన అభివృద్ధి ప్రణాళికవలన కరువుకాటకాల నుండి ప్రజలను రక్షించుకొనవచ్చును.

విశాఖ జిల్లా గ్రామాల పరిస్థితి

సహజస్థితి

విశాలాంధ్రంలో విశాఖజిల్లా తలమానికము కాదగిన అవకాశములున్నవి. భూములు చాలా సారవంతములయినవి. నీటి సదుపాయములు గలుగజేసిన సృష్టి సంపద కాలవాలమై ప్రసిద్ధికి రాగలదు. అన్ని రకములైన ముడిపదార్థములు వ్యాపార పంటలు పండును. ఈ జిల్లా ఆర్థికాభివృద్ధి దేశాభివృద్ధికి ఎక్కువ తోడ్పడును. యింత విశాలమైన జిల్లా అన్ని జిల్లాలకంటె హెచ్చు జనాభా కలిగి అవకాశములు లేక చాలా వెనుక బడియున్నది. నీటి సదుపాయములున్న యెడల ఆంధ్రరాష్ట్రమునే కరువుకాటలలో భరించగలదు. పరిశ్రమల నెలకొల్పుట కనువైన ప్రదేశం. యిప్పటికే ఆంధ్రజిల్లాలన్నిటికంటె ముఖ్యపరిశ్రమలున్నవి. చెరుకు, నార, వేరుశనగ బాగా అభివృద్ధి చెందుటకు అవకాశములున్నవి. విశాఖపట్టణం ఆంధ్రదేశంలో ముఖ్యమైన నౌకా కేంద్రం. నౌకావ్యాపార మభివృద్ధి గాంచకల అన్ని సౌకర్యములు యున్నవి. ఆర్థికముగా అన్ని జిల్లాలకంటే హెచ్చు సంపదను సృష్టించగలదు. యిటువంటి జిల్లాకు ప్రత్యేక శ్రద్ధ వహించుట ప్రభుత్వ కర్తవ్యము. యీ జిల్లా సత్వరాభివృద్ధి దేశాభివృద్ధి కెంతగానో తోడ్పడగలదు. నేటి వరకు యీ జిల్లా వెనుకబడియుండుటకు గల కారణములు గుర్తించి ప్రభుత్వం శద్ధ వహించాలి. ఆంధ్రరాష్ట్రములో అన్ని జిల్లాలకంటె వెనుక బడి యున్నదన్న సంగతి మరువగూడదు. రాష్ట్ర మొత్తముపై జిల్లాలవారిగా వేసే అభివృద్ధి ఈ జిల్లాకు చాలదు. యీ జిల్లా చరిత్రనుబట్టి నైసర్గికస్థితి ననుసరించి దేశాన్ని ఎదుర్కొన్న ఆహారక్లిష్ట పరిస్థితులదృష్ట్యా సత్వరాభివృద్ధి చెందగల అవకాశాల నుపయోగించుకొనుటకు ఈ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అవసరం. ఆర్థిక వైజ్ఞానికాభివృద్ధిని పెంపొందింపజేసే యితర సౌకర్యాలు కలుగజేయుట ప్రభుత్వ కర్తవ్యము.

ఈ జిల్లాలోగల శాసనసభ్యులు ముఖ్యముగా గుర్తించి అన్ని విధముల వెనుకబడి యున్న యీ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వము గుర్తింపజేసి తగినసౌకర్యాల నిమిత్తం కృషి చేయాలి. యింత విశాలమైన జిల్లాకు శాసన సభలోగూడా చాలినంత బలము లేకపోలేదు. అధికార అనధికార సభ్యులంతా కలసి ఐక్యతతో యీ జిల్లా అభివృద్ధికి కృషిచేయుట వారి కనీస ధర్మం. అత్యవసరం. ★

ఆంధ్రపత్రిక—సచిత్ర వారపత్రిక
1950 జులై 26
సంచిక నుంచి

నువ్వు నపుంసకుడివా?

హిప్నాటిజం నిన్ను మొగాళ్లలో మొనగాణ్ణి చేస్తుంది

నువ్వు ఏ కారణంవల్ల నపుంసకుడివైనా హిప్నాటిజం తిరిగి నిన్ను మగవాడిని చేస్తుంది. నీ అంగం చిన్నదైపోయి ఉండవచ్చు. నువ్వు హస్తప్రయోగం చేసుకుంటూ ఉండవచ్చు. నీ లేపనశక్తి తగ్గిపోయి ఉండవచ్చు లేదా పూర్తిగా కోల్పోయి ఉండవచ్చు. స్త్రీని ముట్టుకున్నంతనే, చూచినంతనే, తలచుకున్నంతనే నీకు వీర్య స్ఖలనమైపోవచ్చు. కలలో కడివెడు వీర్యం పడిపోవచ్చు. స్త్రీని చూస్తే భయం కలగవచ్చు. పెళ్ళంటే భయం కలగవచ్చు. పెళ్ళాన్ని చూచి పారిపోవచ్చు. ఈ బాధపడలేక ఆత్మహత్యే గతి అనుకోవచ్చు. ఇప్పటికే నువ్వు బస్తాలకొలదీ మందులు మింగి ఉండవచ్చు. దాక్టరమ్మ ల చేతిలోపడి 'షాకులు' తిని ఉండవచ్చు.

ఈమందులు, మాకులు, షాకులు భౌతిక పదార్థాలు. భౌతిక శాస్త్ర సిద్ధాంతాలమీద ఆధారపడిన ఈ వైద్య శాస్త్రాలవల్ల నీకు ఎంత మాత్రమూ మేలు కలిగి ఉండకపోవచ్చు. కానీ—

హిప్నాటిజం నీ నపుంసకత్వాన్ని నిర్మూలిస్తుంది. నిన్ను మొగాళ్ళకు మొనగాడిని చేస్తుంది. హిప్నాటిజం భౌతిక ధర్మాలకంటే శక్తివంతమైన మహాధర్మశాస్త్రం. ఈ శాస్త్రం వల్ల నీ శరీరం నీ మనస్సు చెప్పినట్లు వింటుంది. నీ మనస్సు నువ్వు చెప్పినట్లు నడుస్తుంది.

హిప్నాటిజం భారతీయ యోగశాస్త్రంలోని మానసిక విభాగం.

హిప్నాటిజం వల్ల నీ మొగతనం తిరిగి వస్తుంది. అంతేకాదు వీర్యస్తంభన శక్తి కలుగుతుంది. నువ్వు కావాలనుకునే వరకు వీర్య స్ఖలనము కాదు.

అమ్మాయ్ నీకు మొగుడంటే భయమా!

చాలామంది స్త్రీలకు సంభోగ వాంఛ ఉండదు. కొందరికి సంభోగంలో సుఖముండదు. కొందరికి భరించరాని బాధ కలుగుతుంది. మరి కొందరికి సంభోగమంటే రోత. అసహ్యం.

వీరందరూ మేడివళ్ళలా ముద్దొస్తుంటారు. మొగుడు దగ్గరకొస్తే మాత్రం రాయై పోతారు. పైగా వీరికి మొగుడి మీద పల్లమాలిన ప్రేమ. "మా భర్తల్ని మేము పవిత్రంగా ప్రేమిస్తున్నాం. మాకు తుచ్ఛమైన కామ దాహంలేదు" అంటారు వీరు. కానీ వీళ్ళ మొగుళ్ళు మాత్రం ఈ ప్రేమమూర్తుల బాధపడలేక వీళ్ళను చంపి తాముకూడా చావాలనుకుంటారు.

ఈ పవిత్ర ప్రేమ రోగాన్నే ఇంగ్లీషులో "ఫ్రిజిడిటీ" అంటారు. ఆడ శరీరమేగాని, ఆడ మనస్సులేని ఈ ఫ్రిజిడిటీ రోగాన్ని హిప్నాటిజం తగ్గిస్తుంది. పరిపూర్ణమైన స్త్రీత్వాన్నిస్తుంది. సర్వనాశనమైపోడానికి సిద్ధంగా వున్న సంసారాలను స్వర్గధామాలుగా మార్చివేస్తుంది.

ఎక్కడా తగ్గని రోగాలను హిప్నాటిజం తగ్గిస్తుంది

దేశ విదేశాలలోని స్పెషలిస్టులుకూడా తగ్గించలేని రోగాలను హిప్నాటిజం తగ్గిస్తుంది. నత్తి, చెముడు, ఆస్మా, గుండె జబ్బులు, మానసిక వ్యాధులు— ఒకటేమిటి? మనిషి పుట్టిన దగ్గర నుంచి పోయేవరకు వచ్చే రోగాలన్నిటినీ హిప్నాటిజం అద్భుతంగా తగ్గిస్తుంది.

వైద్య సలహాకు రు.5/—లు ఎమ్.ఓ. చేయండి. మీ వ్యాధిని గురించి వివరాలు వేరే పుత్తరం వ్రాయండి. దానితో ఎమ్.ఓ.రశీదు కలిపి పంపండి. మీ వ్యాధిని గురించి ఏమి చెయ్యాలో, మీరు హైదరాబాద్‌కు ఎప్పుడు రావాలో తెలియచేయబడుతుంది.

పోస్టు ద్వారా చికిత్స చేయడానికి వీలుపడదు.

డాక్టర్ వాసూస్ హోమియోపతీ
యోగ అండ్ హిప్నోథెరాపీ హాస్పిటల్, హెచ్.ఐ.జి.,
బ్లాక్ 4, బాగ్ లింగంపల్లి (చింతతోట),
హైదరాబాద్-500044

వ్యక్తిగతం



బందరు శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీ వడ్డి రంగారావు కాంగ్రెసు (ఐ) పార్టీ అభ్యర్థి శ్రీ చిలంకుర్తి వీరాస్వామిపై 13,337 వోట్ల మెజారిటీతో ఘనవిజయాన్ని సాధించారు...

అసిఫ్‌నగర్ శాసనసభ నియోజకవర్గం ఉపఎన్నికలో మజ్లిస్ అభ్యర్థి డా. ఎం.ఆర్.ఖాన్ తెలుగుదేశం అభ్యర్థి శ్రీ జి. నారాయణరావుపై 1700 ఓట్ల మెజారిటీతో గెలిచారు...





కర్నాటకకి చెందిన ఉమేష్ హడిమణి వయస్సు 10 సంవత్సరాలు గణితంలో అసాధారణ ప్రజ్ఞగల బాలమేధావిగా కర్నాటక ప్రభుత్వం ఇతనిని గుర్తించి సంవత్సరానికి రు. 5వేల చొప్పున 10 సంవత్సరాలపాటు కొనసాగే ఉపకార వేతనాన్ని మంజూరు చేసింది. 4, 5 అంకెలు గల సంఖ్యల గుణకారాలని కూడా ఇతను క్షణాల్లో, నిమిషాల్లో నోటి లెక్కగా చెప్పగలడు. మామూలుగా ఒక వ్యక్తి కాగితం, కలం పట్టుకుని చేస్తే పదినిమిషాలు పట్టే లెక్కని ఉమేష్ అవేమీ అక్కరలేకుండానే 2 నిమిషాల్లో మనసులోనే చేసి కచ్చితంగా జవాబు చెప్పగలడు. రాకేష్ శర్మ అంతరిక్షయానంపై అడిగిన ఒక కష్టసాధ్యమైన లెక్కని ఈ బాలమేధావి కేవలం 90 సెకండ్లలో చెప్పగలిగాడు. 56,129×1872 ఎంత? అన్న ఒక విలేఖరి ప్రశ్నకి సరైన సమాధానం 3 నిమిషాల్లో చెప్పగలిగాడు. కానీ ఆ విలేఖరి దగ్గర ఉన్న కాలిక్యులేటర్ మాత్రం అన్ని అంకెలుగల అంత పెద్ద సంఖ్యని తన తెరపై ఇముడ్చుకోలేక మూగబోయింది ...

వారఫలం

15-6-1984 శుక్రవారం మొదలు 21-6-1984 గురువారం వరకు

♈ మేషం: వ్యాపారం బాగా సాగటానికి అవకాశమున్నది. నూతనాంశాలు గ్రహింపునకు రాగలవు. వ్యవహారం ఏదయినా ఉంటే పరిష్కరింపబడగలదు. రాజకీయంగా మేలు చేకూరుట నిశ్చయం. స్త్రీలకు: నూతనాంశాలు గ్రహింపునకు రావటం, ఉద్యోగ వసతి ఏర్పడటం గ్రహింపదగినది.

♉ వృషభం: భూమిగాని, యిల్లుగాని, విలువగల వస్తువులుగాని విక్రయించవలసిన పరిస్థితి ఉంటుంది. అప్పులు చేయుటం చేతనో, భారీ వ్యాపార నిమిత్తమో ఈ పని కొందరకు తప్పనిసరి అయిపోతుంది. చాల కాలంగా చేతికి అందని డబ్బును గూర్చిన ప్రయత్నాలు యింకా అవసరమే. రాజకీయంగా పెద్దగా అనుకూలత లేదు. మిత్రద్రోహానికి గురికాగలరు. స్త్రీలకు: వస్తుసేకరణ, దూర ప్రయాణాలకు ఆస్కారం గలదు.

♊ మిథునం: స్థిరాస్తిని గూర్చి శ్రద్ధ గైకొనవలె. ఆదాయం అంతంత మాత్రమే అపకారం ఎవరివలన జరుగదనుకొన్నారో వారి మూలాననే యిబ్బందులు తటస్థింపనున్నవి. కాని వారిని ఒక కంట కనిపెట్టవలసిన అగత్యమున్నది. స్త్రీలకు: ప్రయాణ సూచన, అధిక వ్యయం గలవారం.

♋ కర్కాటకం: ప్రజారంగంలో మీకు పేరు ప్రతిష్ఠలు రానున్నవి. పత్రికా ప్రచురణలో, రచనలో చాలమందికి సదవకాశాలు లభించగలవు, యత్నకార్యసిద్ధి. అప్రయత్నధనాదాయమున్నది. మీరు ఎంతగా శ్రమిస్తే అంత మేలు గలదని గ్రహించాలి. స్త్రీలకు: నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు, పెద్దల ఆదరణ చేకూరుతుంది.

♌ సింహం: పదిమందిలో ప్రసిద్ధి ఏర్పడు అవకాశాలుంటాయి. నూతనవిధాన ఆదాయమున్నది. శుభకార్యం నిమిత్తం మీరు చేసే యత్నాలు ఫలింపనున్నవి. స్థిరాస్తి పెంచే యత్నాలు శ్రేయోదాయకం కాగలవు. స్త్రీలకు: యత్న కార్యానుకూలం, విశిష్ట వస్తుసేకరణకు అవకాశం చేకూరగలదు. మిత్రుల మూలాన మేలు చేకూరుతుంది.

♍ కన్య: విద్యావైజ్ఞానికంగా మీకు పెంపు కనిపిస్తుంది. వ్యవహారం ఏదైనా పరిష్కరింపబడాలంటే అనుకూల వారం. మీ ఆలోచనలు ఫలితానికి రాగల వారం. వస్తు వాహన సేకరణకు అనుకూలమున్నది. సజ్జన సాంగత్యం చేకూరుతుంది. సభా సత్కారాదులలో పాలుపంచుకో గలుగుతారు. స్త్రీలకు: ఉద్యోగమందు పెంపు కనిపిస్తుంది, కొందరకు 'ట్రాన్సుఫరు' తప్పనిసరి అవుతుంది.

♎ తుల: ధనలబ్ధికి, వృత్తియందు అభివృద్ధికి, వ్యాపారమందు వృద్ధి, రాజకీయమందు అనుకూలత ఏర్పడగల వారం. దూర బంధువులు యింటికి రానున్నారు. వారికై బాగా శ్రమించవలసిన అగత్యం ఎంతైనా ఉన్నది. స్త్రీలకు: వ్యవహార రంగాన అనుకూలత చేకూరుతుంది.

♏ వృశ్చికం: వ్యాపారం విస్తరించే కార్యక్రమమందు నిమగ్నులు కాగలరు. అన్ని రంగాలలో మీకు అభివృద్ధి కనిపిస్తుంది. రచనా వ్యాసంగంలో మీ ఆశయం ఫలిస్తుంది. అవసరాలకు తగినంత ద్రవ్యం చేకూరుటకు ఆక్షేపణలేదు. స్త్రీలకు: అధికారం అభివృద్ధి వందగలదు. ధనాదాయానికి లోటులేదు.

♐ ధనుస్సు: నూతనాంశాలు గ్రహిస్తారు. పెద్దల వలనగాని, ధనవంతుల మూలంగా జరుగవలసిన వ్యవహారాలు హాయిగా జరిగిపోతాయి, వెనుకటి మాదిరి అంతరాయాలుండవు కొందర విషయం, అప్రయత్నంగా ధనాదాయం లభింపగలదు. స్త్రీలకు: అనుకోకుండా బంధువులో, మిత్రులో యింటికి రానున్నారు.

♑ మకరం: ఇదివరలో ఒకటిరెండు మార్గాలలో మీకు యిబ్బంది కలిగించినవారు, దూరంగా పోతారు. ఒక ముఖ్య వ్యవహారం సర్దుబాటు చేసికొనుటకై ఆస్తిని విక్రయించే ప్రయత్నం కొందర విషయంలో చెప్పదగిన ముఖ్యాంశం. రాజకీయంగా కొందరకు మేలున్నది. స్త్రీలకు: ఆశించిన విధాన ధనం చేకూరగలదు. ముఖ్యబంధువుల నుండి సంతోష వార్తా శ్రవణం.

♒ కుంభం భారీవ్యాపారం కొనసాగించే వారికి అనుకూలత గలదు. విద్యా రంగంలో కొందరకు ప్రసిద్ధి చెప్పదగిన అంశం. విలువగల వస్తు సేకరణకు, కొందరకు వాహనం సమకూర్చుకొనుటకు అవకాశమున్నది. స్త్రీలకు: నూతనాంశాలు గ్రహింపుటకు, నూతన మార్గాన ధనలబ్ధికి అవకాశం గలదు

♓ మీనం: స్థిరాస్థి పెంపకానికి కొందరు, నూతన గృహ నిర్మాణానికి కొందరు, విలువగల వస్తు వాహనాలు సేకరించుకొనుటకు కొందరు చేసే ప్రయత్నాలు కొనసాగుతాయి. మీ ఆదాయమందు అభివృద్ధి కనిపిస్తుంది. సాటివారి పోటీని తట్టుకోవలసిన పరిస్థితులుంటాయి, గమనించి మెలగాలి. స్త్రీలకు: ఉద్యోగరీత్యా మీరు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. అంతో యింతో ధనాదాయం కూడా ఉన్నది. బంధువులు అనుకోకుండా యింటికి చేరనున్నారు. గ్రహించాలి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి *

అవీ... ఇవీ... అన్నీ...

'ఈ చదువులు మాకొద్దు' వ్యాసరచన పోటీలో విజేతలకి బహుమతి ప్రదానోత్సవం

రంగనాథ్ కల్చరల్ యూనిట్, విజయవాడ వారు 'ఈ చదువులు మాకొద్దు' చిత్రంపై నిర్వహించిన వ్యాసరచన పోటీ బహుమతి ప్రదానోత్సవ సభ మే 20న స్థానిక రోటరీ ఆడిటోరియంలో జరిగింది. శ్రీ తుర్లపాటి కుటుంబరావు అధ్యక్షత వహించారు. చిత్రదర్శకుడు శ్రీ వేజెళ్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకి హీరో రంగనాథ్ బహుమతి ప్రదానం చేశారు. శ్రీ జె. సత్యనారాయణ ప్రసంగించారు.

పోటీలో మొదటి బహుమతి రు. 516/– శ్రీ ఎన్. ఎస్. ప్రకాశరావు (పాలకొల్లు)కి, రెండవ బహుమతి రు. 316/– శ్రీ శ్రీనివాస మూర్తి (కాకినాడ)కి, మూడవ బహుమతి కుమారి జి. రాజేశ్వరి (విశాఖ)కి లభించాయి. మరో 20 మంది వ్యాస రచయితలు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ప్రారంభంలో సంస్థ కార్యదర్శి శ్రీ బి. విద్యాసాగర్ స్వాగతం పలికారు. సంస్థ అధ్యక్షుడు శ్రీ రమణశ్రీ నివేదిక చదివారు. ఉపాధ్యక్షుడు శ్రీ కె. ఎస్. రామకృష్ణ వందన సమర్పణతో సభ ముగిసింది.

అనంతరం బేబి మృదుల భరతనాట్య ప్రదర్శన జరిగింది.

తెలుగు విజ్ఞాన సమితి రజతోత్సవాలు

బెంగుళూరులో తెలుగు విజ్ఞాన సమితి రజతోత్సవాలు ఇటీవల జరిగాయి. కర్ణాటక రాష్ట్ర విద్యాశాఖమంత్రి శ్రీ బి. రాచయ్య ప్రారంభోత్సవం చేశారు. శ్రీమతి బి. జయమ్మ, శ్రీమతి బి. జయంతి (సినీతార) నాటక పోటీలకు ప్రారంభోత్సవం చేశారు. సమితి అధ్యక్షులు శ్రీ రాధాకృష్ణరాజు స్వాగత వచనాలు పలికారు. డా॥ సి. నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. కర్ణాటక రాష్ట్ర గౌరవ విద్యాశాఖ మంత్రి శ్రీ వై. పిచ్చిరెడ్డి వందన సమర్పణ చేశారు.

రెండవ రోజున నాటక పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మంత్రి శ్రీ ఆనంద గజపతిరాజు అధ్యక్షత వహించారు. సినీ దర్శకుడు శ్రీ దాసరి నారాయణరావు నాటక విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సమితి కోశాధికారి శ్రీ వి. దత్తు వందన సమర్పణ చేశారు.

హైదరాబాదులోని కన్నడ కళా భవనానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు మంజూరు చేసినట్లే కర్ణాటక ప్రభుత్వం కూడా శ్రీ కృష్ణదేవరాయ కళా మందిర నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు మంజూరు చేయాలని శ్రీ వి. రాధాకృష్ణరాజు కోరారు. ముఖ్య అతిథిగా కర్ణాటక మంత్రి శ్రీ జీవరాజు అల్వా విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి శ్రీ నాదెండ్ల భాస్కరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అవతరణని సమర్థించారు. అనంతరం రాష్ట్ర కోశాధికారి శ్రీ దొరస్వామి వందన సమర్పణ చేశారు.

రజతోత్సవాల చివరి రోజు కార్యక్రమాలలో సుప్రసిద్ధ సినీ నటుడు శ్రీ. అక్కినేని నాగేశ్వర రావు పాల్గొన్నారు. సినీ నటుడు శ్రీ కృష్ణంరాజు అధ్యక్షత వహించారు. శ్రీ డి. ఆర్. శ్రీనివాసమూర్తి వందన సమర్పణ చేశారు. ★

హైదరాబాదు నోట్‌బుక్

పుళుమావి — శరవణభవుడు :

తెలుగుదేశంలోని ప్రాకృత శాసనాలలో విచిత్రమైన తెలుగు పదాలు కనిపిస్తాయి క్రీస్తుశకం మొదటిశతాబ్దంవాడయిన పుళుమావి వేయించిననాణెలలో ఒకవైపు రాణో వాసిట్టిపుతస సిరి పుళుమావిస అని ప్రాకృతంలోను,మరొకవైపు అరహణకు వాహిట్టి మాకణకు తిరుపుళుమావికు అని తెలుగులోను వాక్యాలున్నాయి. సాతవాహనుల ఇక్ష్వాకుల శాసనాలలో మహాతలవర, పేర్మాడి, ఏహువల, ఏవిశ్రీ, ఏలిఏ, హావలదాస, కొడబలి, చాంతమూల, ఏహువలచాంతమూవి, కొడరక, చాంతసిరి, చాతసిరి మొదలయిన తెలుగు పేర్లు కనిపిస్తాయి. వీటి అర్థమేమిటని చరిత్రకారులు, పురాతత్త్వజ్ఞులు చాలకాలంగా ప్రయత్నించారు. ఈ ప్రయత్నం మరొకమారు మే 13న తెలుగు భాషా సమితి భవనంలో జరిగిన తెలుగు గోష్ఠి సమావేశంలో కొనసాగింది. తెలుగు గోష్ఠి తెలుగు భాషా వాఙ్మయ చరిత్ర పురాతత్త్వాదుల పరిశోధనాధ్యయాలకై, సత్యాన్వేషణైక దృష్టితో నెలకొన్న విద్వత్సమితి. దీని చర్చలలో ఎవరైనా నిర్భయంగా మాట్లాడవచ్చు. తరతమత లేమీ లేవు. పుళుమావి నాణెంమీది అరహణకు వాహిట్టి మాకనకు అనేవి అరసుయొక్క వాసిష్ఠి పుత్తునియొక్కపుళుమావి యొక్క శాసనం అని అర్థం యొక్క విభక్తి ప్రత్యయం తర్వాతిదని మొదట్లో కు ప్రత్యయమే వాడేవారని, మాకనకు మకనకు అనే రూపాలున్నాయి గనుక, నేడు తమిళ, కన్నడ, మలయాళాలలో పుత్ర వాచకమైన మగన్, మకన్ శబ్దాలున్నాయిగనుక మాకన, మకన అనేవి పుత్రవాచకమని స్పష్టమని నేడు మగశబ్దం పురుషవాచక, పతివాచకమయినా, మగ బిడ్డ, ఆడు బిడ్డ అనే వ్యవహారంలో మాత్రం మిగిలిందని చర్చలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. పుళుమావి పదచర్చ సందర్భంలో పూర్వకాలంలో పలుతెగలకు యుద్ధ దైవం వుండేదని, ఇలాటి తెగలు ఒకటిగా కలిసి పోయిన తర్వాత యుద్ధదైవాలు కూడ కలిసి పోవడం సంభవించిందని, తెలుగు రాజులకు కార్తికేయుడు యుద్ధదైవమని, కార్తికేయుని జన్మ కథను బట్టి ఆ దైవం పెక్కు తెగల దైవాల కలయిక అని స్పష్టమవుతున్నదని, స్కందుడు శరవణభవుడు గనుక పుళుమావి అలాటి దైవమని, పుళు గడ్డిలో మావి జన్మించిన వాడని దీని అర్థమని, స్కందుడు ప్రాచీన దేశీ దైవమై వుండి తర్వాత శివకుమారుడుగా మారాడని శ్రీ చీమకుర్తి శేషగిరిరావు అన్నారు ఈ సూచన సమంజసంగా వుందని డాక్టర్ పుచ్చా పరబ్రహ్మశాస్త్రి (సుప్రసిద్ధ చరిత్ర కారులూ, లిపి శాస్త్రజ్ఞులు)సమర్థించారు. మహాతలవర, తలవర పదాలు పూర్వం నగరరక్షకుడైన పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు వాడేవారని, అది క్రమంగా తలారిగా నేడు వెట్టివాడి వ్యవహారంలో నిలిచిందని, ఇది పూర్తిగా తెలుగు పదమని డాక్టర్ పరబ్రహ్మశాస్త్రి అన్నారు. తమిళంలోని తలైవర్ పదం ముఖ్యుడు, అధ్యక్షుడు అనే అర్థాన్ని తెలుపుతుంది. కన్నడంలో తళవార ఇంటి పేరుగల బ్రాహ్మణ వంశాలు వున్నాయి వీరు పూర్వం నగర రక్షకులుగా వుండివుంటారు, తల + వర రెండూ కలసి తలవర, తళవార శబ్దం ఏర్పడి వుంటుందని చర్చ జరిగింది పేరాడికి పెద్ద ఇంటివాడు అని అర్థం. పూర్వం దొరలకో, అంతటివారికో పెద్ద ఇళ్ళుండేవి. ఈజిప్టులోని ఫారో—ఫేరో శబ్దం ఇలాటిదే పేర్ + పెద్ద, ఓ + నివాసం ఇల్లు కలవాడు, రాజు అని అర్థం. అని శ్రీ శేషగిరిరావు అన్నారు. ఏహువీల, ఏలిశ్రీ, ఏలి అనేపదాలు స్థానిక దేవతల పేర్లయి వుంటాయని,ఇవే అహోబిలా,ఓబల,ఎల్ల అని వివిధ రూపాలుదాల్చాయని,వేలుకొండ ఇలాటిదేనని,ఏల్చు వేల్పు సమానార్థకాలని,స్థానికులకు,వెలుపలనుంచి వచ్చిన వారికీ కలిగిన సామరస్యం కారణంగా, ఈ దేవతల పేర్లు ప్రాకృత భాషలో కూడ గ్రహించి వుంటారని డాక్టర్ పరబ్రహ్మశాస్త్రి అన్నారు. కొడబలి అనేది కూడలి నుంచి వచ్చింది కావచ్చు నని మూలశబ్దం మరాఠీలో పుత్రవాచకంగా వుంది గనుక చాంతమూల అంటే చాంతుని కుమారుడని అర్థమని, శ్రీ శేషగిరిరావు అన్నారు. పిదప శ్రీ తిరుమల రామచంద్ర 9వ శతాబ్దం ప్రాకృతగాధా సంకలనమయిన వజ్జాలగ్గంలోని తెలుగు పదాలపై వ్యాసం చదివారు. వింతర, వేలియా, అవట్టుఇ, దురుదుల్లఇ, వలోహడ వంటి పదాలు తెలుగని ఇవి వింత, వెలయాలు, వట్టిపోవు, దొర్లు అనే తెలుగు పదాల ప్రాకృత వేషాలని ఆయన వివరించారు. ఈ చర్చలలో శ్రీ పాతూరి రామశాస్త్రి, శ్రీ చింతా వేంకటేశ్వర్లు (నాగార్జున కళాశాల లెక్చరరు) డాక్టరు ముదిగొండ వీరభద్రశాస్త్రి మున్నగు వారు పాల్గొన్నారు.

ఉపశ్రుతి :

లిటిల్ థియేటర్, నాటక అకాడెమీల ఆధ్వర్యంలో కూర్మా వేణుగోపాలస్వామి స్మారక నాటికల పోటీలు రవీంద్రభారతిలో మే 14న ప్రారంభమయినప్పుడు శ్రీ భండారు అనేవారు ప్రార్థన ప్రారంభించి గురుస్సాక్షాత్పర బ్రహ్మ అని చదివారు. నా ప్రక్కన కూర్చున్న సుప్రసిద్ధ కవి శ్రీ కె. శివారెడ్డి "ఏం మాస్టారూ, పరంబ్రహ్మ అని అనాలి కదా. పర బ్రహ్మ అంటున్నాడేమిటి ఈయన ?" అని అడిగారు. ఆయన బ్రాహ్మ సమాజం వారయి వుంటారేమో అన్నారు ఈ ప్రక్కన కూర్చున్న మరొకరు.

— తిరుమల రామచంద్ర★


హైదరాబాదులో ప్రాచ్యలిఖిత గ్రంధాలయం త్రైమాసిక పరిశోధన పత్రిక 'విజ్ఞానసరస్వతి' ఆవిష్కరణ సభలో శ్రీ విఠలదేవుని సుందర శర్మ (వక్త), ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త శ్రీ ఆవుల సాంబశివరావు (ఆవిష్కర్త), సభాధ్యక్షులు డా. భద్రిరాజు కృష్ణమూర్తి, సంస్థ ప్రచురణలని బహూకరిస్తున్న గ్రంధాలయం డైరెక్టరు డా॥ వి. వి. ఎల్. నరసింహారావు గార్లని చిత్రంలో చూడవచ్చు.



Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrishna, Phones : P. B. X. : 61247, 61248 & 75667.



"జ్ఞాపకాల మూట విప్పుతాను..." Jaya Sudha



"....గతంలోకి కాస్త తొంగి చూసుకుంటాను.

తొలి తొలి యవ్వనంలో మొట్టమొదటి చిత్రంలో అవకాశం రావడం.

అప్పుడప్పుడే చిత్రరంగంలో అడుగుపెట్టడం, నటించడం, నృత్యం చేయడం, నట జీవితంలో పూర్తిగా లీనమైపోవడం.


అబ్బ, అవన్నీ ఆలోచిస్తుంటే ఎంత ఆనందం!

అంతేనా! నా చర్మ సౌందర్యానికి సౌమ్యంగా పరిచర్యచేసే లక్స్ గురించి తెలుసుకోగలగడం ఎంత అదృష్టం!"

శుద్ధమైన సౌమ్యమైన లక్స్- సినిమా తారలకు సౌందర్యాన్నిచ్చే సబ్బు

HLL-1130

హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ వారి విశిష్ట ఉత్పాదన.



kiron/apco/84 g6